
ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 7 ఏప్రిల్ - 2021 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



# సాహిత్య ప్రస్థానం

## భాషకే కాక తెలుగు భావనకూ ఎసరు ?

**రా**ష్ట్రంలో ఒకటవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకూ ఇకపైన కేంద్రం ప్రభుత్వ సిలబస్ సిబిఎస్‌సి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యారంగాన్ని మౌలికంగా మార్చి వేసే ఇంతటి కీలకమైన నిర్ణయం తీసుకునేముందు విద్యారంగ నిపుణులతో, ఉపాధ్యాయ విద్యార్థి సంఘాలతో కనీసం చర్చ కూడా జరిపింది లేదు. ఈ నిర్ణయం భారతదేశంలో భాషా రాష్ట్రాల వైవిధ్య సంస్కృతికి మాత్రమే గాక రాజ్యాంగం రాష్ట్రాలకిచ్చిన హక్కులకు కూడా తీవ్ర విఘాతం కలిగించేలా ఉంది. భిన్నత్వంలోని ఏకత్వాన్ని గమనంలో ఉంచుకునే మన రాజ్యాంగ నిర్మాతలు విద్యను పదకొండవ షెడ్యూల్లో ఉమ్మడి జాబితాలో చేర్చారు. గత ఆగస్టులో కేంద్రం విడుదల చేసిన ఎన్‌ఇపి 2020 ఏక్‌భారత్ శ్రేష్టభారత్ పేరిట విద్యారంగంలో రాష్ట్రాల పాత్రను పూర్తిగా తన చేతుల్లోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి భంగకరంగా ఉందని పలు రాష్ట్రాలు అభ్యంతరం చెప్పాయి. సంస్కృతాన్ని కూడా తప్పనిసరిగా విధించే ఆలోచన దీనిలో ఉందని ప్రసిద్ధ విద్యావేత్తలు వ్యాఖ్యానించారు. ఏదైనా నేర్పించడం తప్పు కాదు కానీ, తిరోగమన కోణంలో బలవంతంగా రుద్దడం పొరబాటవుతుంది.

చారిత్రికంగా ఒక ప్రత్యేకత కలిగిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఏకంగా కేంద్ర విధానాన్నే తెచ్చిపెట్టేయడం తెలుగు విద్యార్థుల, అధ్యాపకుల స్వేచ్ఛను హరించే నిర్ణయం. ఇప్పటికే అప్రజాస్వామికమైన రీతిలో ఇంగ్లీషు మీడియాన్ని మొత్తంగా తీసుకొచ్చి తెలుగులో చదువుకునే అవకాశాన్ని కుదించారు. ఇప్పుడు స్థానిక అవసరాలు, సంస్కృతీ సంప్రదాయాలు, ప్రత్యేకతలకు సమాధి కట్టే కేంద్ర విద్యావిధానాన్ని నెత్తిన పెట్టుకోవడం మరింత అవాంఛనీయం. సిబిఎస్ఇ సిలబస్ చదువుకోవడానికి ఇప్పుడు రాష్ట్రంలో ఏర్పాట్లు ఉన్నాయి. సిబిఎస్ఇలో ఏమైనా మంచి విషయాలుంటే వాటిని మన విధానంలో చేర్చుకోవడం వేరు, మన రాష్ట్ర విధానానికి పాతర వేసి కేంద్రం పెత్తనానికి జై కొట్టడం వేరు. ఇక మీదట ఆంధ్రప్రదేశ్‌కు ఒక విద్యా ప్రణాళికే అవసరం లేదని ఏలినవారు భావించడం ఊహకందని విషయం. ఇంగ్లీషు మీడియం విధింపుపై సుప్రీంకోర్టు తుది తీర్పు రావల్సి వుండగా– ఈలోగా ఇంత పెద్ద మార్పు చేస్తే విద్యారంగం కకావికలమవడం తథ్యం. అందులోనూ పేద మధ్య తరగతి పిల్లలు, వెనకబడిన వారు, దళిత వర్గాల ప్రయోజనాలే దెబ్బ తింటాయి. సిబిఎస్ఇ సిలబస్‌పై ఎవరికి ఏ ఆకర్షణలు వున్నా, కొంతమంది వంత పాడినా, దేశంలోని నిరుద్యోగానికి, సమస్యలకు ఆ విద్యార్థులు కూడా అతీతంగా లేరు. కేవలం కొన్ని తరగతుల్లో ఉన్న భ్రమలను సంతృప్తపర్చడానికి, కేంద్రం మెప్పు పొందడానికి తీసుకునే ఈ చర్య పర్యవసానాలు దీర్ఘకాలంలో దారుణంగా ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించడం ఉత్తమం. ■


| ప్రధాన సంపాదకుడు | సంపాదకవర్గం | బొమ్మలు |
|---|---|---|
| **తెలకపల్లి రవి** | **కె.సత్యరంజన్** | **తుంబలి శివాజి** |
| వర్కింగ్ ఎడిటర్ | **కెంగార మోహన్ ◆ వొరప్రసాద్** | **చిదంబరం** |
| **సత్యాజీ** | మేనేజర్ : **కె.లక్ష్మయ్య** | |

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


గోడలు – సింహ ప్రసాద్ ........................ 5
సరంగు – వంజరి రోహిణి ..................... 19
తులసి కొమ్మ – పెమ్మరాజు విజయ రామచంద్ర ..... 25
మానసం – కేశిరాజు వెంకట వరదయ్య ......... 31
ఫ్లాట్ ఫ్రెండ్స్ – కె ఉషారాణి ....................... 58


## కవితలు


అక్షరాల రైలుబళ్లు – సాంబమూర్తి లండ ............... 11
కర్ఫ్యూ – శ్రీనివాస రెడ్డి ........................ 13
రుతువున రుతువై ... – అడిగోపుల వెంకటరత్నమ్.... 14
ఎగిరి పో! .. – దారల విజయ కుమారి .................. 15
ప్రతిరోజూ ఉగాదే!.. – ఈదర శ్రీనివాస రెడ్డి .......... 15
అతనిపుడు ... చెల్లపిల్ల శ్యామల ......................... 17
ఒక సాయంకాలం – ఏటూరి నాగేంద్రరావు ...........24
కవితోదయం – భరత్ మూరిశెట్టి ..................... 24
ఆమనీ .. ఆలకించు! – చినమర వెంకట రమణయ్య.. 39
నాగలి నెత్తిన ... – కంచరాన భుజంగరావు ........ 43
కవిత్వమంటే ... – ఉప్పరి తిరు రమేష్ ........ 45
సజీవ స్పర్శ – డాక్టర్ పెరుగు రామకృష్ణ ........ 46
గాయాల తీరం – మామిడిశెట్టి శ్రీనివాసరావు ........ 47
కోకిల – సాంధ్యశ్రీ ....................... 47
మహోద్యమం – మండ ప్రభాకరరావు ........ 48
అతడికిప్పుడేం కావాలి? – పాయల మురళీకృష్ణ .... 52
మహా ప్రస్థానం – షేక్ మహబూబ్ జాన్ ........... 54
కాకెంగిలి ప్రేమ – సిరికి స్వామినాయుడు ............ 55
ప్రేమ సెలయేరు– పద్మావతి రాంభక్త ................. 57


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం మార్చి 2021 పురస్కారాలు ......... 8
మది నదిలో ఆహ్లాద భావాల ప్రవాహం–మద్దాల సునీల్ 12
సారంగ ధరియా .. సంవాదమేందయా?
– తెలకపల్లి రవి .................................. 17
శివారెడ్డి .. ఆ నలుగురూ ...
– కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి ..................... 22
నిజ జీవితాలకు అద్దం పట్టిన కథలు – కేశవ్ .......... 28
నివాళి : అస్తమించిన రాత్రి సూర్యుడు ..................35
మట్టి మాటలే కవిత్వమై.. –డా. బిరుసు సురేష్‌బాబు ......37
సాహిత్యం ప్రజలపరంగా రావాలి – నిఖిలేశ్వర్ ......... 40
అంతరాలపై అక్షరాస్త్రం – గిరిప్రసాద్ చెలమల్లు ........ 44
విస్తరిస్తున్న రైతు ఉద్యమం – కార్తికేయ ............... 49
70 ఏళ్ల క్రితమే ప్రగతిబాటన నడిచిన రథచక్రాలు
– చెరుకూరి సత్యనారాయణ ........... 53
డైరీ ........................................................ 62
స్వీకారం ..................................................65, 66



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# గోడలు

- సింహప్రసాద్
99892 24280

వినాయక చవితి.

పూజా మందిరం ముందు మనవళ్ళ పుస్తకాలు, పెన్సిళ్ళతో బాటు ఒక బౌండు పుస్తకం, కొత్త పెన్ను పెట్టాను. మిగతా సామగ్రి సర్దుతుంటే మావారు, కొడుకు, కోడలూ, పిల్లలూ వచ్చారు.

"ఈ లావు పుస్తకం ఎవరిదిరా" మా వారు అడిగారు.

"నాదేనండీ"

"నీదా? కొత్తగా ఈ అవతారం ఏంటోయ్. ఇంతకీ ఏం రాస్తావు, కథా? నవలా? నువ్వు మహా రచయిత్రివైపోతే ఇక నన్నంతా 'భానుమతి మొగుడు' అంటారేమోనోయ్!"

ఆయన నవ్వులాటకి అన్నా, నాకు మాత్రం చిరు సంతోషం, గర్వం కలిగాయి. కించిత్తు సిగ్గుగానూ అన్పించింది.

"బౌండ్ బుక్‌ని చూస్తోంటే కచ్చితంగా నవలే రాసి పడేసేట్టు వుంది. బయటి ప్రపంచం నీకేం తెలుసని ఏకంగా నవల రాయడానికి పూనుకున్నావమ్మా!" సుపుత్రుడి ముఖంలో, నవ్వులో వ్యంగ్యం కదిలింది.

"నిజమేరా. నాకు ఉద్యోగాలూ, కంప్యూటర్లూ, ఆఫీసులూ ఏమీ తెలీవు. అందుకనే నాకు తెలిసిన ప్రపంచం గురించే, నా గురించే రాద్దామనుకుంటున్నాను"

"కొంపతీసి ఆత్మకథ రాసేస్తావేంటోయ్" పెద్దగా నవ్వారు మా ఆయన.

"గృహిణిని. కొంప నిలబెడతాను గాని తీయను.." ఆయన మాటలు చురుక్కుమనిపించే సరికి ధీమాగానే జవాబిచ్చాను.

"నువ్వేమైనా రాణీ రుద్రమవా లేక ఏదైనా గొప్పది సాధించావా? ఏకంగా ఆత్మకథ రాసేసి జనం మీదకి వదిలెయ్యడానికి!" అబ్బాయి ఎత్తి పొడిచాడు.

నేను తొణకలేదు. "వాళ్ళవేనా కథలు? మా అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు, ఆవేదనలు, ఆనందాలు కథకి సరిపోవా?"

"ఈ మగాళ్ళ ధోరణి మీకు తెలిసిందేగా. వీళ్ళనీ, వీళ్ళ మాటల్నీ పట్టించుకోకండి ఆంటీ. పిల్లలు సెటిలయ్యారు. అంకుల్ రిటైరయ్యారు. ఇంత కాలానికి మీకు తీరిక దొరికింది. దాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరేం రాయాలనుకుంటే అదల్లా రాసేయండి."

"అత్తకి కోడలు సపోర్టు! డాడీ, ఇక నీ పని శ్రీమతే రామానుజాయ నమ:" చిడతలు వాయిస్తున్నట్టు నటించాడు మా అబ్బాయి.

"తిని కూర్చుని తెలుగు సీరియల్స్ రేటింగ్ పెంచకుండా ఆ గోల నీకెందుకోయ్" నా ముఖంలోకి చూస్తూ అన్నారాయన.

అంతా నవ్వారు. నా ముఖం జేవురించింది. ఉక్రోషం రాబోతుంటే నిగ్రహించుకున్నాను. 'వీళ్ళేదో సపోర్టిస్తారు, ప్రోత్సహిస్తారు లాంటి భ్రమలేం నాకు లేవు కదా' అని సరిపెట్టుకున్నాను.

"గ్రానీ, నీ కథలో యానిమల్స్ ఉంటాయా?" అని ఒక మనవడు అడిగితే, "నాకు పోకేమాన్ ఇష్టం. పోకేమాన్ గురించి రాయి గ్రానీ" అన్నాడు రెండోవాడు.

వాళ్ళ బుగ్గలు పుణికాను. "మీ మాటలు వింటోంటే అవీ రాసేయాలన్పిస్తోందిరా నాన్నా"

"నో డౌట్ డాడీ. ఇక వంటిల్లే నీ ఆఫీస్. నీ విశ్రాంత జీవితమంతా ఇక దానికే అంకితం!"

తండ్రీ కొడుకులు ఫెళ్ళున నవ్వుతోంటే నా ఒంటిమీద ఎర్రచీమలు పాకాయి. "నవ్వింది చాలు గాని ఇక పూజ మొదలు పెట్టండి. ముందు ఒక్కొక్కరూ వచ్చి దీపారాధన చెయ్యండి...."

యాంత్రికంగా వినాయక వ్రత కథ వింటూ పూజ చేస్తున్నాను గాని, వారన్న మాటలే బుర్రలో గిర్రుగిర్రున తిరుగుతున్నాయి.

నేను నా గురించి రాసుకోకూడదా? నా అంతరంగ భావాలు కాగితం మీద పరచకూడదా? నేనేదో కూడని పని చేస్తున్నట్టు మాట్లాడతారేంటి! ఈ మగాళ్ళకి వాళ్ళ పనులే గొప్పగా కనిపిస్తాయేమో!

"కొబ్బరికాయ కొట్టవోయ్. ఏంటా పరధ్యానం? కథ వినటం లేదా?" ఆయన అడిగారు.

"అప్పుడే మమ్మీ ఊహాలోక విహారయాత్రకెళ్ళిపోయింది డాడీ. నాన్నృషి:కురుతే కావ్యం అని ఎక్కడో చదివాన్లే"

"చాల్లెండి మీ పరిహాసాలు. మీకు ఆంటీ గురించీ తెలీదు, ఆడవారి గురించీ తెలీదు. మాకు పుట్టుకతోనే నాయకత్వ లక్షణా లు అబ్బుతాయి. మల్టీ టాస్కింగ్ చేయడం మా విజయ రహస్యం" మా అబ్బాయిని కసుర్తూ మా కోడలు అంది.

"మమ్మీ జిందాబాద్! మహిళ జిందాబాద్!" నవ్వుతూ అన్నాడు మావాడు.

"శుభ ప్రారంభం ఆంటీ. ఇక దూసుకుపోండి" మొగుడికి చురకవేసింది కోడలు.

అందరం కలిసి భోంచేస్తోంటే తమ్ముడు ఫోన్ చేసి బావగారికి చవితి శుభాకాంక్షలు చెప్పాడు.

"నాక్కాదోయ్ మీ అక్కకి చెప్పు. ఆవిడగారివాళ తన స్వీయ చరిత్రకి శ్రీకారం చుడుతోంది" అన్నారు ఫోన్ నాకందిస్తూ.

"కంగ్రాట్స్ అక్కా. చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు. విశ్లేషించడం, విడమరచి చెప్పడంలో నీకు నువ్వే సాటి. నువ్వు తప్పకుండా మంచి రచయిత్రివి అవుతావక్కా"

నా గుండెల్లో సంతోషం పిల్లి మొగ్గలేసింది. తమ్ముడు కథలూ కవితలూ రాస్తుంటాడు.

"నా జీవితంలో జరిగిందంతా ఒకసారి నెమరువేసుకోవాలనీ, అక్షరాల్లో పొదగాలనీ ఎందుకో అన్పించిందిరా. కీర్తి కిరీటాలు వచ్చేస్తాయని కాదు గాని నేనేంటో, నా జీవనయానం ఎలా సాగిందో కనీసం నాకైనా తెలుస్తుందిగా!"

"రెండో ఆలోచన రానివ్వొద్దు. వెంటనే మొదలుపెట్టేసేయ్. నీకేమైనా డౌట్లు వస్తే నాకు ఫోన్ చెయ్యి. కానొక్క సంగతి గుర్తు పెట్టుకో. ఆత్మకథ రాయడమంటే శిఖర దర్శనం చేయించడం లాంటిది. దాన్ని కప్పివున్న మంచు తొలగిస్తేనే పర్వత స్వరూపం తెలుస్తుంది. ఆ అసలు రూపాన్ని నువ్వు ఆవిష్కరించాలి"

"వెనుక నువ్వున్నావుగా. ఎవరి మాటలూ, నవ్వులూ పట్టించుకోన్లే" ఓర కంట తండ్రీ కొడుకుల్ని చూస్తూ అన్నాను.

"వినాయకుడి సాక్షిగా మన వీరనారి కొంగు బిగించేసిం దిరా!"

మా వారి మాటలకు నవ్వులు ఎగిరిపడ్డాయి. విషయం అర్థం గాక పిల్లలు నావంక అయోమయంగా చూశారు.

"మీ తాత జోకులు మనకి అర్థం కావులే. మీరు తినండి" వారి తల నిమురుతూ చెప్పాను.

అబ్బాయి, కోడలు, మనవలు ఆ రాత్రికే పుణె వెళ్ళిపోయారు. వాడి ఉద్యోగం అక్కడే. వంటగది సర్ది వచ్చాను. ఈయన టీవీ వార్తలు చూస్తున్నారు. పదకొండింటి దాకా టీవీ ముందు నుంచి కదలరు. దేశ వార్తలన్నీ ఈయనకే కావాలి. ఇంట్లోవేవీ అక్కర్లేదు!

గదిలోకెళ్ళి మంచం మీద నడుం వాల్చాను. పొద్దుట్నుంచీ వంచిన నడుం ఎత్తలేదు. బాగా అలసిపోయాను. అయినా నా లోలోపల ఏదో చినుకుల సవ్వడి. ఆనందపు అలజడి.

ఎలాగైనా సరే నా కథంతా రాసెయ్యాలి. నవ్విన నాపచేనే పండుద్దని చాటి చెప్పాలి. యాభై ఏళ్ళు చేసిన ఇంటిచాకిరీ చాలు. ఇకనైనా ఆయన నీడలోంచి బయటికొచ్చేస్తాను. నా జెండా ఎగరేస్తాను!

స్ప్రింగులా లేచి పూజా మందిరంలో కెళ్ళాను. బస్కీ వేసుక్కూర్చుని బౌండు పుస్తకం చేతుల్లోకి తీసుకున్నాను.

మొదట ఏం రాయాలి? అసలు ఎలా మొదలు పెట్టాలి? ఎక్కడ్నుంచి రాసుకు రావాలి?

కళ్ళ ముందు పూజాపీఠం లాంటి మా పచ్చని పల్లె కదిలింది. ఆమాంతం బాల్యంలోకెళ్ళిపోయాను. తోటల్లో ఆటలు, కాలువలో ఈతలు, కోతి కొమ్మచ్చి, తొక్కుడు బిళ్ళ ఆటలు, మగ పిల్లల్తో ఆటలేంటన్న మందలింపులు, పోటీపడి వేసిన సంక్రాంతి ముగ్గులు, ఆవుదూడ మెడలో గంట కట్టి చేసిన అల్లరి, అట్లతద్దె ఊయలలు, చెరువులోని తామరపూలు కోసి నాకివ్వడానికి పోటీ పడ్డ గోపి, వీరిగాడు... వీధి బడి కుర్చీలో పిలక పంతులి కునుకు, అమ్మానాన్నల ఆప్యాయతలు, ఊళ్ళో వారి తోడ్పాటు...!

ఆ రోజులెంత మధురమైనవి. బాల్యం నిజంగా అపురూపమే. బంగారు లోకమే!

నా పెదాల మీద ఆనందహాసం వయ్యారంగా నడిచింది.

హఠాత్తుగా అమ్మమ్మ మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించాయి.

"నాకింత విషం తెచ్చియ్యి పిల్లా!" నా వెన్ను జలదరించింది.

అమ్మమ్మ వాళ్ళది మా ఊరే. చెరువుకి ఆవతలి వీధిలో ఉండేవారు. తాతయ్యని నేనెరగను. నేను పుట్టకముందే పోయారు. అమ్మమ్మ పెద్ద మామయ్య ఇంట్లోని మూల వసారాలో ఒక్కత్తీ

ఉండేది. ఎప్పుడూ నులకమంచం మీద పడుకునే ఉండేది. ఆ గదిలో కెళ్తే చాలు, అదో రకమైన ముక్క వాసన. వెగటచ్చేది.

ఎప్పుడెళ్ళినా సరే, విషం తెచ్చిమ్మని అడిగేది అమ్మమ్మ.

"మీ అమ్మమ్మ అడిగింది తెచ్చియ్యవే భానూ" అంటూ అత్తయ్య, మామయ్య నన్ను ఆటపట్టించేవారు. అందుకనే వాళ్ళంటే మంటగా ఉండేది. ఎప్పుడోగాని అక్కడికి వెళ్ళేదాన్ని కాదు. అమ్మమ్మ జ్ఞాపకాల్లో తడిసేసరికి గుండె ముద్దై బరువెక్కింది. కళ్ళు తుడుచుకున్నాను.

"రాసింది చాల్లే. ఇంక కట్టిపెట్టు" కసిరినట్టుగా అన్నారాయన.

లేచి వచ్చి పడుకున్నానన్న మాటేగాని అమ్మమ్మ దీన ముఖం వెంటాడుతూనే ఉంది.

చిత్రంగా ఆ మర్నాడే మా చిన్న మామయ్య మా ఇంటి కొచ్చాడు. సిటీలోని కూతురింటికి వచ్చాట్ట. నన్ను చూడాల న్పించి వచ్చానన్నాడు.

"భానూ, నాకు కరకరలాడే పకోడీలు వేసి పెట్టవే. మరీ గట్టివి వద్దు. నమల్లేను. మా భాను పకోడీల స్పెషలిస్టు" అన్నాడు మావారితో.

"ఇక నుంచి మూకుట్లో కథలూ వేసేస్తుందట. నిన్ననే ఆటోబయోగ్రఫీ రాయడం మొదలెట్టింది"

ఆ మాట వింటూనే వంటింట్లో శనగపిండి కలుపుతున్న నాదగ్గరి కొచ్చేశాడు చిన్న మామయ్య. నన్ను రాచుకుంటూ నిలబడబోతే ఉరిమి చూశాను. ఎడంగా జరిగి అన్నాడు "అమ్మమ్మ గురించి రాసినపుడు మందులూ, బలానికి హార్లిక్సూ నేనే కొని పంపేవాణ్ణని తప్పకుండా రాయి. అమ్మమ్మని పెద్ద మామయ్య కన్నా నేనే బాగా చూసేవాణ్ణి, నీకు తెలుసుగా. నేను కొన్న వాటిని పెద మావయ్య అమ్మేసే వాడనీ, అమ్మమ్మని మాడ్చేసేవాడనీ తప్పకుండా రాయి సుమా..."

"అన్నీ గుర్తున్నాయి. అంతా రాస్తాను"

"నువ్వెప్పుడూ నాకు ముద్దొస్తూనే ఉంటావే భానూ!" గబుక్కున నా బుగ్గ గిల్లి వెళ్ళిపోయాడు.

బిత్తరపోయాను. ఒంటి మీదకి 65 ఏళ్ళచ్చినా ఈయన మారలేదు! చిన్న మామయ్య ఏదో ఊళ్ళో ఉద్యోగం చేసేవాడు. నా చిన్నప్పుడు మా ఇంటికెప్పుడొచ్చినా నన్ను వదిలేవాడు కాదు. నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని నొక్కేసేవాడు. ఎక్కడెక్కడో చేతులు పెట్టేవాడు. లేచి పోబోతే గట్టిగా పట్టుకుని, "కితకితలు పెడుతున్నాను భానూ" అనేవాడు.

అప్పుడా చేష్టలకి అర్థం తెలీలేదు. ఇప్పుడు తలచుకుంటే ఒంటిమీద గొంగళిపురుగు పాకినట్టు ఒళ్ళు జలదరిస్తోంది!

ఒళ్ళంతా చీరి కారం అద్దినట్టు రగిలిపోయాను. మూకుణ్ణి పట్టుకెళ్ళి మరుగుతున్న నూనెని అతడి నెత్తిమీద గుమ్మరించాలనన్నంత ఆవేశం వచ్చింది.

అతి కష్టం మీద నిగ్రహించుకున్నాను.

పళ్ళ నొప్పి అంటూనే ప్లేటుడు పకోడీలూ ఊదేశాడు. "నువ్వు చికెన్ బిర్యానీ చేస్తానంటే భోజనానికి ఉంటాను భానూ"

"ఇవాళ గురువారం. చికెన్ ముట్టుకోను" కసిగా అబద్ధ మాడాను.

"నోరు చప్పబడింది. ముద్దుల మేనకోడలివి కదా చేసిపెడతా వని నోరు తెరిచి అడిగాను...." సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

వెంటనే గదిలోకెళ్ళి మామయ్య తతంగమంతా రాసేసి తేలిగ్గా నిట్టూర్చాను. ఏదో కసి తీర్చుకున్న భావన కలిగి నవ్వుకున్నాను.

"అబ్బో, చాలా సీరియస్‌గా రాసేస్తున్నావే. ఏం రాశావో చూస్తానుండు" పుస్తకం లాక్కోబోయారు.

గుండె ఝల్లుమంది. దాన్ని అందనివ్వకుండా, "పూర్తిగా రాయనీండి" అన్నాను. రాసిందంతా ఆయన చదివితే ఎలా తీసుకుంటారోనని భయమేసింది.

"నా గురించి ఏం రాస్తావోయ్. పెళ్లి చూపుల్నుంచీ రాసు కొస్తావా?"

అల్లరిగా నవ్వాను. "ఊహు. మొదటి రాత్రి నుంచి మొదలు పెడతాను. ఆ రాత్రంతా గొప్పగా చెప్పుకొచ్చిన మీ ప్రేమ కథల్నీ రాసేస్తాను"

"మైగాడ్! చచ్చే చావొస్తుందే. నిజంగానే అవన్నీ రాసేస్తావా ఏంటి ఖర్మ! అవన్నీ వట్టివే. నిన్ను ఇంప్రెస్ చెయ్యడానికి కోతలు కోశానంతే. నువ్వు నమ్మేశావా?"

"అప్పుడు నమ్మేను. ఇప్పుడేమో 'వఅర్ధ పురుషా పత్నీవ్రత:' అన్నట్టు మాట్లాడుతోంటే నమ్మడమా మానడమా అని ఆలోచిస్తున్నాను"

"వద్దొద్దు. అదంతా ఉత్తదే. పూర్తిగా మర్చిపో. అదంతా పిల్లలకి తెలిస్తే తలెత్తుకోలేను. అసలా రాత్రి గురించే రాయొద్దు" కంగారుపడ్డారు.

"ప్రయత్నిస్తాలెండి" ముసి ముసి నవ్వులు చిందిస్తూ వెళ్ళాను.

మాసిన దుస్తుల్ని వాషింగ్ మెషీన్లో వేసి ఆన్ చేశాను.

దానిలానే నా మనస్సులో తొలినాటి మధుర దృశ్యాలు గిర గిర తిరుగుతూ సందడి చేశాయి.

అమ్మలక్కల నవ్వుల మధ్య పాలగ్లాసుతో గదిలోకెళ్ళాను. కాలి బొటనవేలితో నేలని రాస్తూ నిలబడ్డాను. ఆయనొచ్చి భుజాల మీద చెయ్యేసారు. ఒళ్ళు ఝల్లుమంది. శరీరంలోని నాడులన్నీ శృతి చేయబడినట్లు రసవీణలా మారింది. సరాగాలు ఆలాపిం చింది.

పాలగ్లాసు పక్కనపెట్టి, "ఇలా కూర్చో. మొదట నా ప్రతాపం గురించి నీకంతా తెలియాలి" అంటూ మొదలుపెట్టారు.

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం మార్చి 2021 పురస్కారాలు

**వేడెక్కుతున్న ఉక్కు**
కవితకు రూ.500
కవి : చింతా అప్పల నాయుడు

**గుంట నక్కలు**
కథకు రూ.500
రచయిత : దొండపాటి కృష్ణ

■■■

*కవితకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*సాహిత్య విమర్శకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

---

తననెందరు ప్రేమించారో, ఎవరెన్ని ప్రేమ లేఖలు రాశారో, జయంతుడూ మన్మథుడూ అని అంతా ఎలా పొగిడారో, వూ అంటే లేచి వచ్చెయ్యడానికి ఎందరు సిద్ధపడ్డారో కథలుగా చెప్పారు.

"అటువంటి ఈ నవ మన్మథుడు పెళ్లి చూపుల్లో నీ అమాయకమైన మోము చూసి, నీ మోహంలో పడిపోయాడు. అందమూ, ప్రభుత్వోద్యోగమూ ఉన్న నేను నిన్ను కట్టుకోవడం అనేది నీ పూర్వజన్మ సుకృతం" అన్నారు.

తెలతెవారుతోంటే, అప్పుడు నన్ను చుట్టేసి, నలిపేసి, ఆక్రమించుకున్నారు. ఆసరికి నా శరీరం కట్టెలా అనుభూతి రహితంగా మారిపోయింది!

ఇదంతా నా కథలో రాయాలి. కాని రాస్తే...! ఇంట్లో వాళ్ళేకాదు బయటివాళ్ళూ ఎందరెందరో చదువుతారు. బావుంటుందా? అలాగని దాంపత్య జీవితంలోకి వేసిన తొలి అడుగుని రాయకుండా సెన్సార్ చేయలేను! ఎవరో ఏదో అనుకుంటారని మసి పూయనూ లేను!

సందిగ్ధంలో ఊగిసలాడాను.

పల్లె నుంచి మా మామగారు ఫోన్ చేశారు. నేను ఆత్మకథ రాస్తున్న సంగతి సంచలన వార్త అయిపోయిందని నాకు అప్పుడే తెలిసింది.

"నువ్వు నాకోసం కనీసం పది పేజీలైనా కేటాయించాల్సిందే. విన్నావా? నేను ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సంగతి పెద్ద అక్షరాల్లో రాయి. ప్రతి ట్రాన్స్‌ఫర్‌కీ ఉపాధ్యాయులిచ్చిన అభినందన పత్రాలూ, రిటైర్మెంటప్పుడు ఇచ్చిన సన్మానపత్రాలూ ఫొటోలు తీసి పంపిస్తా. అవన్నీ నీ పుస్తకంలోకి ఎక్కించెయ్. నేను సింహాసనం లాంటి కుర్చీలో దర్జాగా కూర్చునుండగా పక్కన మీ అత్తగారు నిలబడి వుందే – ఆ ఫొటో కూడా అచ్చేయించు"

"మీ ట్యూషన్ల దందా గురించీ, ఇన్సూరెన్సు ఏజెన్సీ, చిట్ వ్యాపారం గురించీ కూడా రాయమంటారా?"

''వద్దొద్దు. నేను నక్కాలుకెళ్ళకుండా జీతం పుచ్చుకున్నాననుకుంటారు"

"మరి అత్తయ్యగారి గురించేం రాయమంటారు?"

"రాయడానికసలు ఏమైనా వుంటేగా! దానికేమీ రాదు, తెలీదు. వట్టి వేస్ట్ క్యాండేట్"

"అయితే మా దగ్గరికి పంపించెయ్యండి. ఉపయోగించు కుంటాం" నవ్వుతూ చురకవేశాను.

"హమ్మో. ఆవిడ లేకపోతే నా కాలూ చెయ్యీ ఆడవు!"

నవ్వాను. "మీరు కాగితం మీద రాసిందే చూసి మార్కులేసే మాస్టారు కదూ. మరిచేపోయాను"

"నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదమ్మాయ్"

"అన్నేళ్ళు కాపురం చేసిన అత్తయ్యగారే మీకర్థం కాలేదు!" నిష్ఠూరంగా అని ఫోన్ పెట్టేశాను.

ఆయనదంతా డిక్టేటర్ టైపు. భార్యని అస్సలు మాట్లాడనివ్వరు. కూర్చోమంటే కూర్చోవాలి. నిల్చోమంటే నిల్చోవాలి. కూరలు కూడా ఆయన చెప్పినవే వండాలి. ఇడ్లీ తినరు. రోజూ ప్రత్యేకంగా ఆవిరి కుడుం వెయ్యాల్సిందే. ఆయన మాట వినబడితే చాలు, అగ్గగ్గలాడిపోతుందావిడ.

"ఈయన ఇంట్లో వుంటే చాలు వేపుకు తింటారు" అని ఇప్పటికీ మొత్తుకుంటుంది పాపం!.

ఆయన గురించాలోచిస్తోంటే, మా పెళ్లిలో జరిగిన సంఘటనలు తోసుకుంటూ ముందుకొచ్చాయి. నిశ్చయ తాంబులాలు తీసుకున్నారు. లగ్న పత్రికలు రాసుకున్నారు. పెళ్లి పనులు మొదలయ్యాక ఆయన ఇంటికొచ్చి నాన్న మీద చిందులేశారు.

"పొరుగూరి వాళ్ళమని చెప్పి ఇంత మోసం చేస్తారనుకోలేదు. కట్నం కింద రెండెకరాలు ఇస్తామంటే, మంచి భూమే ఇస్తున్నారనుకున్నాను. పర్రభూమి ఇస్తారా? అదేం కుదర్దు. మీకు గరువులో వున్న రెండెకరాలూ రాసిస్తేనే ఈ పెళ్లి జరుగుతుంది"

పేరుకి పర్ర గాని, రెండు పంటలూ పండుతాయని నాన్న కాళ్ళా వేళ్ళా పడ్డా మెత్తబడలేదు. ఊరి పెద్దలు రంగంలోకి దిగి, ఒక ఎకరం గరువుదీ, ఒక ఎకరం పర్రలోదీ ఇచ్చేట్టు ఒప్పించారు. పెళ్లికి ముందే పొలాన్ని రిజిస్టర్ చేయించి ఆ దస్తావేజులు పంపితేనే పెళ్లి మండపంలో అడుగుపెడతామని ఖరాఖండీగా చెప్పారు. పెళ్లిలో చిన్న చిన్న వాటికీ పెద్ద రాద్ధాంతం చేశారు. భోజనాల్లో రెండు స్వీట్లే వేశారనీ, లాంఛనాలు సరిగ్గా జరపలేదనీ, బంధువులందరి ముందూ నాన్న పరువు తీశారు. నా కోసం కన్నీళ్ళు దిగమింగారు నాన్న.

పందిట్లో కన్యాదాతని ఏడ్పించిన ఆయన గారి గురించి గొప్పగా రాయాలిట. జరిగిందంతా రాస్తే ముఖం ఎక్కడ పెట్టుకోవాలో కూడా తెలీదా పెద్ద మనిషికి!

'హు' నిరసనగా అనుకున్నాను.

మా అమ్మాయి ఫోన్ చేసింది.

నాకు మాతృత్వం రుచి చూపించింది తనే. తొలిసారి తననే కడుపులో మోశాను, పురిటి నొప్పులు పడ్డాను, మొదటిగా స్తన్యమిచ్చిందీ తనకే. అమ్మా అని పిలిచిందీ తనే. నాటి మధురిమలు గుండెల్లో తీయని రాగాల కచేరీ చేస్తోంటే కాల్ తీసుకున్నాను.

"నిన్ను అడగమని మీ అల్లుడు గారు ఒకటే పోరుతున్నారమ్మా. అందుకని ఫోన్ చేశాను"

తనెప్పుడూ ఇంతే. అన్నిటికీ అల్లుడి పేరే చెబుతుంది. అతడేమో 'అల్లుళ్ళలో ఇంత మంచితనం వుంటుందా' అని ఆశ్చర్యపడేలా ప్రవర్తిస్తుంటాడు. ఎవరి ఎత్తుగడేంటో అర్థం కాదు!

"మీ టెండరేంటో చెప్పు"

"నీ మనవరాలికి పదకొండో ఏడు వస్తోంది. మేనమామ పైటలు వేయించాలి. మే నెలలో ఆ వేడుక జరిపిస్తానన్నాడు తమ్ముడు. మెడలోకి హారం కొంటానన్నాడు. నిన్ను వడ్డాణం చేయించమంటున్నారు మీ అల్లుడు గారు. మా పెద్ద తోడికోడలు కూతురికి వాళ్ళ పుట్టింటి వాళ్ళు వడ్డాణమూ, రెండు చేతులకీ అరవంకీలూ చేయించారమ్మా. అలాగే మీరూ జరిపించాలంటున్నారీయన"

"మీనాన్నని అడుగు. బరువు మోసేది ఆయన కదా"

"అడుగుతాన్లే. నువ్వు రికమండ్ చెయ్యమ్మా. లేకపోతే మీ అల్లుడు గారికి కోపం వస్తుంది"

"ఇంకెన్నాళ్ళు మీ కోపాలూ తాపాలూ భరించమే. మీకూ అల్లుడొచ్చే సమయం వస్తోందిగా. అన్నట్టు నేను ఆత్మకథ రాస్తున్నానే. నువ్వు పెళ్లికి ముందు కట్నం తీసుకునే వాణ్ణి చేసుకోనని ఎగిరావనీ, పెళ్లయ్యాక తోడికోడల్తో పోల్చుకుని అన్నీ నొల్లుకు పోదామనుకుంటున్నావనీ రాస్తాను"

"ఇంకా నయం. అల్లుడికి పెట్టిన నవకాయ పిండివంట గురించి కూడా రాసేస్తాననలేదు. ఆయన అడగమంటే అడుగుతున్నాను గాని మధ్యలో నన్ను ఇరికించకు. ఆయన ఆడమన్నట్టు ఆడే బొమ్మని గాని స్వతంత్రంగా ఏమీ చేయలేనని నీకు తెలుసుగా అమ్మా. అయినా ఈ వయస్సులో కృష్ణారామా అనుకుంటూ కూర్చోక ఈ రాతలెందుకు చెప్పు? చూస్తోంటే నువ్వు మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టే వుంది" విసురుగా ఫోన్ పెట్టేసింది.

"ఏమంటోంది నీ ముద్దుల కూతురు" ఆయన అడిగారు.

"అంతా పాడుతున్న పాటే. రాస్తే తన గురించి బాగానే రాయాలిట"

"నేను చెప్పేదీ అదేనోయ్. ఉన్నదీ లేనిదీ కల్పించి మా అందరి గురించీ గొప్పగా ఆహా, ఓహో అంటూ రాసెయ్. మధ్యలో నీ సొమ్మేం కరిగిపోదోయ్"

"అప్పుడది కట్టుకథ అవుతుంది"

"సొంత డబ్బా వాయించుకోడానికే కదా అంతా ఆత్మకథలు రాసేదీ, రాయించుకునేదీ!"

"నేను అబద్ధాలు రాస్తూ పోతే నా బతుకే ఓ పెద్ద అబద్ధమై కూర్చుంటుంది!"

కళ్ళెగరేసి మిర్రి చూశారు. సాలోచనగా చూసి మౌనం వహించాను.

రోజు గడుస్తున్నాయి. పెన్ను సాగటం లేదు.

దేని గురించి రాయాలన్నా, ఎవరి గురించి రాయాలన్నా భయంగా ఉంటోంది. ఏదో తెలీని అశాంతి, వేదన నన్ను నిర్దాక్షిణ్యంగా పరపరా నమిలేస్తున్నాయి! ముఖ్యంగా మా అబ్బాయి గురించి రాస్తున్నప్పుడు లేచిందీ ఆందోళనా కెరటం. లేవటమే కాదు, నన్ను ముంచెత్తింది. నిలువునా ముంచేసింది!

వాడు కాలేజీలో తోటి విద్యార్థినిని ప్రేమించాడు. ఆమె కూడా ప్రేమించిందిట. కానెందుకో ఇద్దరి మధ్య గొడవలొచ్చాయి.

విడి పోయారు. కాని ఆ గొడవని అంతటితో వదిలెయ్యలేదు మా వాడు. ఆమె ఫొటోల్ని మార్ఫింగ్ చేశాడు. వేధించాడు. పరువు తీశాడు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. కేసు మా వాడి మెడకు చుట్టుకోబోయింది. ఈయన ఎమ్మెల్యేనీ, పోలీసు ఉన్నతాధి కారుల్నీ పట్టుకుని, లక్షలు వెదజల్లి, అందులో ఇరుక్కోకుండా రక్షించారు.

వాడిప్పుడు తనెంతో పవిత్రుడైనట్టుగా మాట్లాడుతున్నాడు! బుద్ధిగా ఉంటున్నట్లు ప్రవర్తిస్తున్నాడు! నిజంగా మారితే మాకన్నా సంతోషించే వారుండరు. మళ్ళీ ఆ బుద్ధి తలెత్తితే, కోడలూ పిల్లలూ అన్యాయమైపోతారు! మరుగున పడిన ఆ విషయాన్ని నేను రాస్తే వాడి కుటుంబంలో తుపాను లేవదూ? వాడి గురించి ఒక మహిళగా రాయాలా, ఒక తల్లిగా రాయాలా అన్నది మరో ప్రశ్న!

కాళ్ళూ చేతులూ ఆడటం మానేశాయి. నిస్త్రాణగా కూలబడ్డాను. కావ్య రచన చేయాలంటే ఋషిలా మారాలని ఎందుకంటారో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

"ఏంటోయ్. నీలో నువ్వే మథనపడి పోతున్నావు? దేని గురించి?"

"తాడే కదా అని పట్టుకోబోతే పాములా మారుతోంది"

"అందుకనే ఆత్మకథని అటకెక్కించెయ్. అంతగా రాయాను కుంటే పేర్లు మార్చి నవలగా రాసెయ్. అది సేఫ్ మార్గం. అవార్డులూ రివార్డులూ నడిచొస్తాయ్"

"అవార్డు కోసం కాదండీ, నా సంతృప్తి కోసం. నా జీవితాన్ని సమీక్షించుకుని మంచీ, చెడూ రికార్డు చెయ్యాలని తపనగా ఉందండీ"

"అలాగన్చెప్పి నా అవినీతి గురించీ, అక్రమ సంపాదన గురించీ బరికేశావనుకో... నా పరువూ ప్రతిష్ఠా గంగలో కలిసిపోతాయి. ప్రభుత్వం పాత కేసులు తిరగదోడితే జైల్లో కూర్చుని చిప్పకూడు తినాల్సొస్తుంది జాగ్రత్త" కళ్ళెర్రజేసి మరీ హెచ్చరించారాయన.

వజ వజ వణికాను. ఆపైన నిర్వికారంగా చూశాను.

కొడుకు నిర్వాకం దగ్గరే ఆగాను గాని, ఈయన రెండో పార్శ్వం గురించి ఎందుకింత దాకా ఆలోచించలేకపోయాను? మంచు కరిగితే, ముసుగు తొలగిపోతే ఆ నగ్నత్వాన్ని భరించడం ఎంత కష్టం!

కింకర్తవ్యం?

నా మౌనం ఆయనలో అనుమానాలు రేకెత్తించినట్టుంది. "నీ ధోరణి చూస్తోంటే భయమేస్తోంది. అసలు నా గురించేం రాశావో చూస్తానుండు...."

"చూడొద్దు చూడొద్దు..." అడ్డుపడ్డాను.

ఆయన ఉగ్రుడయ్యారు. "అంటే నా గురించీ, అబ్బాయి గురించీ సమస్తం కక్కేశావా?"

"కొంత రాశాను...."

ఆగ్రహోద్రేకంతో ఊగిపోయారు. లాగి విడిచిన బాణంలా దూసుకెళ్ళి బౌండు పుస్తకాన్ని కసాబిసా ముక్కలుగా చించేశారు! ఆ చేష్టకి నిశ్చేష్టనయ్యాను. నా కళ్ళు కృష్ణాగోదావరులయ్యాయి!

ఒకరోజున తమ్ముడు ఫోన్ చేశాడు.

"అక్కా, నీ ఆత్మకథ ఎంత దాకా వచ్చింది"

"అటకెక్కించేశాన్రా"

"ఎందుకని? రైటర్స్ బ్లాక్ రావడానికది కల్పిత కథ కాదు కదే!"

"ఆడవాళ్ళు ఆత్మకథలు రాయకూడదురా. మీటూలూ, స్పీకప్‌లూ నాటు బాంబులైతే, స్వీయకథలు అణుబాంబులు. అవి విస్ఫోటిస్తే కళ్ళముందే గోడలు ఫెళ్ళున కూలిపోతాయి. సామాజిక జీవిత వాస్తవికత, జీవన విధానపు నగ్నత్వం బట్టబయలవుతుంది! పితృస్వామ్యపు పునాదులు కదిలిపోతాయి!"

"నీ కలానికి వాటిని కదిలించగల శక్తి వుంటే ఇంకా ఎందుకు మీనమేషాలు లెక్కపెట్టడం? కలం ఝుళిపించు అక్కా!"


"అది కాదురా తమ్ముడూ..."

"నీ సంకోచాల గురించే, భయాల గురించే చెబుతున్నాను. మొదట నీలో నువ్వు, నీ చుట్టూ నువ్వు నిర్మించుకున్న కొత్త గోడల్నీ, సమాజం నిర్మించిన శిథిలగోడల్నీ కూల్చేయ్. షెల్‌లో ముడుచుకు కూర్చోకుండా రెక్కలు విదిల్చి బయటికి రా. ఒక స్వతంత్ర వ్యక్తిగా, శక్తిగా, దిక్సూచిగా నిన్ను నువ్వు పునర్నిర్మించుకో. ఏమో, మార్పుకి నీదే తొలి అడుగు అవుతుందేమో!"

తుళ్ళిపడ్డాను. భుజాలు తడుముకున్నాను.

ఆపైన ఆలోచనల్ని మథించాను.

నా చుట్టూ నేను గీచుకున్న గీతలు, నేను విధించుకున్న పరిధులు చెరిగిపోతున్నాయి. కట్టుబాట్లు, పురాతన విశ్వాసాలు కరిగిపోతున్నాయి...! నాలోని కార్యక్షేత్రంలో కొత్త బీజాలు మొలకెత్తుతూ మనః భూమిని చీల్చుకుని రావడానికి ప్రయత్నం ఆరంభమైంది. పురిటి నొప్పులు పడటానికి సంసిద్ధమయ్యాను.



■

## కవిత



# అక్షరాల రైలుబళ్ళు

- సాంబమూర్తి లండ

**కొ**న్ని అక్షరాల రైలుబళ్ళు
ఎందుకనో ఆగిపోతున్నాయి
కొన్నింటిది దశాబ్దాల గమనమైతే
మరికొన్నింటింది సంవత్సరాల నడక
కొన్నేళ్లుగా విరిగిన చక్రాలతోనే నడిచీ నడిచీ
ఇక మావల్ల కాదంటూ కూలబడిపోతున్నాయి
ఆగిపోతున్న అక్షరాల రైలుబళ్లన్నీ
గుండెల మీద పచ్చిగాయాలు
తెగిపడుతున్న బొటనవేళ్ళు!

రంగురంగుల అక్షరాల బోగీలతో
పొద్దున్నే వాకిట్లో ఆగే రైళ్ళు కొన్నయితే
నెలంతా నిండుగా ముస్తాబై
కేలండర్లో పేజీ మారగానే
గుండె గుమ్మాలకు చేరేవి కొన్ని
ఎన్నెన్ని జీవితాలనో మధించి
ఎన్నెన్ని అనుభవాలనో శోధించి
జీవన పరిమళాల్ని చేరేవేసేవి కొన్ని

కోట్ల మిణుగురుల్ని మోసే అక్షరాల బోగీలు
కొత్త దారుల్ని తెరిచే కథనాల బోగీలు
కొత్త దిక్కుల్ని చూపే రాతల బోగీలు
ఇక భారం మోయలేమంటూ
తమకు తామే స్వస్తి చెప్పుకుంటున్నాయి!

చరవాణి సృష్టిస్తున్న సునామీ వల్లనో
కరోనా కల్లోల కెరటాల వల్ల
కొనసాగుతున్న ద్రోణి ప్రభావమో
జరుగుబాటులేని మొండి పట్టాల మీదిక
నడవలేమంటూ చేతులెత్తేస్తున్నాయి

నిరంతరం అక్షరాల రైలుబళ్ళమీద ప్రయాణిస్తూ
అనుభూతి పుప్పొడిని గుండె కవాటాల రేకుల్లో
భద్రంగా దాచుకున్న కొన్ని పువ్వులూ
నిన్నటి నడకల్లో తమ జ్ఞాపకాల్ని తడుముకునే
కొన్ని ఆశ చావని తూనీగలూ
పచ్చజెండా రెపరెపల్ని కలగంటూ
ప్లాట్ ఫామ్ మీదే నిరీక్షిస్తున్నాయి!

ఆగిపోయిన రైలుబళ్ళ సంగతి సరే!
ఇప్పుడు ప్రశ్న
రేపు స్తంభించిపోనున్న రాకపోకల గురించి!
విరిగిపోతున్న పట్టాల్ని అతికించుకుంటూ
రైలుబళ్ళను బతికించుకునే దిశగా
ఎన్ని అడుగులు వేసామన్న దాని గురించి!
మనమిలా ఏమీ పట్టనట్టు
అసలేమీ జరగనట్టు జారుకుంటుంటే
రేపటి పిచ్చుకలకి
అక్షరాల రుచీ వాసనా తడీ
తెలిసేదెలాగన్న దాని గురించి.

**(మూతబడుతున్న పత్రికలూ, కుంచించుకుపోయిన పేజీల గురించీ...)**

■

## నచ్చిన పుస్తకం






# 'మది నదిలో'

# ఆహ్లాద భావాల ప్రవాహం


- మద్దాల సునీల్
98494 82031


'**మ**ది నదిలో' అనే ఈ కవితా సంపుటిలో చిట్టె సిద్ధ లలిత తన మనసులోని భావాలను ప్రవహింపచేశారు. ఈ కవితా సంపుటి "ఒక ప్రయోగం కాదు.. ఒక ప్రక్రియా కాదు.. పరిశీలన కాదు.. పరిశోధనా అంతకంటే కాదు, ఇది నా మదిలోని జీవ నది. నా మదిలోని ప్రవాహాలే ఈ కవితలు" అని కవయిత్రి చెప్పుకున్నారు. ఈ పుస్తకాన్ని పాఠకుడు ఏకబిగిన చదవడానికి తన కవితా శైలి ఉపకరిస్తుంది. ఇది తన మొదటి కవితా సంపుటి అనే భావన ఎక్కడా రాదు.

కాలంతో పరుగులు పెట్టే మనుషులకు కాస్తంత విరామంలా, విసిగిపోయిన మనసులకు హాయి గొలిపేలా ఉంటాయి ఈ కవితలు. కవయిత్రి రాసిన ప్రతి కవితా ప్రశాంతంగా పరవశింప జేసేలా ఉంది. కవయిత్రి తనకంటూ ఒక నిర్దిష్టమైన కవితా శైలిని కనబరిచింది. తన చుట్టూ జరుగుతున్న వాటినే వస్తు రూపాలుగా మలచింది.. "కవిత్వమంటే అర్థం కాని మాటల ప్రయోగం కాదు, నాన్న కోపంలో కూడా ప్రేమను వెలికితీయడమే కవిత్వం.." సరికొత్త నిర్వచనం ఇచ్చారు. సినీ పాటల రచయిత భువన చంద్ర ఈ సంపుటికి ముందు మాట రాశారు. "కవితకు ఉండాల్సిన ప్రథమ లక్షణం సున్నితత్వం, రెండోది భావ పటుత్వం, మూడోది సరళత, నాలుగోది ఒక్కసారి చదివితే అర్థమయ్యే భాష.. ఈ నాలుగూ నాలుగు స్తంభాలై ఈ మది నదిలో కవితా సంపుటిని బలంగా నిలబెట్టాయి అని పేర్కొన్నారు.

కవయిత్రి "నా మది నదిలా పరుగులు తీస్తుంది నీకోసమే" అని మొదలుపెట్టి తన మనసులాగే తన కవితల్ని పరుగు పెట్టించారు.. అక్షరంతో స్నేహం చేయబట్టేమో అక్షరాలను కవితలుగా అలవోకగా మలిచారు.. "కొండలెక్కి దూకుతున్నాను కోనల్లో సాగుతున్నాను /గతి తప్పని శృతులతో లయగా పరవళ్ళు తొక్కుతూ నీ దరికే ప్రవహిస్తున్నాను" అని; సంద్రాన్ని సాయమడిగి తన సిరా నింపుకుని / ఆకాశాన్ని అరువడిగి కాగితం తెచ్చుకొని / అక్షరాలను ముత్యాలుగా మలచి రాసిన అందమైన కవితలు.. తన కవితల జ్ఞాపకాలన్నీ మూటగట్టి నీతో గడిపిన క్షణాలన్నింటిని కట్ట గట్టి / గతమనే పెట్టెలో భద్రంగా దాచిపెడుతున్న అని కొన్నిటిని దాచి మరికొన్నిటిని మనకు అందించారు. 'చిట్టీ చిలకమ్మా' అని మొదలు పెట్టి.. అలసినపుడు... విసిగి వేసారినపుడు నిరాశ నిస్పృహలు కమ్ముకుని మనసును కల్లోలం చేస్తున్నప్పుడు కళ్ళు మూసుకుని కాసేపు వెనక్కి ప్రయాణిస్తాను / అదిగో అక్కడికే బాల్యపు ముంగిట్లోకి చిట్టి చిలకమ్మలమై తోటకెళ్ళి పోతాము అని బాల్యాన్ని గుర్తుచేశారు. "కన్నీటికే కలానందిస్తే ఎన్నెన్ని కథలను రాస్తుందో /ఎంత మంది హృదయాలను కరిగిస్తుందో" అని కలానికి  కన్నీటికి స్నేహం కుదిర్చింది. "వారి తప్పేమి లేదు.. నేరమేమి చేయలేదు.. విధి వెక్కిరించిందట.. నుదుటి బొట్టు తుడిచేసి.. చేతిగాజులు పగులగొట్టి తెల్లని వస్త్రాన్ని కట్టి ఇదే నీ సౌభాగ్యమంటారు

ఎదుటికి రాకుండా పక్కకి తప్పుకోమంటారు మూఢ నమ్మకాలతో... మూర్ఖంగా.." అని మూఢ నమ్మకాలను విమర్శించారు ఈ కవయిత్రి. "సారీ, నేను చాలా బిజీగా ఉ న్నాను / నన్ను డిస్టర్బ్ చేయవద్దు వెలసిపోయిన జీవితానికి రంగులద్దుకుంటున్నాను / శిథిలమైన నా జీవన సౌదాన్ని పునః నిర్మించుకుంటున్నాను" అని పరుగులు పెట్టే బిజీ బిజీ జీవితాల గురించి చెప్పారు. "ఒంటరితనం కూడా ఒక వరమే... అవసరమైనప్పుడది ఏకాంతమవుతుంది/ చిన్న గదిని కూడా అంతఃపురంగా మార్చేస్తుంది." అని గొప్ప భావుకతను వ్యక్త పరిచారు. "రంగులు పులుముకున్న ప్రపంచంలో/ ఎప్పుడు ఏ రంగును ఒంపుకోవాలో తెలియక తికమక పడుతున్నాను" అని ఇదొక రంగుల ప్రపంచమని వర్ణించారు. "శ్వాస ఆగిపోయిన నా కట్టెను చూచి... కన్నీళ్ళు విడవమని నేను కోరను కానీ / కఠినమైన మాటలు మాత్రం మాట్లాడకండి / ఆ మాటలు ముల్లయి తిరిగి మీ కాళ్ళకు గుచ్చుకుంటాయేమో...!" అని ఈ సమాజానికి చురకలంటించిన కవితలు చాలానే ఉన్నాయి. "దుఃఖమంటే భయమెందుకు కన్నీరంటే అయిష్టతెందుకు / అర్జునుడు దు:ఖించక పోతే కృష్ణుడు భగవద్గీతను బోధించేవాడా? / దు:ఖపు జాడ తెలియకపోతే బుద్ధుడికి జ్ఞానోదయమయ్యేదా / వేదన రుచి చూడకపోతే వేమన యోగి అయ్యేవాడా...! అని దు:ఖం సారాంశాన్ని వివరించారు. మైనస్ అంటే ఆడపిల్లని ప్లస్సు అంటే మగ పిల్లాడని లెక్కలు కట్టే ఈ మనుషులను చీదరించుకున్నారు. "ఎదిగితే గుండెలమీద కుంపటన్నారు / ఎదురు తిరిగితే బరితెగించిందన్నారు..." అని విమర్శించారు. "జీవితమనే పుస్తకంలో మొదటి పేజీని నేను / చివరి పేజీవి నువ్వు/ మధ్య పేజీలలో నాకు నువ్వు నీకు నేనేగా మన మిద్దరమేగా" ప్రేమైక బంధాన్ని చాటారు. "తూరుపు వాకిట నిలిచిన ఒక తుంటరి నక్షత్రం ఒంటరిగా ఉందట/ తోడు కోసం రమ్మంటుంది వెళ్ళనా" అనే చమత్కార కవితలూ ఈ సంపుటిలో కనిపిస్తాయి. "మనిషైనా.. చీమకైనా... చెట్టయినా... పుట్టయినా... చివరకి మట్టినే చేరాలి బతుకును ముగించాలి అదే కదా సత్యం... జరుగుతోంది నిత్యం..." అనే జీవిత సత్యాన్ని చెబుతూ ఈ కవితా సంపుటిని ముగించారు. ఆహ్లాదంగా సాగే ఆమె శైలి పాఠకులను ఆకట్టుకుంటుంది. జీవితంలోని మృదుభావాల మీదుగా ప్రవహించిన అమృతాక్షరాల్లా అనిపిస్తుంది.

■

## కర్ఫ్యూ

**మ**దిలో ఎవరో మతాల
మారణ హోమం చేస్తున్నట్లు ఉన్నారు
మానవత్వం మంటగలిసిపోతోంది
మనిషితత్వం బూడిదయిపోతోంది
హృదయంలో నుంచి దయాగుణం
ఎక్కడ తొంగి చూస్తుందోనని
గుండె తలుపులకు గడి పెడుతున్నారు!

మెదళ్ళలో ఎవరో కులాల
గునపాలు దించుతున్నట్లున్నారు
మానవత్వం మట్టిపాలు అవుతుంది
ఇది మనిషితత్వం బీటలువారిపోతుంది
ఇది మనసులో నుంచి మంచితనం
ఎక్కడ బయటకు వస్తుందోనని
ఇనుప కంచెలు బిగిస్తున్నారు చుట్టూ ...

గుండెల్లో ఎవరో స్వేచ్ఛకు
సమాధులు కడుతున్నట్లు ఉన్నారు
ఆలోచనలన్నీ పూడ్చి పడుతున్నాయి
అభిప్రాయాలన్నీ గాలికి ఎగిరిపోతున్నాయి
జ్ఞాపకాల శ్మశానంలో వాస్తవాల
అస్థిపంజరాలు ఎక్కడ బయట పడతాయోనని
అసత్యాల బండరాళ్లతో పూడ్చి పెడుతున్నారు!

మస్తిష్కంలో ఎవరో అప్రకటిత
కర్ఫ్యూ విధించినట్లు ఉన్నారు
ఆలోచనలన్నీ అణగారి పోతున్నాయి
అభిప్రాయాలు చెల్లాచెదురవుతున్నాయి
జ్ఞాపకాల అరలో నుంచి నిజాల
దొంతరలు ఎక్కడ బయటకు వస్తాయోనని
అబద్ధాల అల్లరిమూకలు కవాతు చేస్తున్నాయి!

**- శ్రీనివాస రెడ్డి**

■

కవిత



# ఋతువున ఋతువై...

- అడిగోపుల వెంకటరత్నమ్
98482 52946

ఒకానొక కోపానికి బలై
విరిగిన నాలుగో కాలు
భూమిపై యీడ్చుకుంటూ
కుక్క మూడు కాళ్ళ జంతువైంది
భూమాతను విరిగిన కాలు
కట్టెలా తట్టిలేపుతూ
మాటలు రాని ఆ మూగజీవి
నీ బిడ్డ బహుమానమంటూ
మాటిమాటికి గుర్తు చేస్తుంది
విరగ్గొట్టిన వాడి నివాసం
ఎదురుగా కనిపిస్తున్నా
రాత్రీ పగలూ విశ్వాసమై
వీధికి కాపలా కాస్తుంది!

గురి తప్పిన వేటగాడి బాణం
గూట్లో పక్షి రెక్కను తెగేసింది
ఆకాశాన్ని ఏలిన పక్షి
నేలపై తిరుగాడుతూ గూడు కట్టి
బిడ్డల్ని గూటికి చేర్చింది
వేటగాణ్ణి ఒక కంటితో చూస్తూ
వొంటి రెక్కతో కాపురాన్ని
కొలిక్కి తెచ్చింది!

గాలి కుంటుతో ఎద్దు
నడక పట్టు తప్పింది
గిట్టలు వణుకుతున్నాయి
ఇన్నాళ్ళూ అనావృష్టిలో
పొర్లాడిన క్షేత్రం
ఏరువాకకు ముస్తాబైంది
నమ్ముకున్న యజమాని నమ్మకం
వమ్ము చేయని ఎద్దు
పళ్ళ బిగువున
మూడు సార్లు అరక దున్ని
నాటేసి గట్టెక్కిన రైతు ముఖంలో
రాజతం చూసింది!

సగానికి సగం చెట్టు నరకబడింది
పూలు పండ్లు చిగుర్లతో
కళకళలాడిన చెట్టు
దిగాలుగా నిలబడలేదు
దీక్షగా సూర్యుడి సాక్షిగా
పిండిపదార్థం పండుకుని
చిగుర్లు వేసి రెమ్మలు చాచి
కొమ్మలు విడిచి
ఋతువును ఋతువును పండించి
విశ్వరూపం ప్రదర్శిస్తుంది!
నమ్మకం కర్తవ్యమైనపుడు
కర్తవ్యం క్రియను జయిస్తుంది!

# కవితలు

## ఎగిరి పో!

- దారల విజయ కుమారి
91771 92275

**రా**ల్చిన గింజలకో
బులిపింపులు
బుజ్జగింపులకో బందీవేమో..!

ఓ నా పిచ్చి
గువ్వా..
పసిడి హంగులు ఆర్భాటాలున్నా
అది పంజరమే
దాని లక్ష్యం.. నిర్బంధమే!
నిరాశల నీడలలో నిలకడెక్కడుంటుంది ?

ఇన్నాళ్లు గా
నువ్వు ఆదమరచినవి ఇవే
నిరంతరం కత్తిరింపుల పాలైన నీ ఉనికి
కట్టడి చేయబద్ధ స్వాతంత్ర్యము ..
నీ రెక్కల బలం
నీకు తెలియక పోవడమే పెను విషాదం
మురిపాల మత్తులో ముంచేయడమే
పంజరం విజయం!

గమనాలకు గౌరవం దక్కిన చోట
దూరాలను కలిసి ఎగిరే చోట
రెక్కల రంగులన్నీ కలిసే చోటు
విశాల విశ్వంలో
నీకోసం ఓ లోకం
కాలు మోపేందుకు నీదైన చోటుకు
నీ కువకువలు
కులుకులకు స్వేచ్ఛగా
నీదైన పాట పాడుకుంటూ..
ఎగిరిపో!



## ప్రతి రోజూ ఉగాదే!

- ఈదర శ్రీనివాస రెడ్డి

**ఆ**డంబరాలకు పరుగులు తీస్తే
ఎండమావులే ఎదురవుతాయి
నిండిన బతుకును కాదని తలిస్తే
వెలితి కొలతలే కనిపిస్తాయి

ఉన్నదానితో తృప్తి పడక లేని దాని కోసం చూస్తే
జీవితం తెల్ల కాగితాల ఖాళీ పుస్తకంలా అగుపిస్తుంది
ఐదంకెల జీతంతోనే అనుబంధాలను వెల కడితే
జీవితం గుడ్డి గుర్రాల పరుగు పందెంలా తోస్తుంది
ఖరీదైన సామాన్లతో ఆప్యాయతలను లెక్కకడితే
బతుకంతా బూజు పట్టిన భవనంలా గోచరిస్తుంది
లక్షల జీతాల కోసం అయినవాళ్లను వదిలి వెళితే
ఎండమావుల వెంటపడే ఎడారి ఒంటెల మారతాము
ఆకాశహర్మ్యాల్లో ఒంటరిగా గడపాలి అనుకుంటే
సమాధుల్లోని శవాలను కాసే కాటి కాపరిలా మిగులుతాం
ప్రతి క్షణం రూపాయి నాణాలతో కాలాన్ని కొలిస్తే
కన్నీళ్లు కార్చటానికి కూడా సమయం లేక
కసాయి వాళ్లుగా మిగులుతాం

అనుక్షణం నోట్ల కట్టల మధ్య సహజీవనం చేస్తే
నెత్తుటి మాంసాలు గడ్డకట్టిన శిలలా మారుతాం
అనుబంధాలు అన్నిటికీ అక్షర రూపం ఇస్తూ పోతే
జీవన పదబంధంలో ఖాళీలంటూ మిగలవు
ఆప్యాయతలు అన్నిటినీ అందంగా పేర్చుకుంటూ పోతే
బతుకు వైకుంఠపాళీలో అన్నీ నిచ్చెనలే ఎదురవుతా యి
అంతరాల వెతుకులాట మాని అందరితో కలిసి బతికితే
ఆనందాన్ని పంచే అనుభూతులను గుండెల్లో దాచుకుంటే
జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవాన్ని ఆస్వాదిస్తూ పోతే
రేపు అన్నదాని కోసం ఆలోచనే రాని ప్రతి రోజూ ఉగాదే!

## సినిమా



# సారంగదరియా .. సంవాదమేందయా ?

తెలకపల్లి రవి

**ఒ**క పాట లేదా రచన సినిమా మరేదైనా హిట్ అయిందంటే దానిపై ఒక వ్యర్థ వివాదం లేవనెత్తడం ఒక రివాజుగా మారుతున్నది. అదేదో విషయం గురించి అయితే అదే తీరు. కేవలం దాని మూలం ఏమిటి, అనుకరణా? అనుసరణా? వంటి సాంకేతికాంశాలతో వాదన సాగుతుంది. ఇప్పుడు సారంగ దరియా పాటపై పంచాయతీ కూడా ఆ కోవలోదే. ఫీల్‌గుడ్ చిత్రాలు తీయడంలో శేఖర్ కమ్ముల సాటిలేని మేటి అయితే, పాపులర్ పాటల్లో అందెవేసిన చేయి సుద్దాల అశోక్ తేజ. వీరిద్దరూ కలిపి ఫిదా కోసం రూపొందించిన 'వచ్చిండే' ఆల్ టైమ్ హిట్. ఇప్పుడు సారంగదరియా కూడా ఆ తరహాకు చేరిపోయే సూచనలు రావడం వల్ల కావొచ్చు చర్చ రచ్చ సాగాయి. ఇంతా చేసి ఆ పాటలో అంత మథనం చేయాల్సిందేమీ లేదు. దర్శకుడి కోరికపై జానపద తరహాలో కవి ఒక పాపులర్ పాట రూపొందించాడు. దానికి మూలం అంతకుముందు జానపద గీతాల పోటీలో కోమలి అనే అమ్మాయి పాడిన పాట అనేది వినగానే అర్థమై పోతుంది గనక దాపరికమేమీ లేదు. పోనీ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న లాగా కోమలి రాశానని చెబుతున్నదీ లేదు. ఇక ఇందులో సమస్య ఏమిటి?

నేను విన్నంతలో రెండు మూడు అంశాలు అనిపించాయి. ఒకటి కోమలికి చెప్పకుండా వాడుకున్నారు. వాడుకున్నా తప్పు లేదు గాని తామలా చేయలేదని వారంటున్నారు. నా పాట మంగ్లీ ఎందుకు పాడాల్సి వచ్చిందని ఆ అమ్మాయి అడిగితే అయ్యో అనిపించవచ్చు గాని ఫోన్ చేసి చెప్పామని, పాడమని కూడా అడిగితే గొంతు బాగాలేదని ఆమె చెప్పారని అశోక్ తేజ వివరిస్తున్నారు. శేఖర్ కమ్ముల కోమలి పేరు కూడా జతచేశారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్లే ఇదంతా వచ్చిందని ఉభయులూ అంగీకరించి, సుహృద్భావంతో రచ్చకు ముగింపు పలికారు. ఇప్పుడది సమస్య కాదు. పోటీలో విన్న పాటను అశోక్‌తేజ వాడుకోవడం ఏదో నిజాయితీ రాహిత్యమైనట్టు కొందరు చేస్తున్న వ్యాఖ్యలే హాస్యాస్పదమైనవి. జానపదం ఎవరిదీ కాదు అంటే దాన్ని తప్పు పడుతున్నారు. ఈ పాట హిట్ కాకుంటే ఇదంతా జరిగేదా అనే ప్రశ్నకు జవాబు చెప్పడం చాలా సులభం.

'చింత చెట్టు చిగురు చూడు చిన్నదాని పొగరు చూడు' పాట ఉందనుకుందాం.. లేకుంటే 'గోగులు పూచే గోగులు పూచే' తీసుకుందాం.. కాదంటే సుప్రసిద్ధమైన 'ఏరువాక సాగారో' తీసుకుందాం. ఎవరిది పేటెంట్? ఎవరిది కంటెంట్? ఎప్పుడూ చర్చ జరగలేదే? నేను సైతం ప్రపంచాగ్నికి అన్న శ్రీశ్రీ చరణాలను అశోక్‌తేజ రెండుసార్లు వాడుకున్నారు, రుద్రవీణలోనూ టాగోరులోనూ. అవార్డులు కూడా వచ్చాయి. జానపదాల్లాగే క్లాసిక్స్ కూడా అందరివీ. ఇప్పుడు నేను జగమే మాయను మరో విధంగా రాస్తానంటే ఎవరూ కేసు వేయలేరు.

*దాని కుడి భుజం మీద కడవ దాని గుత్తపు రవిక మెరియా అది రమ్మంటే రాదుర సెలియా దానిపేరే సారంగ దరియా* అన్న ఈ చరణాలు జానపదాన్ని ప్రేరణగా తీసుకుని సినీకరించినవి తప్ప పేటెంటు ముచ్చట ఏముంటుంది? పాడటమంటారా? మంగ్లీకి ప్రత్యేక తరహా స్వరం వుంది గనక పాడించి ఉండొచ్చు, మామూలుగా ఉండే స్వరాలు, రూపు అక్షరాలు సినిమాకు సరిపోకపోవడం తరచూ జరుగుతుంటుంది.

సారంగ దరియా పదాల గురించి కూడా చాలా చర్చ చేస్తున్నారు. ఇవి కొత్తవి కావు. సారంగధర అన్నది తెలుగునాట ఒక శృంగారంతో ముడిపడిన ప్రయోగం. 'రాజు లేనప్పుడు సారంగో నీవు రారాద పోరాద సారంగో' పాట తెలియని వారెవరు? మహాభారత చరిత్రతో మొదలైన రాజరాజనరేంద్రుని కొలువులో మొదలయ్యే పాట అది. *పడిలేచే కడలి తరంగం వడిలో జడిసిన సారంగం సుడిగాలిలో ఎగిరే పతంగం జీవితమే ఒక నాటకరంగం* బతుకుతెరువు కోసం ఘంటసాల గానంలో సముద్రాల జూనియర్ రాసిన పాట సరేసరి. సారంగి అనే పల్లీయ వాద్యం కూడా వుంది. ఇక దరియా అనేది ధర అన్నదానికి దగ్గరగా వుండటం ఒకటైతే హిందీలో లేదా సంస్కృతంలో అర్థాలు వెతుకుతున్నారు, చెబుతున్నారు. అయితే పాపులర్ సినిమా సంగీతంలో ముందు కూర్పులో నేర్పు, తర్వాతనే అర్థంపై తీర్పు. సూపర్ హిట్ అయింది గనక అదే అంతిమమనీ కాదు.

ముత్యాల ముగ్గులో సినారె రాసిన పాట గుత్తపు రవిక ఓమ్మ చెమట చిత్తడిలో తడిసి ఉండగా.. గుర్తు చేసుకుంటే గుత్తపు రవిక పదం కొత్తదేమీ కాదని తోస్తుంది. మరిన్ని పాటల్లోనూ ఆ ప్రయోగం ఉంది. ప్రాంతాల వారీ తేడాతో ఎన్ని వున్నా ఆస్వాదన లోనూ, ఆచ్ఛాదనలోనూ కూడా తెలుగు భాష మాధుర్యానికి మచ్చుతునకగా నిలిచే మధుర పదసంపద చాలానే వుంది. వాటిని స్వీకరించాలే గాని ఊరకే సాగదీసుకుంటే స్వారస్యం మిగలదు. *సామజవరగమనా* నిను చూసి *ఆగగలనా* పాటలో కాళ్ల గురించి అంత రాయడం గతంలో జరిగిందా అంటే లేదు, అలా అని అనంతంగా ఆస్వాదించలేదా? సంగీతానికి సృజనకూ కూడా సాధారణ వాద ప్రతివాదాలే కొలబద్దలైతే అప్పుడు కళాభిరుచి కాస్త గట్టెక్కుతుంది.

సాహిత్య సృష్టిలో సారూప్యతలు, సామీప్యతలే కాదు పాత దాన్నే కొత్తగా చెప్పాల్సి రావడం సహజమే. ఇతర భాషా పదాలు రాయాల్సి రావడం కూడా సహజం. శూన్యం నుంచి ఎవరు ఏమీ సృష్టించలేరు. పాతది లేకుండా కొత్తది సృష్టించలేము. ఈ ప్రపంచీకరణ యుగంలో ఉంటూ కూడా పక్క రాష్ట్రాల పదజాలం రావద్దనలేము. పక్కదేశాల పదాలను కూడా ప్రయోగించాల్సి రావచ్చు. పైగా మల్టీ కల్చర్ ఉన్న సినిమా రంగంలో అలా కాదని అసలు ఊహించగలమా? అందుకని పాతది కొంత తీసుకుని కొత్తగా రాయడం ఇవాళే సుద్దాల అశోక్ తేజ మొదలు పెట్టింది కాదు. ఆయన చివర కూడా కాదు.



## అతనిపుడు ...

**క**ళ్ళల్లో ఆశల దీపం వెలిగించి
చూపులు... ఆకాశానికి గురి పెట్టి
బతుకును తాకట్టు పెట్టి
నాగలై... పొలమంతా తిరిగి
శ్రమను గోరుముద్దలు చేసి
నేలకందిస్తూనే ఉన్నాడతను !

కణకణకాలే కడుపుతో సూరీడు ఒకసారి
ఆకలంటూ వరుణుడు ఒకసారి వచ్చి
అతడి శ్రమను ఆరగిస్తూనే ఉన్నారు!
ప్రకృతి ప్రకోపానికి చివురుటాకై వణికాడతను
కలల్ని కళ్లల్లోనే దాచుకుని
కన్నీళ్లే మళ్ళీ పండించాడు!
ఆయుష్షు లేని బిడ్డై 'పంట'
కళ్ళ ముందే తల వాల్చేసాక
ఆరుగాలం అతను పడ్డ శ్రమ
ఆకలై... అతని కడుపున చిచ్చుపెట్టింది !

మదుపుకు చేసిన అప్పు
సుడిగుండమై కుదిపేసాక
పాలకుల అండదండలూ కరువై.....
చట్టాలూ ఊతమివ్వక
ఒంటరి పోరాటం సాగిస్తూ...
కళ్ళల్లో ఎడారులు వ్యాపిస్తుంటే...
అతనిపుడు చివురించడం
మరిచిపోయిన మోడయ్యాడు!

**- చెళ్ళపిళ్ళ శ్యామల**
**99498 31146**

# జానపదాలు - సినిమా పాటలు

**జనం నోళ్లలో నానిన జానపద బాణీలు అనేకం ఇప్పటికే సినిమా పాటలుగా రంజిల్లాయి. బాణీ అదే అయినా కథాపరంగా ఈ పాటల్లో మార్పులు కూడా చూడొచ్చు. తెలుగు వెండి తెరపై మెరిసి, మురిసిన జానపద గీతాల జాబితా పెద్దదే! మచ్చుకు కొన్ని చూడండి.**

నాయుడోళ్ళింటికాడ - బ్రహ్మోత్సవం
బేత్రాయి సామి దేవుడ - అత్తారింటికి దారేది
అత్తలేని కోడలుత్తమురాలు - అత్తారింటికి దారేది
వాని ఎద మీద ఉండేటి గమగమ - ఇస్మార్ట్ శంకర్
ఎన్నియాలో ఎన్నియాలో - రాజా ది గ్రేట్
సామజవర గమన - అల వైకుంఠపురం
సామజవర గమన - శంకరాభరణం
రాములో రాములా - అల వైకుంఠపురం
రాజు వెడలె సూడరె - పరివర్తన
చుక్కలు పొడిచేవేళ - జమిందారు
ఆహాహా ఈ వనము - చిట్టి చెల్లెలు
మదనాసుందరీ - భారతనారి
అప్పన్నా తనా మన - చుట్టాలున్నారు జాగ్రత్త
నీ అమ్మ చచ్చినా దమ్మిడొగ్గను - అర్ధరాత్రి స్వాతంత్ర్యం
నాయుడోళ్ళింటికాడ - అందరూ దొంగలే
నాయుడోల్లింటికాడ - కుటుంబ గౌరవం
ఆనందమానందమయెనే - పంతులమ్మ
వేల చూడ వెన్నెలాయె - నాటకాల రాయుడు
ఓ దొర లే దొర రా దొర - ప్రజానాయకుడు
రారా నా ఇంటికి - ఆశాజీవులు, దొరబాబు
ఏ దయ మీ దయ మా మీద లేదు - వందేమాతరం
బంగారు చిన్నదాన - రక్తాభిషేకం
నీకూ నీవారు లేరు నాకూ నావారు లేరు - బంట్రోతు భార్య
రాతిరి రాతిరి వస్తానన్నావు - జడ్జి గారి కోడలు
చిక్కుళ్ళ పువ్వెరుపు - శ్రీవారు
గోరింట పూచింది కొమ్మ లేకుండ - గోరింటాకు
గోగులు పూచే గోగులు కాచే - ముత్యాలముగ్గు
ముత్యమంత పసుపు - ముత్యాలముగ్గు
కంచికి పోతావ కృష్ణమ్మ - శుభోదయం
ఓలమ్మో నారాయణ - వైకుంఠపాళి
ఓ బాబు బయస్కోప్ - ఖైదీ బాబాయ్
రంగమెల్లిపోతానే నారాయణమ్మ - టింగురంగడు
రాయంటి నా మగాడో - తాతామనవడు
కాలీగజ్జె కంకాలమ్మో - ఆదర్శ కుటుంబం
పువ్వు పువ్వు ఏం పూవు - శభాష్ సూరి
దాగుడు మూతా దండాకోర్ -బండరాముడు
ఆకేసి పప్పేసి నెయ్యేసి - అభిమన్యుడు
తప్పెట్లోయ్ తాళాలోయ్ - వాగ్దానం
ఆకేస్కో పోకేస్కో - చిట్టి తమ్ముడు
మాయదారి కీచులాట - అత్త ఒకింటి కోడలే
అందాల మరదల ఆడపడుచు - అన్నాచెల్లెళ్ళు
మరదల మరదల తమ్ముని పెళ్ళామా - వరకట్నం
సంతకెళ్ళి వచ్చేతలికి - మా బంగారక్క
కొప్పునిండ పూలేమో కోడల - జగదేక వీరుని కథ
ఏమంటావేమంటావు - హరిశ్చంద్ర
ఏటికేతం బెట్టి ఏడ్పుట్లు పండిస్తే - చిళ్ళర దేవుళ్ళు
గుడిసెనుక గుడిసేదాన - చిళ్ళర దేవుళ్ళు
లబ్బరు బొమ్మ జెర చూసుకోనీ - చిళ్ళర దేవుళ్ళు
తిన్నెమీద సిన్నుడో వన్నె కాడ - భాగ్యలక్ష్మి
అత్తలేని కోడలుత్తమురాలు - మన దేశం
ఒకరిని నావేశావ్ ఒకరిని చితగ్గొట్టావ్ - బాలరాజు
శ్రీజానకీదేవి శ్రీమంతమునకు - మాయలోకం
వల్లరి బాబు కావు రోరయ్యా - విధివిలాసం
ఎలమంద కోటయ్య ఏలుకో ఏలుకో - కన్నె వయసు
కొప్పు చూడు కొప్పందం చూడు - మానవుడు దానవుడు
ఏరువాకా సాగారో - రోజులు మారాయి



కథ




# సరంగు

- వంజరి రోహిణి
90005 94630

**ఆ**కాశమంత విశాలమైన హృదయం.. భూమికి ఉన్నంత సహనం ఉండాలంటారు స్త్రీకి. కానీ రోజురోజుకి మారుతున్న పరిస్థితులు నా సహనానికి పరీక్ష పెడుతున్నాయి. మా వారు చేసే వ్యాపారంలో తీవ్రమైన నష్టాలు వచ్చాయి. కొన్ని నమ్మక ద్రోహాలు, మరికొన్ని స్వయంకృతాలు, కొంత మా చేతకానితనం వెరసి అప్పుల పాలై, ఉన్న ఇల్లు అమ్ముకుని తుపాను గాలికి చెదిరిపోయిన గూటిని వదిలి పిల్ల పక్షులతోపాటు కొత్త గూటిని వెతుక్కుంటూ వెళ్ళే పక్షి జంటలా, ఉన్న ఇల్లు, ఊరు వదిలి చాలా దూరం వచ్చేశాం, నేనూ వావారూ.

ఎక్కడ చిత్తూరు, ఎక్కడ హైదరాబాద్! ఏ ధైర్యం మమ్మల్ని ఇంత దూరం తీసుకువచ్చిందో తెలియదు. రేపు ఎలా ఉంటుందో తెలియదు. ప్రవాహవేగానికి నదిలో కొట్టుకు పోతున్న చేపల్లా మేము అప్పుల ఊబినుంచి బయట పడాలని, పరిస్థితులు, కాల ప్రవాహానికి అంత దూరం నుంచి ఇక్కడ వచ్చి పడ్డాం.

కృష్ణా నగర్లో ఓ చిన్న ఇంటిని అద్దెకు తీసుకున్నాం. ఉద్యోగం కోసం ఆయన తిరిగిన చోట తిరగకుండా కాళ్ళు అరిగేలా తిరిగినా లాభం లేకపోయింది. నడి వయసు మనిషికి ఉద్యోగం దొరకడం ఎంత కష్టమని. ఓ పక్క పిల్లల చదువుకి ఫీజులు, మరోపక్క ఇంటి అద్దె, నెలవారీ ఖర్చులు. ఈ సంసార సాగరాన్ని ఎలా ఈదాలో తెలియడం లేదు. చిన్న వ్యాపారం చెయ్యాలి అన్నా కాస్త పెట్టుబడి కావాలి. ఇద్దరిలో ఎడతెగని ఆలోచనలు.. మాకు నిద్రని దూరం చేశాయి.

దంపతుల మనసులు ఒకరి మీద ఒకరికి నమ్మకం అనే దారంతో గట్టిగా ముడి వేసుకున్నప్పుడు ఇక బంగారు పుస్తెల తాడుతో ఏం పని? ఆయన కష్టంలో ఉన్నపుడు ఆదు కోకుండా, నేను మెడలో బంగారం వేసుకుని ఎలా ఆనందంగా ఉండగలను? అందుకే తను వద్దని వారిస్తున్నా నేను పసుపు తాడుకు పుస్తెలు కట్టుకుని, నా దగ్గర ఉన్న ఒకే ఒక్క బంగారు దండని ఆయనకిచ్చాను. దానిని కుదవపెడితే నలభై వేలు వచ్చాయి. చిన్న కంప్యూటర్, ప్రింటర్ కొని, కృష్ణానగర్లో చిన్న షట్టర్ కిరాయికి తీసుకుని తనకి బాగా తెలిసిన డిటిపి బిజినెస్ పెట్టాడు ఆయన.

మూడు నెలలు గడిచాయి. కృష్ణానగర్లో చిన్నా చితక రచయితలు, దర్శకులు స్క్రిప్ట్ డిటిపి కోసం రాసాగారు. ఎంత కష్టపడ్డా బొటాబొటి ఆదాయం. మేము తిని, బిడ్డలను చదివించుకుంటే చాలనుకున్నాం.

కాలం ఎంత విచిత్రమైనది! మనకి సంతోషంగా ఉన్నప్పుడు కుందేలు వేగంతో, మనం కష్టాల్లో ఉన్నప్పుడు నత్త నడకన నడుస్తుంది. కాలం ఎప్పుడూ ఒకేలాగా ఉంటుందేమో. ఈ ద్వంద్వాలు మాత్రం మన మనసులోనే ఏమో. అయినా కాలం ఎప్పుడూ ఒకేలా ఉంటే మనం దానికి విలువ ఇవ్వమని కాలానికి భయమేమో!

ఆరోజు సాయంత్రం కొద్దికొద్దిగా మొదలై చిక్కగా ముసురుకోసాగాయి చీకట్లు. సమయం ఎనిమిదైంది. పిల్లలు చదువుకుంటున్నారు. ఈయన పది గంటలపైనా కానీ ఇంటికి రాడు. బియ్యం కడిగి కుక్కర్లో నీళ్ళు పోసి స్టవ్ మీద పెట్టాను. ఇంతలోనే ఫోన్ మ్రోగింది. బంధువులు కానీ, స్నేహితులు కానీ ఫోన్ చేసి దాదాపు నాలుగు నెలలయింది. "ఎప్పుడు సంపద గలిగిన అప్పుడె బంధువులు వత్తురది యెట్లన్నన్" పద్యం తెలుసు కదా.

మరి ఇప్పుడు మేము ఎండిన చెరువుతో సమానం. ఎవరా అని ఫోన్ ఎత్తాను.

"మేడం మీ పేరు విశాలనా?" ఎవరిదో అపరిచిత గొంతు.

"అవును. మీరు ఎవరు" అన్నాను.

"మేడం కృష్ణానగర్లో ఉన్న 'భవాని డిటిపి షాప్' మీదే కదా. అందులో ఉండే సుధాకర్ గారికి ఆక్సిడెంట్ అయింది. బాగా దెబ్బలు తగిలి ఉన్నాయి. మీరు వెంటనే బయల్దేరి రండి. నా పేరు లక్ష్మణ్. సుధాకర్ సర్ గ్రాఫిక్స్ పక్కన మా ఫొటో స్టూడియో ఉంది" అన్నాడు.

అతనేం చెప్తున్నాడో అర్థం కాలేదు. చేతిలో నుంచి ఫోన్ జారిపోయింది. మంచం మీద కూలబడి పెద్దగా ఏడ్చేసాను. పిల్లలు బిత్తరపోయి చూస్తున్నారు. కర్తవ్యం గుర్తుకు వచ్చి గబాగబా పర్సు వెదికితే రెండొందలు ఉన్నాయి. అంతకు మించి పైసా లేదు. పిల్లలను ఇంట్లోనే ఉండమని ఆ చీకట్లో ఏడుస్తూ ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న షాప్‌కి పరుగు పరుగున వెళ్లాను.

అప్పటికే ఆయన్ను చుట్టుపక్కల ఉన్న ఒకరిద్దరు షాపుల వాళ్ళు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారట. బాత్రూం కోసం రోడ్డుకి ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లోకి వెళ్ళి వస్తుంటే, వేగంగా వస్తున్న బుల్లెట్ బండి ఢీ కొట్టిందట. ఇంతెత్తున లేచి విసురుగా డివైడర్ మీద తల కొట్టుకుని పడిపోయారట.

నాకు ఫోన్ చేసిన లక్ష్మణ్ హాస్పిటల్ అడ్రసు చెప్పి నన్ను ఆటో ఎక్కించాడు. అతనికి రెండు చేతులు జోడించాను.

అరకొర సౌకర్యాలతో ఉన్న హాస్పిటల్ బెడ్ మీద స్పృహ లేకుండా పడి ఉన్నాడు ఆయన. ఆ స్థితిలో చూసి దుఃఖం ఆగలేదు. ఊర్లో ఎలా బతికాం మేము. "అవసరం అన్నా" అంటే ఎంతమందికి లెక్క చూసుకోకుండా సాయం చేశాడీయన. ఈ రోజు మాకు నా అనే దిక్కు లేదు.

మన పరిస్థితి బాగా లేకుంటే తాడే పామై కాటు వేస్తుంది. విసురుగా డివైడర్ మీద ఎగిరి పడడంతో బాగా దెబ్బ తగిలి ఎడం కన్ను ఇంతలావున వాచిపోయి నల్లగా కమిలిపోయింది. భుజం ఎముక విరిగిందట. కాలు మెలిక పడి ఎముకలు పక్కకు తొలగిపోయాయట. ఆరు నెలలు బెడ్ రెస్టులో ఉండాలి అని డ్యూటీ డాక్టర్ చెప్పారు.

జీవితపు పరమ పద సోపాన పటంలో మెల్లమెల్లగా నిచ్చెన మెట్లు ఎక్కుతున్న మేము మళ్ళీ పక్కనే ఉన్న పెద్ద పాము నోట్లో పడి పాతాళంలోకి నెట్టివేయబడ్డాం. బతుకు మళ్ళీ మొదటికి వచ్చింది. నన్ను నిరాశ పూర్తిగా ఆవరించింది.

నెల రోజులు గడిచాయి. మంచం మీద లేవలేని స్థితిలో ఆయన.. మానసికంగా కృంగిపోయి నేను.. ఫీజు కట్టలేదని స్కూలు నుంచి పంపి వేస్తే నెల రోజులనుంచి స్కూలుకి వెళ్ళకుండా నిముష నిముషానికి నా వంకా, వాళ్ళ నాన్న వంకా బిక్కుబిక్కుమంటూ దిగాలుగా చూస్తున్న పిల్లలు... సంసార నౌక నడిసముద్రంలో నిలబడిపోయిఉంది. ముందుకు కదిలే మార్గం ఏదని..?

ఇన్నాళ్లు ఆయన నన్ను మహారాణిలా చూసుకున్నారు. కష్టమైనా, సుఖమైనా కలసి పంచుకున్నాం. ఇప్పుడు ఆయన ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాడు. ఆకస్మాత్తుగా సంభవించిన ఈ పరిణామానికి మానసికంగా కూడా దెబ్బ తిని ఉన్నాడు. ఇప్పుడు సంసార నౌకను ముందుకు నడిపే సరంగు బాధ్యత నా భుజాల మీద పడింది.

చిన్నప్పుడు నాది వానాకాలపు చదువు. పది కూడా పాస్ కాలేదు. ఏ ఉద్యోగం చేయగలనని... కానీ, ఆ విషయం సరిగ్గా మధ్యాహ్నం అయ్యేసరికి అరిచే మా ఆకలి పేగులకు తెలియదు కదా. ఏదో ఒకటి చెయ్యాలి. ఏం చేయాలి? బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచించాను.

తళుక్కున ఓ ఐడియా మెరుపులా మెరిసింది. ఆయనకు చెప్పగానే అంగీకరించారు. ఇక ఆలస్యం చేయకుండా షాప్ ఖాళీ చేసి, కంప్యూటర్, ప్రింటర్ అమ్మేసాను. ఇప్పట్లో ఆయన ఆ పని చేయలేరు. వచ్చిన డబ్బుతో కొన్ని పాత్రలు, పెద్ద గ్యాస్ స్టవ్ కొన్నాను. ఇంటిదగ్గరే పచ్చళ్ళు చేసి చుట్టుపక్కల వాళ్ళకి ఇచ్చాను. వాటి రుచి బాగుండడంతో ఆర్డర్ ఇచ్చి పచ్చళ్ళు చేయించుకోవడం ప్రారంభించారు. పొద్దునే నాలుగు గంటలకు లేచి కూరలు తరుగుకొని రకరకాల మసాలా పొడులతో కర్రీస్ చేసి చిన్న చిన్న పాకెట్లలో పెట్టుకుని పెద్ద అంగళ్ల ముందు, వారి అనుమతి తీసుకుని, చిన్న టేబుల్ వేసుకుని దానిమీద కర్రీస్ పెట్టి అమ్మేదాన్ని. సాయంత్రం పచ్చళ్ళు తయారు చేసి పాకెట్స్, బాటిల్స్‌లో నిల్వ చేసేదాన్ని.

ఏదైనా వ్యాపారం మొదలు పెడితే ఊరికే లాభాలు, విజయం మన దగ్గరకు రావు కదా! నిద్రాహారాలు అంటే ఏంటో మర్చిపోయేంతగా నా దృష్టిని పని మీదకు మళ్ళించాను. నేను కష్టపడడం చూసి ఆయన మనసు కష్టపెట్టుకోసాగారు. కానీ తప్పనిసరి పరిస్థితి.

ఆరు నెలల కాలం ఎలా గడిచిందో కూడా తెలియనంతగా నేను కర్రీస్ వ్యాపారంలో మునిగిపోయాను. ఇప్పుడు ఆయన కాస్త లేచి చిన్నగా నడవగలుగుతున్నాడు. కానీ బయటకు వెళ్ళి ఏ పని చేసేదానికి ఆయన శరీరం సిద్ధంగా లేదు. అయినా మగవాడు బయట తిరిగి సంపాదించాలి, ఆడది ఇంట్లో ఉండి వంట చేయాలి అని చాదస్తపు భావాల నుంచి ఇకనైనా మనం బయట పడాలి. ఆయన ఇంట్లోనే నాకు పచ్చళ్ళు ప్యాక్ చేయడం లాంటి పనుల్లో సాయం చేస్తున్నాడు.

ఇప్పుడు నేను కృష్ణానగర్లో ఓ షట్టర్ కిరాయికి తీసుకుని దాంట్లో కర్రీ పాయింట్ పెట్టాను. చిన్న చిన్న రచయితలు, జూనియర్ ఆర్టిస్టులు, డాన్సర్లు ... ఇలా చాలామంది రెగ్యులర్ కస్టమర్స్ అయ్యారు. రుచి, శుచితో కర్రీస్, పచ్చళ్ళు చేస్తానని పేరొచ్చింది. మెల్లమెల్లగా ఫంక్షన్లకు, పెళ్ళిళ్ళకు క్యాటరింగ్ ఆర్డర్ మీద భోజనం సరఫరా చేస్తున్నాను. ఇప్పుడు నా దగ్గర పది మంది పనివాళ్ళు ఉన్నారు. వారందరి జీతాలు, మంచిచెడ్డలు స్వయంగా చూసుకుంటున్నాను. త్వరలోనే జూబ్లీహిల్స్లో సొంతంగా మరో బ్రాంచిని తెరువబోతున్నాను. ఇప్పుడు మంచి కర్రీ పాయింట్ ఎక్కడ ఉంది అంటే అది 'విశాల గారు నడిపే 'భవాని కర్రీ పాయింట్' అని కృష్ణానగర్లో ఎవరిని అడిగినా చెబుతారు.


ఈ సంవత్సరం మహిళా దినోత్సవం రోజు నన్ను నా గురించి, నా వ్యాపార విజయం గురించి మాట్లాడమని కృష్ణా నగర్లో ఉండే స్థానిక మహిళా మండలి వాళ్ళు నాకు ఆహ్వానం పంపారు. నేను పెద్ద చదువులు చదవలేదు. బడా వ్యాపారవేత్తను కాను, గొప్ప వ్యవస్థాపకురాలిని కాదు. కానీ నడి సముద్రంలో కొట్టుకుపోతూ దారీ తెన్నూ తెలియని మా సంసార నౌకను దారిలోకి తెచ్చి, ఓ ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేశాను.

చిన్నప్పుడు మా అమ్మ, అమ్మమ్మ, నానమ్మల దగ్గర నేర్చుకున్న వంటలు, పచ్చళ్ళ తయారీ, మా పెళ్ళైన కొత్తల్లో నా వంటలకు మురిసిపోయి నన్ను పొగడ్తల్లో నింపిన మా వారి నమ్మకం నన్ను ఈ కర్రీపాయింట్ వ్యాపార దిశగా మళ్ళించాయి. నేను బడి పాఠాలు సరిగా చదవలేదు. కానీ కాలం నేర్పిన జీవిత పాఠాలు ఆకళింపు చేసుకున్నాను. జీవితం పెట్టే ప్రతి పరీక్షలో విజయం సాధిస్తూ వచ్చాను.

ఈ విజయం నాకు ఊరికే రాలేదు. కర్రీస్ తయారు చేసి, అమ్మే క్రమంలో నేను ఎన్ని అవాంతరాలు, కష్టాలు ఎదుర్కొన్నానో నాకు తెలుసు. షాపుల ముందు బెంచి వేసుకుని కర్రీస్ అమ్ముకుంటానని ఎంతమంది షాపుల వాళ్ళ కాళ్ళు పట్టుకుని బతిమిలాడాను, మా నిస్సహాయ పరిస్థితిని అవకాశంగా తీసుకుని ఎన్ని వేట ఉచ్చులతో నన్ను బంధించాలని ఎంత మంది ప్రయత్నించారో ఇవన్నీ ఇప్పుడు చెప్పుకుంటూ పోతే ఓ పెద్ద గ్రంథమే అవుతుంది.

నేను చెప్పేది ఒక్కటే. రాత్రి – పగలు, చీకటి – వెలుతురూ ఎంత సహజంగా ఒకదానివెంట ఒకటి వస్తాయో అలాగే జీవితంలో కష్టసుఖాలు ఒకదాని వెన్నంటి ఒకటి వస్తూనే ఉంటాయి. సుఖాలకి పొంగిపోక, దు:ఖాలకు కృంగిపోక మన పని మనం చేసుకుపోతూ పోవడమే. అసలైన విజయం అంటే తలెత్తుకుని బతకడమే. నలుగురికి ఆదర్శప్రాయంగా నిలవడమే. ఉన్న ఊరిని వదిలి మహానగరానికి వచ్చాము. ఎలా బతుకుతామో అని మొదట్లో నేను బెంగ పడ్డాను. కానీ మనం ఎక్కడ ఉండే అదే మన ఊరు. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది అన్నట్లు వ్యాపారంలో నా నిజాయితీ, నలుగురిలో కలగొలుపుతనం ఇప్పుడు నాకు ఇక్కడ చాలామంది ఆప్తులను చేర్చి పెట్టాయి. ఎలా బతుకుతామో కూడా తెలియని పరిస్థితిలో ఉన్న నేను ఇప్పుడు నా ద్వారా పది మందికి ఉపాధి కలిగించగలుగుతున్నానని మాత్రం గర్వంగా చెప్పగలుగుతున్నాను.

నేను ఓ పక్క వ్యాపార పగ్గాలు పట్టి విజయం సాధించినా, మరో పక్క మా జీవితంలో నమ్మకం అనే దీపం ఆరిపోకుండా ఎప్పటికప్పుడు ప్రేమ అని చమురుని నింపి ఆనందపు ఒత్తిని సరిచేసుకుంటూనే ఉన్నాం మా దంపతులం. చీకటిని నిందిస్తూ కూర్చునే కన్నా ఆ చీకటిని పారదోలే చిరుదీపం వెలిగించే ప్రయత్నం చేయడం మంచిది కదా. ఆ ప్రయత్నమే నేను చేశాను. ఇప్పుడు చెప్పండి మీరు.. నేను విజేతనా, కాదా? ■




# శివారెడ్డి ..
# ఆ నలుగురూ ...

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
9948774243

**ల**క్ష్య సాధనలో విజయవంతం కావాలంటే అప్పటికే ఎంతో శ్రమించి అపూర్వమైన అనుభవాన్ని గడించడం ఘనసీయమైన విజయంగా భావించవచ్చు. ఒకరి అనుభవాల నుంచి నేర్చుకోవడం, తన అనుభవాలను జోడించి లోన మరిగించి, పుటం పెట్టుకొని, మనదైన ముద్రతో నిశ్చితాభిప్రాయానికి రావడం మన సజీవతా లక్ష్యాలను పట్టిస్తుంది. జీవితం అనేది బయట నుంచి లోనికి కాదు, లోన నుంచి బయటకు వికసించేది. ప్రతి సందర్భాన్ని లోగొన్నప్పుడే వస్తువు బాహ్యజ్ఞానాన్ని కాకుండా అంతర్జ్ఞాన అన్వేషణ జరుగుతుంది. వస్తుసారాన్ని బాహ్యజ్ఞానంతోనే కాదు అంతర్ జ్ఞాన అన్వేషణతో తాత్త్విక చింతనతో పట్టుకొని అక్షరబద్ధం చేయాలనేది, అనుభవజ్ఞుడైన, స్నేహబద్ధులైన మిత్ర గురువు దొరికి, చెప్పడం అందరికి అందుబాటుగా ఉండే అంశం కాదు. ఏ కొందరికో ఇటువంటి సౌలభ్యం దొరుకుతుంటుంది.

సాహిత్యరంగంలో మిత్రుని రూపంలో గురువుగా తటస్థపడి సహృదయత, ఆత్మీయతను ఆరవోస్తూ ఎడతెగని కవితా ప్రవాహ స్పర్శతో ఎంతో మంది కవులకు కొత్త కాంతినద్దిన కవి కె శివారెడ్డి. నడుస్తున్న సమాజాన్ని జీవితాన్ని ఎలా గర్భీకృతం చేసుకోవాల్సింది, తనదృష్టి కోణంలోంచి అనుభవాల్ని అనుభూతల్ని కళారూపంగా ఎలా అక్షరబద్ధం చేయాల్సింది లెక్చరివ్వకుండా, స్నేహపూరితమైన చర్చల్లో విశదీకరించడం శివారెడ్డి గారి టెక్నిక్. ఎంతోమంది యువకవులు, నవకవులు ప్రజల పక్షం వహిస్తూ, మానవీయ స్పర్శతో, మనోమాలిన్యాలను శుభ్రం చేసుకొని, విలువలతో, విద్వత్తుతో, విస్పష్టమైన దృక్పథంతో శివారెడ్డి భావన కవితాలోకంలో రాణిస్తున్నారు.

చీకోలు సుందరయ్యా రచయిత, పేరెన్నికగన్న పాత్రికేయుడు. 'రంజని కుందుర్తి అవార్డు' కవితల పోటీ నిర్వాహకుడు, 'కవన వేదిక' అధినేత 2020లో 'ఒక గురువు గారు నలుగురు శిష్యులు' శీర్షికతో విలక్షణమైన గ్రంథాన్ని వెలువరించారు. ఇలాంటి ప్రయోగం ఏ భాషలోనూ ఇంతవరకు జరగలేదంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి ప్రత్యేకమైన పుస్తకానికి మరో శిష్యుడైన పెన్నా శివరామకృష్ణ చేత ముందు మాట రాయించాడు రచయిత. చీకోలు సుందరయ్యా గారు కూడా శివారెడ్డిని గురు మిత్రునిగానే భావిస్తారు.

ఒక గురువు కె. శివారెడ్డి, నలుగురు శిష్యులు 1. నందిని సిధారెడ్డి, 2. కందుకూరి శ్రీరాములు, 3. ఆశారాజు, 4. నాళేశ్వరం శంకరం. ఈ గ్రంథంలో గురువుగా చెప్పబడిన కె. శివారెడ్డికి శిష్యులుగా చెప్పబడుతున్న నలుగురు మిత్రులకు గల అనుభంధాన్ని ఆత్మీయతను గాఢమైన మిత్రత్వాన్ని గురుత్వంగా భావించబడుతున్న తీరు తెన్నులను రచయిత గురు శిష్యుల మాటల్లోనే చెప్పించి రికార్డు చేయడం ఎంతో సహజ సిద్ధంగా ఉంది.

ఈ నలుగురు శిష్యులు నాలుగు విభిన్న నేపథ్యాలు గలవారు. వైవిధ్యభరితమైన పరిసర ప్రభావంలోంచి పుట్టుకొచ్చిన వారు. విభిన్న ధోరణులతో అనేకానేక వ్యక్తిగత సమస్యలతో తమను తాము ఏ విధంగా మలచుకొని శివారెడ్డి కవితా స్పర్శతో కవిత్వాన్ని ప్రేమిస్తూ జీవితంలో స్థిరపడుతూ కవిత్వంలో విస్తరించిన క్రమాన్ని విప్పి చెప్పిన గ్రంథమిది. శివారెడ్డి మనిషిని ప్రేమించే మహోన్నతమైన వ్యక్తిత్వం గల వాడు. అందుకే ఈ నలుగుర్ని మిత్రు శిష్యులుగా భావిస్తూ శివారెడ్డి ఎంతో వాత్సల్యాన్ని అందిస్తూ ఆర్థిక సహకారాన్ని కూడా చేసేవాడు. గురుశిష్యుల మధ్య వున్న సాహిత్య మూర్తి మత్వాన్ని

అనేక పార్శ్వాలతో 'చీకోలు' వారు ఆవిష్కరించారు. శివారెడ్డి కవిత్వ వికాస పరిణామాలను ఆదర్శంగా తీసుకొని ఆయన జీవన విధానం నుంచి స్ఫూర్తి పొంది కవిత్వంలో తలలెగగట్టిన వారు ఈ నలుగురున్నూ.

చీకోలు సుందరయ్య గారు ఈ గ్రంథాన్ని రాయడానికి గల కారణం 'అసలు ఆంధ్రదేశంలో ఇన్ని దశాబ్దాలుగా ఒక సాహితీ గురువును, అంతమంది శిష్యులు అనుసరిస్తూ, ఆయన సాహిత్యాన్ని ప్రేమిస్తూ ఏ స్వప్రయోజనాన్ని ఆశించకుండా కలిసి చరిస్తూ, ఎవరి ప్రపంచంలో వారు కవులుగా విస్తరించిన వైనం మరో సీనియర్ కవికి దక్కలేదన్న వాస్తవాన్ని రికార్డు చేయాలనే ప్రేమతోనే' అంటారు.

రచయిత శివారెడ్డి గురించి చెప్తూ "ఆయన మాట్లాడ్డం మొదలుపెడితే చాలు, నరాలు బిగుసుకుంటాయి. శిలలు శిల్పాలై సజీవ రూపంలో ఎగసిపడతాయి. అందరికీ తెలిసిన విషయాల్లోనే కొత్త సంగతులు ధ్వనిస్తాయి. శివారెడ్డి ఒక ప్రసంగం కవిత్వ ప్రేమికులకు ఒక కావ్యానికి కావలసినంత ప్రేరణనిస్తుంది" అంటారు.

"శివారెడ్డి గారు మనిషిలో ఆశలు ఆరిపోకుండా నిలుపుతూ, జీవితం పట్ల అత్యున్నతమైన ప్రేమను కాపాడుతూ, మనిషిలోని అగ్నిని ఆరిపోకుండా కాపాడుతూ మనిషి మనిషిగా బతికే ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తాడు" అనే భావనను చీకోలు వారు వ్యక్తీకరించారు.

"సిధారెడ్డి జీవితంలో అనేక మలుపుల్లో శివారెడ్డి కనిపిస్తాడు. తెలంగాణ వాదులు ఆశించినంతగా శివారెడ్డి ఆ ఉద్యమానికి మద్దతివ్వలేదని విమర్శ వచ్చినప్పుడు అది చిలవలు పలువలుగా మారి సిధారెడ్డిపై వత్తిడి కూడా వచ్చింది. అయితే వారి మధ్య స్నేహాన్ని చిదిమివేయలేకపోయారు. స్నేహం ఇంకా దృఢమైంది. "సిధారెడ్డి మార్క్సిస్టు భావాల్ని బలంగా నమ్మినవాడు. తన ప్రతి కావ్యంలోనూ మార్క్స్ సిద్ధాంతానికి పునరంకితమవుతూ నెత్తురోడుతున్న తెలంగాణ పల్లెల్ని అక్షరీకరించాడు" అంటాడు రచయిత. సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షునిగా గొప్ప సాహిత్య సేవలందించాడు.

కందుకూరి శ్రీరాములు ఉద్యోగ రీత్యా అనేక అవతారాలెత్తిన విషయాలు, ఆయన కఠోర దీక్షతో చదువు కొనసాగించిన వైనాన్ని, ఒక శ్రమ జీవిగా తనని తాను నిరూపించుకొంటూ శ్రమజీవుల పక్షాన కలం పట్టిన కవిగా గుర్తింపు పొందాడు. శివారెడ్డి గారి సన్నిహితుల్లో వున్న స్వచ్ఛమైన కవుల్లో కందుకూరి శ్రీరాములు ఒకరుగా పేరు తెచ్చుకున్నాడు. ప్రతి వస్తువును కవిత్వంలో అంతర్భాగం చేస్తూ కందుకూరి శ్రీరాములు అనుభవంలోనే ఒక అవిచ్ఛిన్నత, ఒక ఏకసూత్రత సాధించాడని శివారెడ్డి మెచ్చుకున్నారు.

"ఆశారాజు కవిత్వానికి ప్రధానశక్తి ఊహాశీలిత్వం కొత్తకొత్త ఊహలు చేయగలడు, ఉపమలు చెప్పగలడు. ఒక ఆలోచనను అనేక కోణాల్నుంచి ప్రదర్శించడం మనం ఆశారాజు కవిత్వంలో చూస్తాం" అంటారు చీకోలు వారు. ఆశారాజు, శివారెడ్డి గురించి చెప్తూ "ఆయన చూపించే ప్రేమతో జీవించే ధైర్యం వస్తుంది. ఆయన పలకరింపులో మృదుస్పర్శ ఉంటుంది. ఆయనతో గడిపే సమయమంతా ఆశను పెంచే కవిత్వమే" అంటారు.

నాళేశ్వరం శంకరం కవితాత్మకతకు కళ్లు చెమర్చుతాయి. పేదరికం ఆయన తోబుట్టువు. కష్టాలు కన్నీళ్లు ఆయన చుట్టాలు స్నేహితులు. అయితే ఈయన నిరాశావాద కవి కాదు. నిప్పులు గక్కే కవి. దుఃఖాన్ని దూనుమాడే కవి. శంకరం వస్తువును లోగొని తనలో ఇంకించుకొని తర్వాతనే అక్షరాలుగా మలుస్తాడు. కవిత ఎత్తుగడ ముగింపు నిర్వహణ తనదైన ముద్రలో ఉంటాయి. శంకరం, శివారెడ్డిని గురించి మాట్లాడుతూ "నాకు మాత్రం శివారెడ్డి ఓ శివ సముద్రం" అంటాడు.

ఈ గ్రంథంలో దాపరికాలు లేని నగ్న సత్యాలు ఎన్నో చెప్పబడ్డాయి. "సభానంతర సభ" ప్రస్తావన ఏ విధంగా శివారెడ్డి పర్యవేక్షణలో సాహిత్యానికి అనుసంధానింపబడింది, ప్రేమ ఆప్యాయతలు క్రమశిక్షణ ఏ విధంగా ఆ సభలో అలవడేది అద్భుతంగా ఆవిష్కరించాడో రచయిత. అసలైన కవికి కవితా నిర్మాణపు ముడి సరుకునెంత నూతనంగా చెప్పవచ్చో ఎంతెంత గాఢంగా మనసుమీద వేసుకుని మనుషుల మధ్య తిరగవచ్చో తెలుస్తుంది ఆ సభలో, శివారెడ్డి చుట్టూ కవులే, కవిత్వపు వాసనలే! అక్కడో వర్క్‌షాప్ వెలిసినట్లుగా ఉంటుంది.

కె.శివారెడ్డి స్వచ్ఛమైన గంగా ప్రవాహం లాంటివాడు. నిత్యనూతనంగా సాగిపోతూనే ఉంటాడు. ఆ ప్రవాహ జలాన్ని 'ఏ రేవులో కవులు ఆ రేవులో తోడుకుంటూ మాకే ఆప్యాయతంతా దక్కిందనుకుంటారు. కాని శివారెడ్డి విశ్వప్రేమికుడు. అందర్నీ ఎంతో సమానంగా చూస్తాడు. ఎక్కడా నేల విడిచి సాము చేయడు. గాలిమేడలు కట్టడు.



## కవితోదయం

ఈ రాత్రి
కలం కదలదు
కవిత పలకదు
మస్తిష్కంలోని ఆలోచన
అస్తిత్వమైన కవితగా మారదు
అయినా ఆలోచన ఆగదు
నా అన్వేషణ తీరదు
ఈ రాత్రి ఇలానే గడిచిపోవచ్చునేమో
కానీ,
నేను రేపటి ఉదయానికి కవితనవుతా!
వసంతానికొక కోయిల పాటనవుతా!

**- భరత్ మూరిశెట్టి**
**81064 40594**

---

అందుకే శివారెడ్డి పరిచయం నిత్యనూతన పరిమళంగానే ఉంటుంది. అందరిలో తానున్నట్లుగానే తనలోనే అందరూ ఉన్నట్లుగానే భ్రమింపజేసే మంత్రశక్తి శివారెడ్డిది.

"ఒక గురువు గారు నలుగురు శిష్యులు" గ్రంధం చీకోలు సుందరయ్య ప్రజ్ఞకు ప్రతీకగా నిలుస్తుంది. ఎన్నెన్నో జీవనరేఖలు ఇందులో చర్చించబడ్డాయి. ఈ గ్రంథం చదివితే గురువుగారైన శివారెడ్డి జీవనరేఖలు క్షుణ్ణంగా అర్ధమవుతాయనడంతో సందేహం లేదు. ■



## ఒక సాయంకాలం...

ఒక సాయంకాలం చల్లటిగాలిలో
ఎందరో గుర్తుకొస్తారు
వారి నీడలు తెడ్లు వేస్తూ కదులుతుంటాయి
అక్కడ వృద్ధులు ఆశలు నరుక్కొని
పిచ్చిగా ఆకాశం వైపు చూస్తుంటారు
చేదు నిజాల్ని సైతం కాసేపు చంపేసి
వెన్నుపూసల్ని నిటారుగా నిలుపుతారు
వాళ్ల బాహువులై కాలం పడవని
నెట్టుకుంటూ మరణాన్ని స్వప్నిస్తూ
మిత్రమా ఇప్పటికిదే జీవితమంటూ
తూలుతూ లేస్తుంటారు
ఎవరికి బెదిరో
నడుస్తున్న నా కాళ్ళల్లోకి
కాలం ముల్లులు గుచ్చుతోంది
గడియారం ముల్లులు
నా పాదాల్ని తొలుస్తున్నాయి
నా చావు సంకేతాలు
రాలిపోయిన దగ్ధ శూన్యంలో వెతుక్కోలేను
రాత్రి ఎనిమిదయ్యింది
అంతా వెళ్ళిపోయారు
అనుభూతుల్ని ఖాళీ చేసి
నేను ఏదో తెలియని దిగుల్తో
మా ఇంటికి అడుగులేస్తూ!

**- ఏటూరి నాగేంద్రరావు**
**74166 65323**



# తులసి కొమ్మ

**పెమ్మరాజు విజయ రామచంద్ర**
9849744161

**రా**త్రి ఎనిమిది గంటలు దాటింది. కమల ఇంట్లోకి, బైటకి తిరుగుతోంది. గోపాల్ ఆఫీసు నుంచి ఇంటికొచ్చాడు. స్థిమితం లేకుండా తిరుగుతోన్న కమలని చూసి “ఏమైంది, అలా తిరుగుతున్నావు” స్కూటర్ స్టాండ్ వేస్తూ అడిగాడు.

“నికిత ఇంకా రాలేదండీ, ఎందుకో నా కాలు, చేయి ఆడడం లేదు. గుండె దడ దడ లాడిపోతోంది” టెన్షన్ తో చెప్పింది.

“కంగారు పడకు, స్కూలుకి ఫోన్ చేద్దాం” గోపాల్ స్కూలుకి ఫోన్ చేశాడు.

ఫోన్ మోగింది. సమాధానం రాలేదు. స్కూటర్ స్టార్ట్ చేసి స్కూలుకి బైలుదేరాడు. స్కూల్ గేటుకున్న తాళమేసుంది. గేట్ పక్క చెక్కబల్ల మీద కూర్చున్న వాచ్ మెన్ ని. “ పిక్నిక్కుకి వెళ్ళిన పిల్లలు వచ్చేశారా?” అడిగాడు.

“ఇప్పుడేటి సార్, పిల్లలు వచ్చి రెండు గంటలయ్యింది. డ్రైవర్లు బస్ ఇడిసేసి ఇంటికెళ్ళి రెండుగంటలవుతుంది. గోపాల్ గుండెల్లో అలజడితో ఇంటికి తిరిగొచ్చాడు.

కన్నీళ్ల నిండిన కళ్ళతో ఆతఅతగా ఎదురు చూస్తోంది కమల. గోపాల్ ప్రిన్సిపాల్ కి ఫోన్ చేసాడు.

“సరే! నేను నికిత క్లాస్ టీచర్ని ఎంక్వయిరీ చేస్తాను. మీకు పదినిమిషాల్లో ఫోన్ చేస్తాను” ఫోన్ పెట్టేసింది ప్రిన్సిపల్ మేడం.

కమల దుఃఖం ఆగటం లేదు.

ఫోన్ మోగింది. కమల ఫోన్ తీసి “ఒక్క నిమిషం. ఆయనకిస్తున్నా” వణుకుతున్న చేతులతో ఫోన్ గోపాల్కిచ్చింది.

“మా ఇంటి సందు దగ్గర దిగితే ఇంతవరకు ఇంటికి రాకుండా ఎక్కడికి వెళుతుంది మేడం?” కమల మొహంలో ఆందోళన పెరిగింది.

“మిస్టర్ గోపాల్! నేను బస్ డ్రైవరుతో మాట్లాడాను. అతను, టీచర్ ఒకే మాట చెపుతున్నారు. టీచర్ మీకు కాల్ చేస్తారు” ఫోన్ పెట్టేసింది ప్రిన్సిపల్.

ఫోన్ మోగింది. “సార్, నికిత టీచర్ శ్రీదేవిని మాట్లాడుతున్నాను. నికిత మీ స్ట్రీట్ చివర దిగింది. ఇది పక్కా” ఫోన్ పెట్టేసింది. వెంటనే ప్రిన్సిపల్ నుంచి ఫోన్ వచ్చింది.

“గోపాల్ గారు, పోలీసు కంప్లయింట్ ఇవ్వండి. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జనార్ధనరావు గారితో మాట్లాడాను. వారి అమ్మాయి మా స్టూడెంట్. మిమ్మల్ని అశోక్ నగర్ స్టేషన్లో కంప్లయింట్ ఇమ్మన్నారు. స్టేషన్కెళ్ళేటప్పుడు నికిత లేటెస్ట్ ఫోటో తీసుకెళ్ళమన్నారు” ఫోన్ పెట్టేసింది ప్రిన్సిపల్.

“మన నికితకి ఏమైంది” ఏడుస్తూ అడిగింది కమల.

“నికితకు ఏమి కాదు. వర్రీ కాకు. ఇప్పుడే మేడంకి తెలిసిన పోలీసు ఆఫీసర్ తో మాట్లాడారు. పోలీసులు తలుచుకుంటే పట్టుకోవడం క్షణం పని”. ఓదార్చే మాటలు చెప్పాడు.

“మరి ఆలస్యమెందుకు? రండి పోలీసు కంప్లయింట్ ఇద్దాం” లేచింది కమల. పర్స్లో నికిత ఫోటోలు చూసుకున్నాడు.

రోడ్ మీద వెళ్లుతున్నంత సేపు తల్లితండ్రుల కళ్ళు నికితనే వెతికాయి. స్టేషన్ కెళ్లారు. విషయం వివరంగా సబ్ఇనస్పెక్టరుకి చెప్పారు.

ఎదురుగా కుర్చీలో కూర్చున్న గోపాల్ వైపు చూస్తూ” మా ఎస్.పి. సారు ఫోన్ చేసి చెప్పారు. డోంట్ వర్రీ. మీ అమ్మాయిని మీకు అప్పగిస్తాం”

ధన్యవాదాలు చెప్పి బైటకొచ్చారు నికిత తల్లితండ్రులు.

“బీట్ టీంకివ్వండి” కానిస్టేబులుకి ఫోటోలు అందించాడు సబ్ఇనస్పెక్టర్.

తల్లితండ్రులకి ఎప్పుడు తెల్లారుతుందాని ఎదురుచూడ్డంతోనే తెల్లారిపోయింది. నిద్రలేక మొహాలు పీక్కుపోయాయి. కునుకు లేని కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. దేవుళ్ళు అందరికీ మొక్కుకుని స్కూల్ కి బయలుదేరారు. ప్రిన్సిపల్, టీచర్స్ సమావేశమయ్యారు. అందరి సానుభూతి చూపుల్ని దాటుకుంటూ తల్లితండ్రులు లోపలికెళ్లారు. తల్లి కళ్ళలో కన్నీళ్ల చెలమలు. కంటి కింద కారిన కన్నీటి గుర్తులు. తండ్రి గుండెల్లో గూడు కట్టుకున్న దుఃఖం.

"ఈవిడే నికిత టీచర్". గోపాల్ కి పరిచయం చేసింది ప్రిన్సిపల్.

"నాకు ఆడపిల్లైనా, మగపిల్లడైనా ఒకటే సంతానం. నికితని గుండెల్లో పెట్టుకుని పెంచుకున్నాం. అరచేతుల్లో ఆడించు కున్నాం. మాకు సర్వం నికితే. నికిత లేని ఇల్లు శ్మశానంలా అనిపిస్తోంది. గజ్జెల చప్పుడు వినకపోతే గుండెచప్పుడు ఆగిపోతున్నట్లుంది. రాత్రి నుంచి ప్రతి క్షణం నరకంలో ఉన్నట్లుంది." భోరున ఏడ్చేసింది తల్లి కమల.

"నికితకేం కాదు. మీరు ధైర్యంగా ఉండండి" ప్రిన్సిపల్ చెప్పింది. ఆఫీసుబోయ్ తెచ్చిన నీళ్లు గడగడ తాగేసింది కమల. గోపాల్ ధైర్యం చెపుతూ భుజమ్మీద చేయి వేసాడు.

"నికిత బ్రిలియంట్ స్టూడెంట్. కంప్యూటర్లో ఎంత విషయ జ్ఞానముందో మానవ సంబంధాల మీద కూడా అంతే పరిజ్ఞాన ముంది. ఆరోవతరగతి ఫస్ట్ ర్యాంకర్." గొప్పగా చెప్పింది శ్రీదేవి టీచర్.

"మిస్టర్ గోపాల్! ఉదయం ఎస్.పి గారు మాట్లాడారు. పోలీసుల సహకారం మనకుంది." మాట పూర్తి కాకుండానే బైట పోలీసు జీప్ శబ్ధం వినిపించింది. ప్యూన్ లోపలికి వచ్చి చెప్పేలోపు సబ్ఇనస్పెక్టర్ సుధాకర్ లోపలికి వచ్చాడు. అందరికీ విష్ చేస్తూ ముందుకెళ్ళాడు.

"మేడం! కేసుని వెంటనే పరిష్కరించాలని ఎస్.పి సారు చెప్పారు. అసలు నిన్న ఎక్కడికి పిల్లల్ని తీసుకెళ్లారు."

నెత్తి మీద టోపీ తీసి ఎదురుగా ఉన్న టేబుల్ మీద పెట్టాడు. గుండెల్ని గుప్పిట్లో పెట్టుకుని భయంగా కూర్చున్నారు నికిత తల్లితండ్రులు. టీచర్లు, స్టూడెంట్స్ తర్వాత తల్లితండ్రుల్ని విచారణకు పిలిచాడు సబ్ ఇన్స్పెక్టర్.

"మీ అమ్మాయికి ఎంతమంది బోయ్ ఫ్రెండ్స్? రోజులో ఎంతసేపు చాటింగ్ చేస్తుంది? ఫేస్ బుక్ అక్కౌంట్ ఉందా?" ప్రశ్నల పరంపర ప్రారంభించాడు సబ్ ఇనస్పెక్టర్.

"మీ ఇంట్లో ఎవరెవరుంటారు?." ఇనస్పెక్టర్ సుధాకర్ అడిగాడు.

"మేము ముగ్గురమే. స్నేహితులు లేరు" ఆయిష్టంగా సమాధానం చెప్పారు.

"మీరు అబద్ధం చెపుతున్నారు. మీ అమ్మాయికి స్నేహితులు ఉన్నారు." బల్ల గుద్దిచెప్పాడు ఇనస్పెక్టర్ .

ఒక్కసారిగా ఇనస్పెక్టర్ మాటకు ఖంగుతిన్నారు. గోపాల్ ఏదో చెప్పబోతోంటే సుధాకర్ ఫోన్ మోగింది."సి. సి కెమెరాల ప్రకారం అటుగా వెళ్ళిందా, మేం వెంటనే బయలుదేర్తున్నాం" హడావిడిగా బైటకొచ్చాడు.

"నాతో రండి!" గోపాల్ని పిలిచాడు. అతన్ని అనుసరించారు. స్కూల్ దగ్గర బైలుదేరిన పోలీసు జీప్ ఒక బిల్డింగ్ ముందు ఆగింది. గోపాల్ దంపతులు ఏం జరుగుతోందో అర్థం కాక తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. సబ్ఇనస్పెక్టర్ ఒక క్షణం ఆగి వాళ్ళ వైపు చూస్తూ "ఇంతకుముందు ఇక్కడకు వచ్చారా?" అడిగాడు. వాళ్ళు మౌనంగా ఉన్నారు.

"సార్! ఏమి జరిగింది?" పోలీసులకి ఎదురొచ్చాడు మేనేజర్ వరదాచారి.

"ఏం జరిగిందో తెలియదా?" సూటిగా అడిగాడు సబ్ఇనస్పెక్టర్.

"నేను ఇక్కడకి కొత్తగా వచ్చాను సార్. అది .."

"నీళ్ళు నమలకుండా నిజం చెప్పండి" గట్టిగా గదమాయించాడు.

"మీకు కంప్లయింట్ చేద్దామనుకున్నాం సార్. కాని అమ్మాయి గంటలో ఈ పెద్దోళ్ల సంతోషానికి కేరాఫ్ అడ్రెస్ అయిపోయింది. అందర్ని ప్రేమతో కట్టిపడేసింది. ఒక్క బొమ్మ కోసం వచ్చి ఇంతమందికి మనవరాలైపోయింది"

ఏకధాటిగా చెప్పుకుపోతున్న వరదాచారి ఆగి పక్కనున్న నికిత తల్లి తండ్రులు వైపు చూసి ఆపేశాడు.

"ఫర్వాలేదు, చెప్పండి. వీళ్లే మిమల్ని కట్టి పడేసిన పాప తల్లితండ్రులు." పరిచయం చేశాడు సుధాకర్.

"మా ఆశ్రమం ఆశయాలు పక్కన పెట్టి మనిషిగా మాట్లాడ తాను" మాటలు వింటూనే కమలకళ్ళు నికిత కోసం వెతుకు తున్నాయి.

"అమ్మంటే బిడ్డని పెంచడం కోసం కరిగిపోయే మంచుకొండ. తాను తినకపోయినా బిడ్డ కడుపునింపే గొప్పమనసు తల్లిది. బిడ్డకు జబ్బు చేస్తే కంటిమీద కునుకు లేకుండా రాత్రింబవళ్ళు కంటికి రెప్పల కాపాడుకునే నిస్వార్ధత్యాగం తల్లిది. పిల్లల మలమూత్రాల్ని శుభ్రం చెయ్యడంలో అసహ్యపడదు. ఆనందం పడుతుంది. ఎంతో కష్టపడి పెంచితేనే పిల్లలు,పెద్దవాళ్ళు అవుతారు. తల్లిప్రేమ తెలియని మనిషి మృగంలా మారతాడని

చరిత్ర చెపుతోంది. తల్లికి ప్రేమ పంచని కొడుకు మనిషిలా కనిపించే పశువు. ఈ తరం ఏ కొవ్వొత్తి కాంతిలో పెరిగారో అక్కడే చీకట్లు పంచుతున్నారు. వారి వల్లే వీధికో వృద్ధాశ్రమం పుట్టుకొస్తోంది" బైటపడకుండా కన్నీళ్లు దాచుకుంటున్న గోపాల్ భుజం మీద నిమిరాడు.

"మీ నికిత తప్పిపోలేదండి. మీలో దారి తప్పిన మానవత్వాన్ని గుర్తు చేసింది. మీరు మర్చిపోయిన బాధ్యతని తెలియచెప్పింది. దానికి కారణం కచ్చితంగా మీ అమ్మగారు తులసమ్మగారే. తులసమ్మగారి శిక్షణలో మీ పాప పెరిగిందని వారి మధ్య ఉన్న ప్రేమానురాగాలు చూస్తే అర్థమైంది." చెప్పాడు మేనేజర్ .

"మీ అమ్మాయిస్నేహితుల విచారణలో అసలు సంగతి బైట పడింది. వృద్ధుల రోజు సందర్భంగా పండ్లు పంచడానికి పిల్లలు వచ్చారు. ఇక్కడున్న బామ్మని చూసి చలించిపోయింది. బామ్మ కంటపడకుండా జాగ్రత్త పడింది. మీకు చెప్పకుండా ప్రేమను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చేసింది" విచారణలో తెలుసుకున్న విషయం బైటపెట్టాడు సుధాకర్.

"రండి. మీ అమ్మాయి ఎంత సంతోషంగా వుందో, పెద్దవాళ్ళని ఎలా సంతోష పెడుతోందో మీరే చూడండి."

కూతురు కోసం ఆర్తిగా వెతుకుతున్న తల్లితండ్రులతో కలసి హాలులోకి నడిచాడు మేనేజర్. అక్కడ దృశ్యాన్ని చూసి అంతా నిశ్చేష్టులైపోయారు. నికిత అందరికి మధ్యలో కూర్చుని తాను నేర్చుకున్న గీతాలు రాగయుక్తంగా పాడుతోంది. చుట్టూ కూర్చున్న పెద్దలంతా అభినందిస్తూ చప్పట్లు కొడుతున్నారు. "మీకు తెలుసా? ఈ పాటలు, పద్యాలన్నీ మా బామ్మే నేర్పింది." అక్కడున్న బామ్మ మెడ చుట్టూ చేతులేసి కౌగలించుకుని ముద్దులు పెట్టింది నికిత.

కూతుర్ని చూస్తున్న ఆనందం పట్టలేక నికిత వైపు వెళ్లబోయింది కమల. ఇనస్పెక్టర్ అపాడు.

"ఇలాంటి సంస్కారమున్న పిల్ల ఏ ఇంట్లో ఉంటే ఆ ఇల్లు కళకళ్లాడుతుంది." మేనేజర్ ఆనందంగా చెపుతున్నాడు. గోపాల్ కళ్ల వెంబడి వస్తున్న కన్నీటిని చేతిరుమాలుతో తుడుచుకున్నాడు. నికిత దగ్గరకి వెళ్లారు. ఒక్కసారి అక్కడున్న వాళ్ళంతా లేచి నిలబడ్డారు. తల్లిని చూడగానే నికిత బామ్మ దగ్గరికి వెళ్లిపోయింది.

"నాకు బామ్మంటే ఇష్టం. బామ్మ నాకు కథలు చెపుతుంది. అన్నం తినిపిస్తుంది. నాతో ఆడుకుంటుంది. బామ్మ ఎక్కడుంటే అక్కడే ఉంటాను. బామ్మే కావాలి. మీతో నేను రాను. మీరు వెళ్ళండి." గూటినుంచి దూరం చేస్తారనే గువ్వపిల్లలా భయంతో బామ్మ ఒడిలో ఒదిగిపోయింది.

"తప్పమ్మా! అలా అనకూడదు. నేను ఇంటికి వెళ్ళమని చెప్పాను రా. నా మాట వినలేదు. అమ్మ, నాన్న తర్వాతే బామ్మని, నీకు సెలవులు ఇచ్చినప్పుడు అమ్మ, నాన్న ఇక్కడకు తీసుకొస్తారని కూడా చెప్పాను. మొండిపట్టు పట్టింది."

తన తప్పు లేదని చెప్పే ప్రయత్నం చేసింది తులసమ్మ.

"అమ్మా! నికిత చేసిందే కరెక్ట్. చిన్నదైనా పెద్ద మనసు చాటుకుంది. నీ దగ్గరనుంచి నేర్చుకున్న మంచి విషయాలతో ఎంతోమందికి దగ్గరైందో ఈరోజు అర్థమైంది. జీవితానుభవ మున్న పెద్దల నీడలో పెరిగే మొక్క ఎంత పరిమళంగా పెరుగుతుందో ఇప్పుడే తెలిసింది. అమ్మఒడి విలువ తెలుసుకోలేక పోయిన అసమర్ధుణ్ణి. నా కూతురు కళ్లు తెరిపించింది. నేను చేసిన తప్పేమిటో తెలిసింది. మేము పొగరుతో చేసిన తప్పుని క్షమించి మాతో రా" అంటూ అమ్మకాళ్ళ మీద పడ్డాడు గోపాల్.

"అవునత్తయ్యా! నికిత నాకు దూరమైపోతుందని స్వార్ధంతో ఆలోచించాను. మీరు నికితకి పంచిన ఆప్యాయత అర్ధం చేసుకోలేకపోయాను. క్షమించండి. రండత్తయ్యా, మన ఇంటికి వెళ్దాం." చేతులు పట్టుకుంది.

"నాకిక్కడ బాగానే ఉందమ్మా. తోటి వయస్సు వాళ్ళతో కాలక్షేపం అవుతోంది. మీరు బాధపడకండి" సాంత్వనగా అంది తులసమ్మ.

"మీ గొప్పతనం గుర్తించలేక మిమ్మల్ని ఆశ్రమంలో చేర్చి పెద్ద తప్పు చేసామత్తయ్యా. దయచేసి మాతో రండి." కమల ప్రాధేయ పడింది.

"నువ్వు రాకపోతే నేను కూడా వెళ్ళను" బుంగమూతి పెట్టి బామ్మ దగ్గరున్న చనువు చూపించింది నికిత.

వెంటనే మనవరాల్ని అక్కున చేర్చుకుని ప్రేమతో ముద్దాడింది బామ్మ. ఒకపక్క మనవరాలి ప్రేమకు తల వంచింది. మరోపక్క కొడుకు కోడలిలో పశ్చాత్తాపాన్ని గ్రహించింది. పెద్ద మనసుతో మన్నించింది. ఇన్నాళ్ళు తోడుగా ఉన్న నేస్తాలకి వీడ్కోలు చెప్పి, మనవరాలితో బయల్దేరింది బామ్మ.

◆ ◆ ◆

బామ్మ తిరిగి రావడంతో గోపాల్ ఇల్లు కొత్తశోభ సంతరించు కుంది. కమలలో మంచిమార్పు గోపాల్ గమనించాడు. పెరట్లో తులసికోటకు బామ్మతో నీళ్ళు పోస్తున్న నికితను చూసి ఆనందంగా ఆఫీసుకెళ్ళాడు. పెరట్లో తులసి మొక్కలాగే పచ్చగా రెపరెప లాడుతూ నికిత పెరుగుతోంది. ■




# నిజ జీవితాలకు అద్దం పట్టిన కథలు



- కేశవ్, కోల్కతా
9831314213

**అం**పశయ్య నవీన్ కలంలోంచి వెలువడిన పాత్రలు ఎక్కడో కథల పుస్తకాల పేజీల్లో అందమైన వర్ణనల మధ్య దాగొని ఉండవు. మన చుట్టూనే తిరుగుతుంటాయి. ఓ విష్ణువర్ధన్‌ని మన ఆఫీసులోనే చూసినట్టుంటుంది. ఓ వాసంతి మన కాలనీలోనే ఎక్కడో ఓ మూల కన్నీళ్ళను తుడుచుకుంటూ పుంజుకున్న చైతన్యంతో ఇంటి నుంచి బయటికి వస్తున్నట్టుంటుంది. ఒక వినోద్, ఒక ప్రకాశ్ మన దగ్గరే ఏ ఛాయ్ దుకాణంలోనో మాట్లాడుతూ కనిపిస్తారు.

14 కథలతో 'యానాంలో ఒక రోజు' టైటిల్‌తో ఇటీవల వచ్చిన అంపశయ్య నవీన్ గారి కొత్త కథల పుస్తకం కరోనా నేపథ్యంలో జీవితాన్ని స్పృశిస్తూ ముందుకొచ్చిన మంచి సాహితీ సృజన. ఒక్కో కథ ఒక్కో మానవతా విలువనీ, జీవిత వాస్తవాన్నీ మనముందుంచుతుంది. 'యానాంలో ఒక రోజు' టైటిల్ కథ గొప్ప సాహితీ సృజనగా చెప్పొచ్చు. 21వ శతాబ్దంలో కూడా హానర్ కిల్లింగ్ పేరు మీద ప్రేమికుల పట్ల అత్యాచారాల నేపథ్యంలో అత్యంత పాశవిక చర్యను గొప్ప సాహితీ సృజనతో కవితలూ, సాహిత్యం కలగలిపి కథను నడిపే విధానం చేయి తిరిగిన అంపశయ్య నవీన్‌కే సాధ్యమయ్యే సాహితీ ప్రక్రియ.

ఉన్నత కులానికి చెందిన రమ్య, దిగువ కులానికి చెందిన రాజేష్‌ల ప్రేమపై తండ్రి అత్యాచారం, వార్ని బంధించే, చూపించే రాక్షస చర్య నేపథ్యంలో కథ నడుస్తుంది. ఒకవైపు కథలో కవులూ, రచయితలూ మరోవైపు ప్రేమజంట – ఎంకిపాటల మధ్య, కవితల మధ్య, సాహితీ చర్చల మధ్య సున్నితంగా ఆర్ట్ మూవీలా కథ సాగిపోతుంది. అలానే 'సృష్టిలో తీయనిది' కథలో అనూహ్య, సుస్మితల ఆత్మీయ, స్నేహితురాళ్ళ బంధాన్ని గాఢంగా అల్లి తర్వాత దర్శకుడు బాలచందర్ తన చిత్రాల్లో నాయకీ నాయకులను చంపేసినట్టు రచయిత చంపె య్యడం చాలా బాధ కలిగిస్తుంది.

కథల్లో పెద్ద పెద్ద వాక్యాలూ, బరువైన ఎక్స్‌ప్రెషన్‌లూ, వర్ణనలూ, శిల్పం కోసమనీ విషమ ప్రయత్నాలు ఎక్కడా కనిపించవు. కథలన్నీ సంభాషణ ద్వారానే ముందుకు నడుస్తాయి. పాఠకుడ్ని నడిపిస్తాయి. ఎక్కడో మధ్యలో అత్యంత సహజంగా కథ ఆరంభమవుతుంది. ఎలాంటి ఇంట్రడక్షన్ ఉండదు. ప్రకృతి వర్ణనలు ఉండవు. ఎక్కువేసి వాక్యాలు ఉండవు. కానీ, పాఠకుడు ఆ వాక్యాల మెట్ల ద్వారా ముందుకు వెళ్ళకుండా ఉండలేడు. గొప్ప రీడేబిలిటీ (Readability) నవీన్ రచనల ప్రత్యేకత. Simplicity is the greatest ornament of Naveen writings.

**కరోనా నేపథ్యంలో మూడు కథలు**

కరోనా నేపథ్యంలో వచ్చిన ఈ పుస్తకంలో మూడు కథలూ కరోనా విషాద ఛాయల్ని సృష్టించడం మరో గొప్ప సాహితీ ప్రయత్నం. 'నడకేరా అన్నిటికి మూలం', 'వినోద యాత్ర', 'సమాంతర రేఖలు' మూడు కథలూ కరోనా లాక్‌డౌన్ విషాద పరిస్థితులకు సాహితీరూపం ఇవ్వడంలో కృతకృత్యమయ్యాయి. అకస్మాత్తుగా ఎక్కడి వాళ్ళక్కడే గప్‌చిప్ అని కేంద్రప్రభుత్వం విధించిన తర్కవిహీనమైన, మానవత్వం లేని చర్య యువకుల మీద, వలస కూలీల మీద, మధ్య తరగతి మీద ఎలాంటి ప్రభావం కలిగించిందో ఈ కథల్లో చూడగలం. 'నడకేరా అన్నిటికి మూలం' కథలో వలస కూలీల దయనీయమైన పరిస్థితినీ, కరోనా కాలంలో వింత ప్రవర్తన అలవర్చుకున్న ప్రజల స్పందననీ విజయవంతంగా రచయిత చిత్రించారు. 'వినోద యాత్ర' సరదాగా తిరగడానికి వెళ్ళిన ఇద్దరు కుర్రాళ్ళు లాక్‌డౌన్ విషమ

పరిస్థితికి బలైన విధానం చూపిస్తుంది. 'సమాంతర రేఖలు' ఉపాధి కోల్పోయిన మధ్య తరగతి కుటుం బాలనీ, ఆదాయం కోల్పోయిన భర్తల అసహనాన్నీ, పరిస్థితులు ఏవైనా బలయ్యేది స్త్రీలే అన్నట్టు గృహ హింసకు గురైన భార్యల నిస్సహాయ పరిస్థితినీ దృశ్యీకరిస్తుంది. ఈ మూడు కథల్లోనూ రచయిత ఎక్కడా ఏమీ చెప్పరు. లాక్‌డౌన్ నిర్దయనీ, అస్తవ్యస్తతనీ, అస్థిరతనీ చూపిస్తారు. ఈ మూడు కథలూ లాక్‌డౌన్ వికృతత్వాన్ని గ్రంథస్థం చేశాయి. కరోనాని ఒక భయంకరమైన వైరస్‌గానూ, దాన్ని పరిష్కరించడంలో అర్థంపర్థం లేని ఆకస్మిక లాక్‌డౌన్‌లను విధించిన ప్రభుత్వం యొక్క అసమర్థతను చారిత్రకం చేశాయని చెప్పగలం.

### కథలు సూక్ష్మంగా ...

అలానే, మరికొన్ని కథల్లోకి తొంగి చూస్తే, 'తండ్రులూ – కొడుకులూ'లో తండ్రి పెన్షన్ డబ్బుల్ని జలగల్లా తినడానికి వెనకాడని కొడుకుల కక్కుర్తి కనిపిస్తుంది. 'అంతరాత్మ– అపరాధ భావన'లో మావోయిస్టుగా దొరికిపోయిన కైలాసం అంతరాత్మని మనో వైజ్ఞానిక కోణంలో చూడొచ్చు. 'రూపం – ప్రతిరూపం'లో ఫొటో ఫోజు పిచ్చిలో పడిన భార్య కనిపిస్తుం ది. కథ ఫన్నీగా నడుస్తుంది. 'సృష్టిలో తీయనిది'లో అనూహ్య, సుస్మితల అపురూపమైన స్నేహం విషాదంగా ముగుస్తుంది. పాఠకుడికి నిద్ర పట్టనీయదు. 'హనీమూన్'లో గ్రాండ్‌గా అత్యంత ఖరీదైన సినీ సెట్టింగ్‌లో పెళ్ళి చేసుకున్న జంట నెలకాకముందే విడాకుల దశకు చేరుకోవడం చూస్తాం. 'అభిమాని'లో ఒక రచయిత, ఒక పాఠకురాలి సాహితీ అనుబంధం సస్పెన్సుగా సాగుతుంది. 'మార్పు'లో మంచి ఉన్నతాశయాల ఫలితంగా కొంతమంది కృషి వల్ల ఆవిర్భవించిన విద్యాసంస్థ చీడపురుగుల మధ్య ఎలా పతనమైందో చూస్తాం. 'అపశృతులు'లో బేషజాలకూ, పబ్లిషిటీకీ, తప్పుడు విలువలకీ పోయి ఒక సాహితీ సంస్థ ఎలా పతనమయిందో చూస్తాం. 'నా గుండెల్లో దాచుకునేదాన్ని'లో మంచి ప్రేమ కథ సునా యాసంగా సాగుతుంది. ఈ కథలన్నీ సమాజాన్ని, సమాజంలో ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న, పతనమవుతున్న విలువల్ని కడిగి వడబోసి చూపిస్తున్నాయి.

### వ్యక్తిత్వం ఉన్న స్త్రీ పాత్రలు

అంపశయ్య నవీన్ కథల పరిచయం ఉన్న ఏ పాఠకుడికైనా మరచిపోలేని స్త్రీపాత్రలు గుర్తుకొస్తాయి. ఎందుకంటే ఫ్యూడల్ సమాజమైనా, బూర్జువా సమాజమైనా అణచివేతకు గురయ్యేది, బలయ్యేది ఎక్కువగా స్త్రీయే. అందుకే నవీన్ స్త్రీ పాత్రలను అద్భుతంగా మలుస్తాడు. మదిలో మరచిపోలేని పాత్రలుగా మిగిలిపోతాయి. ప్రస్తుతం కథల్లోకి వస్తే, ఇక్కడ కూడా మానసికంగా బలమైన స్త్రీలు కనిపిస్తారు. అణచివేతకు గురైతలరాతనీ, ఏం చెయ్యలేమని, ఇలా భరిస్తూ కూర్చోవాల్సిందే అనీ ఈ స్త్రీలు సరిపెట్టుకోరు. అలా అని చాలా పెద్ద సైద్ధాంతిక సిద్ధాంతాలు వల్లించో, స్త్రీ స్వేచ్ఛ గురించో చర్చించో ఏమీ చెయ్యరు. అత్యంత సహజంగా, ఎదురు తిరుగుతారు. 'సమయం కోసం'లో వాసంతి, 'హనీమూన్'లో అపర్ణ, 'సమాంతర రేఖలు'లో వాసంతి, 'అభిమాని'లో నీహారిక వ్యక్తిత్వం ఉన్న స్త్రీలుగా కనిపిస్తారు. పురుషుల చేతిలో, వ్యవస్థ చేతిలో నిస్స హాయమైన మహిళలు కారు వీరు. అత్యంత సహజంగా ఆయా పరిస్థితుల్నించి బయటపడడానికి తమవంతు ప్రయత్నం చేస్తారు. విముక్తికోరే ప్రగతిశీల పాత్రలు ఎంతగా వీలయితే అంతవరకు! రచయిత విజయం ఇక్కడే ఆధారపడి ఉంది. పాత్రల్ని సృష్టించడమే కాకుండా, పాత్రల్ని మార్పువైపుగా పయనింపజేయడం అత్యంత సామాజిక బాధ్యత ఉన్న రచయి తల్లో చూస్తాం. అందులో అంపశయ్య నవీన్ గారు ఒకరు.

'సమయం కోసం' కథ ద్వారా ఇటీవలి 'మీటూ' ఉద్యమం గుర్తుకొస్తుంది. పదవిలో, అధికారంలో పెద్దవారిగా చెలామణీ అయ్యే పురుషుల చేతిలో స్త్రీలు నిశ్శబ్దంగా ఎలా నలిగిపోయారనేది ఇటీవలి 'మీటూ' ఉద్యమం, కోర్టు తీర్పులూ పాఠకులకు పరిచయమయ్యే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ కథ ప్రాముఖ్యతను సంతరించుకుంది. తోటి ఉపాధ్యాయుడిగా ఉంటూ నిరంజన్ తను పెళ్ళి చేసుకుంటానని భ్రమ కలిగిస్తూ తనతో ఆడుకుంటూ కనుమరుగవుతాడు. ఎమ్మెల్యేగా మారి మరొకరిని పెళ్ళి చేసుకొని అంతటితో సరిపెట్టుకోక తను ఒంటరిగా ఉన్నానని చెప్పి తనను రప్పించి మానసిక ఘర్షణకు గురిచేసి అత్యాచారం చెయ్యడానికి చూస్తాడు. వాసంతి 'మీటూ' ఉద్యమంలా ఎదురుతిరుగుతుంది. మీడియా ముందు ధైర్యంగా మాట్లాడుతుంది. అలానే, కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన భర్త చేతిలో నలిగిపోతుంది వాసంతి. అమానవీయంగా, నిర్దాక్షిణ్యంగా దెబ్బలు కాస్తుంది. అత్యంత ఘర్షణకు గురవుతుంది. 'సమాంతర రేఖలు'లో చివరికి భర్తమీద గృహహింస కేసు పెట్టడానికి సమాయత్తమవుతుంది. అలానే, 'హనీమూన్'లోని అపర్ణకు తండ్రి అత్యంత ఖరీదైన హంగులతో పెళ్ళి చేస్తాడు. హనీమూన్‌కి ఊటీకి బయల్దేరతారు కొత్త జంట. భర్త దిగజారుడుతనాన్ని, చవకబారు వ్యక్తిత్వాన్ని, డబ్బు కక్కుర్తినీ, ఏ విలువలూ లేని అత్యంత పతనమైన మనిషి కాని మనిషిని చూసే అవకాశం లభిస్తుంది. భరించలేక నేరుగా ఇంటికి వస్తుంది. విడాకులు తీసుకుంటానని ఇంట్లో చెబుతుంది. అమాయకంగానో, ఆవేశంతోనో, నిస్సహాయతతో ఏడుస్తూనో కాదు; గొప్ప ధైర్యంతో, చైతన్యంతో మార్పు కోరే

మహిళలా కచ్చితంగా చెబుతుంది. తన నిర్ణయంలో పరిపక్వత ఉంది. జ్ఞానోదయం ఉంది. చెదుతో రాజీపడని ఆధునిక మహిళ ఆవేదన ఉంది. 'అభిమాని'లో ఒక డైరెక్టర్ కుమార్తె నీహారిక టాక్స్ కన్సల్టెంట్ అయిన భర్త ప్రవర్తన భరించలేక, అవమానాల్ని సహించలేక అతడిని విడిచిపెట్టడానికి సిద్ధమవుతుంది. మార్పు కోరే ఆధునిక మహిళకు సింబాలిక్‌గా ఆదర్శంగా నిలుస్తాయి ఈ పాత్రలు. ఆత్మాభిమానం కోసం, విలువలతో జీవించడం కోసం ఐశ్వర్యాలను విడిచిపెట్టేసుకున్న అపర్ణ, నీహారిక; మధ్యతరగతి బంధనాలను, నిశ్శబ్ద గృహహింస నుంచి విముక్తి కోరే వాసంతి ... మహిళలకు ఆదర్శంగా నిలుస్తారు.

**తరిగిపోతున్న మానవతా విలువలు**

తరిగిపోతున్న మానవతా విలువలు, ప్రపంచీకరణ అంటుజాఢ్యాలు మనం ప్రతి కథలోనూ చూడగలం. 'తండ్రులూ, కొడుకులూ', 'సమయం కోసం', 'నడకేరా అన్నిటికి మూలం', అపశృతులు, హనీమూన్, మార్పు కథల్లో రచయిత ఆయా పాత్రల ద్వారా, సంఘటనల ద్వారా మానవ సంబంధాల మధ్య వస్తోన్న అసహజ విలువలు, డబ్బు సంబంధాలు కనిపిస్తాయి. తండ్రికి వచ్చిన పెన్షన్ డబ్బుల్ని జలగల్లా తినడానికి వెనుకాడని పతనమై పోతున్న కొడుకులు కనిపిస్తారు 'తండ్రులూ కొడుకులూ'లో. కరోనా భయం మనిషిని ఏ స్థాయికి తీసుకుపోతుందీ అంటే, సాటి మనిషిని కరోనాను అంటించేస్తాడని పెట్రోల్‌తో తగలబెట్టడానికి వెనకాడరు జనం! తనదాకా వస్తే, మనిషి క్రూరమృగంగా ఎలా మారిపోతాడో 'నడకేరా అన్నిటికి మూలం' దృశ్యీకరిస్తుంది. విపరీతంగా డబ్బు ఉండి, డాక్టరు ప్రాక్టీసు లండన్‌లో ఉండి అందులో సంతృప్తి లేక మామయ్యగారి ఉచిత విరాళంతో నర్సింగ్ హోం కట్టించుకోవాలన్న అపర్ణ భర్త దాహం, అందుకోసమే ఆ డబ్బు కోసమే తను పెళ్ళి చేసుకున్నట్టు తెలివిగా భర్త అనురాగ్ అపర్ణకు చెప్పడం మనిషి అత్యంత హేయమైన, నీచమైన పతనస్థాయినీ, డబ్బు సంబంధాన్నీ చూపిస్తుంది 'హనీమూన్'. నైతిక విలువలనూ, సాహితీ విలువలనూ అందించి సమాజాన్ని ముందుకు తీసుకుపోవలసిన సాహితీ సంస్థలు బేషజాలకూ, కృత్రిమ పబ్లిసిటీలకు పోయి సాహిత్యాన్ని ఏ స్థాయికి దిగజార్చాయో 'అపశృతులు'లో చూస్తాం. అలానే మంచి విలువలతో, ఎంతో ఆదర్శంతో, త్యాగంతో ఏర్పరచుకొన్న విద్యా సంస్థలోకి చీడపురుగులు, నయ వంచకులు చేరి ఎంత అధిక స్థాయిలో సర్వనాశనం చెయ్యగలరో, తమ పతన విలువలను, హేయమైన నీచమైన వ్యక్తిత్వాలను ఎలా చూపించగలరో 'మార్పు'లో చూస్తాం. ఈ కథల సంపుటి ... మనుషుల జీవితాలను సామాజిక బాధ్యతతో ప్రతిభావంతంగా కథల రూపంలోకి తర్జుమా చేసిన సాహితీ సృజన. ■

**: నివాళి :**

## ప్రముఖ సాహితీవేత్త అన్నపరెడ్డి కన్నుమూత



ప్రముఖ సాహితీవేత్త అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (88) మార్చి 10వ తేదీన హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయనకు భార్య లక్ష్మీ కాంతమ్మ ఉన్నారు. తెలుగు ప్రజలకు ఆయన 'ఫ్రాయిడ్'ను, మనోవిజ్ఞాన శాస్త్రాలను పరిచయం చేశారు. బౌద్ధానికి సంబంధించిన అనేక గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. 'మిసిమి' మాసపత్రికకు సంపాదకులుగా పనిచేశారు. 1933 ఫిబ్రవరి 22న గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరులో అన్నపరెడ్డి జన్మించారు. గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్, ఆంధ్ర యూనివర్సిటీలో ఉన్నత చదువులు పూర్తి చేశారు. సోషియాలజీ లెక్చరర్‌గా చాలామంది విద్యార్థులను ప్రభావితం చేశారు. 1991లో లెక్చరర్‌గా ఉద్యోగ విరమణ పొందిన అనంతరం 30 గ్రంథాలు రచించారు.

## 'ఖాకీ బతుకులు' మోహనరావు మృతి



స్పార్టకస్ కలం పేరుతో పోలీస్ వ్యవస్థలోని మరో కోణాన్ని 'ఖాకీ బతుకులు' నవలగా చిత్రీకరించిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ గంటినపాటి మోహనరావు (68) మార్చి 21 ఆదివారం రాత్రి తెనాలిలో కన్ను మూశారు. ఆయనకు భార్య మేరీ, కుమార్తె ప్రత్యూష, కుమారుడు ప్రేమ్‌చంద్ ఉన్నారు. 1980–83 మధ్యకాలంలో ఆయన 'ఖాకీ బతుకులు' నవల రాశారు. 1940–75 మధ్య కానిస్టేబుల్‌గా పనిచేసిన తన తండ్రి ప్రకాశం జీవితానుభవాలతో రాసిన ఈ నవల, 1996లో పుస్తకరూపం దాల్చింది. ఈ నవలపై అప్పటి పోలీసు అధికారులు కన్నెర్ర చేశారు. ఫలితంగా మోహనరావు ఉద్యోగం పోయింది. 13 ఏళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తరువాత 2011లో ఉద్యోగం తిరిగి, పొందారు. 10 నెలల పాటు హెడ్ కానిస్టేబుల్ హోదాలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఎమర్జెన్సీ తర్వాత పరిణామాలతో 'ఖాకీ బతుకులు' రెండో భాగం రాస్తానని ఆయన అప్పట్లో ప్రకటించినా, అది కార్యరూపం దాల్చలేదు.

కథ



# మానసం

కేశిరాజు వెంకట వరదయ్య
98491 18254

"హేయ్ తేజస్! లేవ్వయ్యా... తొమ్మిది గంటలు దాటింది. నిన్ను, చిన్నినీ నిద్ర లేపడం రోజూ నాకో డ్యూటీ అయింది. మానస్‌ని చూడు... ఉదయాన్నే లేచి స్నానం చేసి ఎలా రెడీ అయి కూర్చున్నాడో! లే ఇక!" అతను కప్పుకున్న బ్లాంకెట్ లాగేస్తూ అసహనంగా అంది కమల.

"ఈవేళ క్లాసులు లేవు. కాసేపు పడుకోనీ పిన్నీ"

"అదేంటి ? పదింటికి క్లాస్ ఉందన్నావుగా" గుర్తు చేసింది కమల.

సైన్సు టీచర్ అంజని మేడం గుర్తుకి రావడంతో దిగ్గున లేచి పరుగున బాత్రూంకి వెళ్ళాడు తేజస్. అతను వచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద రెడీగా ఉన్న బూస్ట్ రెండు గుక్కల్లో తాగి స్కూలుకి బయలుదేరాడు తేజస్.

మానస్, తేజస్ కవలలు. ఇద్దరు ఇంటర్నేషనల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తల్లి అమల, తండ్రి విశాల్ ఇద్దరు డాక్టర్లు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అసైన్మెంట్ మీద నైజీరియా వెళ్లి అక్కడ మూడేళ్లు పనిచేసి, అది పూర్తవుతూనే అమెరికా వెళ్లి నాలుగు సంవత్సరాలయింది. నైజీరియా వెళుతున్నప్పుడే తేజస్, మానస్‌లను హైదరాబాద్‌లో సొంత చెల్లెలు కమల దగ్గర ఉంచి వెళ్ళింది అమల. కమలకి ఒక కూతురు. ముద్దు పేరు 'చిన్ని'. అన్నలిద్దరంటే దానికి ప్రాణం. తల్లిని అన్నలిద్దరితోబాటే 'పిన్నీ' అని పిలిచేది.

అమెరికా వెళ్లిన వెంటనే పిల్లల్ని తీసుకెళదామను కున్నారు అమల, ఆమె భర్త విశాల్. అనిశ్చితితో నాలుగేళ్లయినా తీసుకువెళ్ళలేదు. అదిగో, ఇదిగో అనుకుంటూ నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. నాలుగేళ్లలో ఒకసారి హైదరాబాద్ వచ్చి పిల్లల్ని చూసి వెళ్లారు. గత సంవత్సరం మానస్, తేజస్ తల్లితండ్రుల దగ్గరకు వెళ్లి వేసవి సెలవులు గడిపివచ్చారు.

◆◆◆

"పిల్లల్ని హైస్కూల్ లెవెల్లో ఇక్కడికి తీసుకువస్తే 'కోప్ అప్' కాలేరు. అండర్ గ్రాడ్యుయేషన్‌కి వస్తే... ఇక ఒక్కసారే ఇంటరయ్యాక తీసుకెళతామే! ఇన్నేళ్లు పిల్లల్ని కన్నతల్లిలా చూసుకున్నావు. ఈ మూడేళ్లు కూడా కష్టమనుకోకే" అని చెల్లెల్ని అభ్యర్థించింది అమల.

"అక్కా! తేజస్ ఎక్కడున్నా, ఎవరితోనైనా కలిసిపోతాడు, నెగ్గుకొస్తాడు. మానస్ అలా కాదు. మౌనంగా ఉంటాడు. మీరెందుకు తీసుకెళ్లడం లేదనే చింత. ఆలోచన. దిగులుగా ఉంటాడు. వాడింట్లో ఉన్నంత సేపు నా కూతురినీ కూడా ముద్దు చేయను. స్కూల్నుంచి వస్తూనే 'పిన్నీ...పిన్నీ' అంటూ ఇల్లంతా వెదుకుతాడు. వాడికేదో భయం, అభద్రత అక్కా! సున్నిత మనస్తత్వం. వాడిని మీరింకా ఇక్కడే వదిలిస్తే ...." అంటూ నీళ్లు నమిలింది కమల.

"మా అశలు, ఆకాంక్షలూ అంతా వారే కదా! ఇంకా మూడేళ్లు. ఏం చేయగలం చెప్పు వీలు కానప్పుడు.... అయినా వాళ్ళిక్కడికొచ్చాక ఈ రంగుల ప్రపంచాన్ని చూసి అన్నీ మరిచిపోతారు. నువ్వేం కంగారు పడకు" అంది అమల విషయాన్ని దాటవేస్తూ.

"వారి బాల్యాన్ని మీరెంతగా కోల్పోయారో గుర్తించేసరికి కాలం కరిగిపోతుందక్కా" అని పైకనలేక మనసులో ఆక్రోశిస్తూ... "అది కాదక్కా..." ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్న కమలను అడ్డుకుని ...

"సరే లేవే! మరీ పెద్ద మాటలు. పిల్లలకేం తెలుసు! మనమెలా పెరిగాం? నాన్న మాటకు ఎప్పుడైనా ఎదురు మాట్లాడామా? ఎటూ ఇంటర్ పూర్తయ్యాక తీసుకెళతానం టున్నాను కదా! మూడేళ్లు... చూస్తూ గడిచిపోతాయి. వేసవి సెలవుల్లో అందరూ ఇక్కడికి రండి. టికెట్లు బుక్ చేస్తాను. ఇద్దరితో రేపు మాట్లాడతామని చెప్పు. కొద్దిగా బిజీగా ఉన్నాను" అంటూనే ఫోను కట్ చేసింది అమల.

"అందుకేనక్కా యథార్థం చెప్పాలంటేనే నాకు జంకు" అను కుంటూ పనిలో నిమగ్నమైంది కమల.

"అమ్మేనా మాట్లాడింది ?" అడిగాడు అప్పుడే అక్కడికొచ్చిన మానస్.

"అవును! మీతో రేపు మాట్లాడతానంది. వేసవి సెలవుల్లో మనందరికీ అమెరికా టికెట్స్ బుక్ చేస్తానంది అమ్మ" అంది కమల మానస్‌ని ఉత్సాహపరచడానికి.

"బిస్కట్‌లే పిన్నీ! ఇంతకీ మేము అక్కడ స్కూల్లో చేరుతున్నామా? తిరిగి వస్తున్నామా?" కుతూహలంగా ప్రశ్నించాడు మానస్.

"నాకు తెలీదు నాన్నా! నువ్వే అడిగి తెలుసుకో!" అబద్ధమాడింది కమల, మానస్ ని బాధపెట్టడం ఇష్టం లేక.

"నువ్వు చాలా మంచిదానివి పిన్నీ! లవ్ యూ" అంటూ గట్టిగా కౌగలించుకున్నాడు.

"లవ్ యు టూ మానస్!" అప్రయత్నంగానే మానస్‌ని దగ్గరకు తీసుకుని హత్తుకుని, నుదురు మీద ముద్దు పెట్టుకుని ... నువ్వు కూడా చాలా మంచివాడివి మానస్!" పొంగుకొస్తున్న కన్నీటిని చీరకొంగుతో తుడుచుకుంటూ అంది కమల.

"నువ్వే మా అమ్మవి..." అంటూ వేగంగా వెళ్ళిపోయాడు తన గదిలోకి.

"మానస్! ..." ఆందోళనతో బిగ్గరగా పిలిచింది కమల.

వెనక్కు చూడకుండా, పలక్కుండా వెళ్ళి గది తలుపు వేసుకున్నాడు మానస్. మూసుకున్న తలుపుల వంక చూస్తూ నిరుత్తరి అయింది కమల.

◆◆◆

మానస్, తేజస్, కమల, చిన్నీ అమెరికా వచ్చిన వారం రోజులకే వేగస్, గ్రాండ్ కాన్యన్, శాన్ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెలెస్ ట్రిప్ వేసింది అమల. డాలస్ నుంచి లాస్ వేగస్ వెళ్లే ఫ్లైట్‌లో తేజస్ తండ్రి పక్క సెటిలయ్యాడు. ప్రయాణికులు ఒక్కరొక్కరుగా సీట్లలో సెటిలవుతున్నారు. ఎయిర్ హొస్టెస్ కేబిన్ లగేజి సర్దుతోంది.

మానస్ వెళ్లి 'చిన్ని' పక్కన కూర్చున్నాడు.

"మానస్ నువ్విక్కడకి రా! అక్కడ పిన్ని కూర్చుంటుంది" అంది అమల.

"ఇట్స్ ఓకే మామ్... ఐ యామ్ ఫైన్ హియర్" అన్నాడు మానస్ నిర్లక్ష్యంగా.

చిన్న బుచ్చుకుంది అమల. నిలబడి వారిని గమనిస్తూ వేచి చూసిన కమలను తన పక్కన సీట్లో కూర్చోమంది అమల అసహనంగా. మానస్ ఉద్దేశ్యపూర్వకంగా తల్లికి దూరంగా మసలడం, అతని ప్రవర్తన, అసంతృప్తి స్పష్టమైన సంకేతాలతో కనిపిస్తోంది. ఎక్కడ అక్క తనని అపార్థం చేసుకుంటుందేమోనన్న చింతతో తల్లడిల్లి పోయింది కమల.

"మానస్! నువ్వు అమ్మ దగ్గర కూర్చో. నేను చిన్ని దగ్గర కూర్చుంటాను" అంది కమల సీట్లోనుంచి వెనక్కి తిరిగి మాట్లాడుతూ.

"మీరిద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకోండి పిన్నీ!" అన్నాడు మానస్ అదే ధోరణితో.

వారం రోజుల ట్రిప్ నుంచి తిరిగి వచ్చాక ఆరోజు అమల, విశాల్‌కి డే ఆఫ్ కావడంతో అందరూ హాల్లో కూర్చుని ట్రిప్ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మానస్! వచ్చిన దగ్గర్నుంచి గమనిస్తున్నాను. ట్రిప్‌లో కూడా గెస్ట్‌లా దూరంగా మసిలావు. నువ్వు నీ ఇంటికి వచ్చావ్... తెలుసా?!" అంది కొడుకుతో మాట్లాడాలని నిర్ణయించుకున్న అమల.

"మామ్! వాడినలా వదిలెయ్... ప్లీజ్" అన్నాడు తేజస్ వెంటనే కలుగచేసుకుంటూ.

"వాడిని మాట్లాడనివ్వు తేజస్! నువ్వెందుకు మధ్యలో కలుగచేసుకుంటావ్?!" సీరియస్‌గా అంది అమల, తేజస్ ఎందుకన్నాడో ఆలోచించకుండా, అర్థం చేసుకోకుండా. వారికి ఏకాంతం కల్పిస్తూ అక్కడి నుంచి వెళ్ళింది కమల చిన్నితో.

"కమాన్... మానస్! మాట్లాడు. నువ్వు, నీ మౌనం, నీ ప్రవర్తన భరించడం... కష్టంగానూ, చికాకుగా ఉంది. టాలరేట్ చేయలేకపోతున్నాను. చెప్పు. నీ ప్రాబ్లెమ్ ఏమిటి?" కోపావేశంతో అడిగింది అమల.

"నా ఇంటికొచ్చానా? ఐతే నేను హైదరాబాద్‌లో ఎందుకున్నాను?" సూటిగా అడిగాడు మానస్ టీవీ ఆన్ చేస్తూ. అతని చేతిలోనుంచి రిమోట్ లాక్కుని టీవీ ఆఫ్ చేసి, దాని సోఫాలో గిరాటు వేసింది అమల.

మానస్ ముఖం కందగడ్డలా ఎర్రగా అయింది. ముక్కు పుటాలు అదురుతున్నాయి. రెండు చేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు.

అమల, విశాల్ ఇద్దరూ లేచి మానస్ దగ్గరికి వెళ్లారు.

"మానస్! నీ బాధ మాకు తెలుసు. మా సమస్యలే మీకు తెలియవు. మిమ్మల్ని హైదరాబాద్‌లోనే ఎందుకు ఉంచాల్సి వచ్చిందో చెబుతాను విను. మేమిక్కడికి వచ్చాక రెండు సంవత్సరాలు సరిగ్గా సెటిల్ కాలేకపోయాము. ఇక్కడ ఉండడమా తిరిగి ఇండియా వచ్చేయడమా అన్న డైలమాలో ఉన్న కారణంగా మిమ్మల్ని తీసుకురాలేదు. థర్డ్ ఇయర్ తీసుకువద్దామనుకునే సరికి మీ అకడమిక్ ఇయర్ సగం అయిపోయింది. సారీ... మానస్" అంటూ మానస్‌ని దగ్గరికి తీసుకున్నాడు విశాల్.

"ఇండియా నుంచి వచ్చిన వారికి హైస్కూల్లో కోప్ అప్ కావడం కష్టం అన్నారు ఫ్రెండ్సు. అందుకే అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌కి వస్తే మీకే ఇబ్బంది ఉండదని ఆలోచిస్తున్నాము" అంది అమల వారిద్దరినీ సాలోచనగా చూస్తూ.

"మామ్.. నాకర్థం కాలేదు, నువ్వేం చెప్పావో" అన్నాడు తేజస్.

"ఇంటర్మీడియట్ దాకా అక్కడ, తరువాత ఇక్కడ ... యాం ఐ రైట్ మామ్?" ధిక్కార స్వరంతో అన్నాడు మానస్.

"అవును మానస్! మీ కెరియర్ బాగుండాలనే అన్నీ అలోచించి, మేమీ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది" అంది అమల.

"చాలా స్టడీ చేశాము. ఫ్రెండ్సుని విచారించాము. వారి పిల్లలతో మాట్లాడాము. మీరు ఇంటర్మీడియట్ పూర్తి చేసి వెంటనే ఇక్కడ అండర్ గ్రాడ్యుయేషన్‌లో చేరిపోవచ్చు. ఎవ్విరిథింగ్ ఈజ్ గోయింగ్ టు బి గుడ్" అన్నాడు విశాల్.

దిగ్గున లేచి అక్కడ్నుంచి లేచి తన గదిలోకెళ్ళాడు మానస్.

విశాల్ నిరాశగా, నిస్సహాయంగా తనవంక చూడడం గమనించి "డోన్ట్ వర్రీ. విశాల్! హి విల్ బి ఆల్రైట్" అంది అమల భర్తకు ధైర్యం చెబుతూ.

♦ ♦ ♦

"హే గైస్... మూడు రోజుల్లో తిరుగు ప్రయాణం. ఈ రోజు సాయంత్రం షాపింగ్‌కి వెళదాం. బయటే డిన్నర్ చేసి వద్దాం! ఒకే బోయిస్!?" అన్నాడు విశాల్ హుషారుగా.

"ఒకే డాడ్" సంతోషంగా అన్నాడు తేజస్ తండ్రి మాటకు వెంటనే స్పందిస్తూ.

"మానస్!  ఛీర్ అప్ ..." రెట్టించాడు విశాల్ మౌనంగా ఉన్న మానస్ వంక చూస్తూ.

"విశాల్! వాడిని వదిలెయ్" అంది కిచెన్ లోపలి నుంచి అమల.

కిచెన్‌లోనికి వెళ్ళాడు విశాల్. కిచెన్లోనుంచి బయటకు వెళ్ళబోయింది కమల.

"నువ్వుండు కమలా! వెళ్ళకు. మానస్ గురించి మాట్లాడాలి... వాడి ప్రవర్తన ఇబ్బందిగా ఉంది.  ఇద్దరిలో ఎంత తేడా? అక్కడ కూడా ఇలానే ప్రవర్తిస్తాడా? నువ్వెలా హేండిల్ చేస్తున్నావు వీడిని?" ఉత్సుకతతో అడిగాడు విశాల్.

"బావా! మీరిద్దరూ డాక్టర్లు. మనుషుల్ని చదవగలరు. వాడు చిన్నపిల్లాడు..."

"సో వాట్... వుయ్ ఫెయిల్డ్! వాడి తత్వం ఏవిటో అసలర్థంగావడం లేదు !"

"వారిద్దరితో నాకెప్పుడూ, ఎలాటి సమస్యా రాలేదు. వదిలేయండి బావా! వాడే మెల్లగా కుదురుకుంటాడు. మీరేం వర్రీ కావద్దు" అంది కమల విశాల్‌కి ధైర్యం చెబుతూ.

♦ ♦ ♦

తిరిగి హైదరాబాద్ వస్తూనే స్కూళ్ళు. హడావుడి. తేజస్, మానస్ టెన్త్ క్లాస్‌కి ప్రమోట్ అయ్యారు. అమెరికా వెళ్లి వచ్చిన దగ్గరనుంచి మానస్‌లో అనుకోని మార్పు. అందరితో కలవడం,  మాట్లాడడం. సంతోషంగా ఉండడం. వారాంతాల్లో అమ్మానాన్న తో కబుర్లు. ఆహ్లాదంగా గడుస్తున్నాయి రోజులు. మరో మూడు కేలెండర్లు మారాయి. తేజస్, మానస్ ఇంటర్మీడియట్ పరీక్షలు పాసయ్యారు. ఇద్దరి అమెరికన్  వీసాలు యూఎస్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ చదువుకి వేలిడేట్ అయ్యాయి. అమల, విశాల్ హైదరాబాద్ వచ్చారు. ప్రయాణం మూడు రోజుల్లో పడింది.

తేజస్ తన బ్యాగేజీ సర్దడం మొదలెట్టాడు.

"మానస్... తేజస్ ప్యాకింగ్ అయింది. రేపు రాత్రికే ప్రయాణం. నువ్వింకా నీ బ్యాగులు సర్దడం మొదలెట్టలేదు" సూట్ కేసు తీసుకువచ్చి హాల్లో పెడుతూ అంది అమల.

మానస్ మనసు ససేమిరా అంటోంది. అయిష్టంగానే "సరే మామ్!" అంటూ దారికడ్డంగా ఉన్న సూట్ కేసు మీద నుంచి దుముకుతూ బ్యాలన్సు తప్పి బోర్లా పడ్డాడు.

"అమ్మా..." అంటూ బాధగా అరిచాడు.

"మానస్!" బిగ్గరగా అరుస్తూ పరుగున వచ్చి అతనికి చేయందించి లేపి "దెబ్బేమైనా తగిలిందా నాన్నా!" అంటూ ఒళ్ళు తడిమి చూసింది కమల.

"దెబ్బేమీ తగల్లేదు లేవే! లేచాడుగా... ఎందుకంత కంగారు" అంది అమల కూర్చున్న సోఫా మీదనుంచి లేవకనే.

"ఏం కాలేదు పిన్నీ... మోచేతి కింద కొద్దిగా గీసుకుపోయిం దంతే. జీన్సుప్యాంటు కదా... కాళ్లకు దెబ్బ తగలలేదు. నువ్వు కంగారు పడకు!" అన్నాడు. తల్లి, పిన్నమ్మల ఇద్దరి వంక చూస్తూ తన గదిలోకి వెళ్ళాడు మానస్.

కమలకి పిల్లల ప్రయాణం అయోమయంగా ఉంది. పదేళ్లుగా కలిసి ఉన్న పిల్లలు మరుసటి రోజు నుంచి ఇంట్లో కనిపించరన్న భావనే ఆమెను నిలవనీయడం లేదు. ఏడ్చి ఏడ్చి ఆమె కన్నీరింకి పోయింది. మానస్ కొద్దిసేపటి తరువాత గదిలో నుంచి బయటకు వచ్చాడు.

"మామ్... డాడ్! నేను మీతో అమెరికా రావడం లేదు. నా మనసెంతకూ అంగీకరించడంలేదు. నేనక్కడ ఇమడలేను. అక్కడికొచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నా కిష్టంలేదు. నేనిక్కడే చదువుకుంటాను. నన్ను క్షమించండి!" అంటూ వారి కాళ్లకు తలానించి, నమస్కరించి, తేజస్‌ని కౌగలించుకుని "ఆల్ ది బెస్ట్ తేజస్" అన్నాడు ఉద్వేగంగా.

మాన్పడిపోయింది అమల.

"ఏం మాట్లాడుతున్నావ్ మానస్? ఇన్నేళ్లకు కుదిరింది ఫ్యామిలీ ఏకం కావడానికి. మూర్ఖంగా రానంటున్నావు. ఒక్కడివి ఇక్కడుండి ఏం చేస్తావ్?" తేరుకుని కోపంగా అంది అమల.

"పిన్ని వాళ్లంతా నా ఫామిలీ కాదా? నీకు తెలుసా మామ్? ఐదేళ్ల క్రితం బాబాయి గారికి సౌదీలో పెద్ద జీతంతో జాబ్ వచ్చింది. ఆయన వెళ్ళలేదు. ఫ్యామిలీ కోసం ఆఫర్‌ని వదులుకున్నారు. బాబాయి గారిని అడిగాను.

'మామ్, డాడ్ వెళ్లారు కదా విదేశాలకి... డబ్బు బాగా సంపాదించవచ్చు కదా! మీరెందుకు సౌదీ వెళ్లడం లేద'ని? బాబాయి గారి సమాధానమేమిటో తెలుసా? కుటుంబాన్ని వదిలి వెళ్లడం ఇష్టం లేదని... ఇక్కడ ఉద్యోగం, సంపాదన తృప్తిగానే ఉందని"

"ఎవరిష్టం వారిది మానస్! మీ కోసం... మీ భవిష్యత్తు కోసమే కదా మేం వెళ్ళింది. మాకోసం కాదు! నీ నిర్ణయం తప్పు. నువ్వొస్తున్నావు మాతో... దట్సాల్" పూనకం వచ్చినట్లుగా బిగ్గరగా అరిచింది అమల.

"సారీ మామ్... సారీ డాడ్!... నన్నొదిలేయండి. నేను రాను. వీలవుతే మీరే ఇండియా తిరిగి వచ్చేయండి. డాక్టర్ల కొదవ చాలా ఉందిక్కడ" తెగేసి కచ్చితంగా అన్నాడు మానస్.


"అమలా! ఇక ఆపు. వాదన వదిలెయ్. జరగాల్సింది చూద్దాం!" వారిద్దరి మధ్య కలుగచేసుకుని చొరవగా అన్నాడు విశాల్.

"ఒకే మానస్! ఇక్కడే ఉండి పోతానంటావు... సరే! తరువాతేమిటి...?"

"నేను... నా భవిష్యత్ గురించి స్పష్టమైన అవగాహన ఉంది. నేను అమెరికా రానన్నది అక్కడ శాశ్వతంగా ఉండిపోవడానికి! పెద్ద పెద్ద మాటలు చెప్పలేను గాని ఒక్క విషయం కచ్చితంగా చెబుతాను. నన్ను పెంచిన అమ్మని, నా దేశాన్ని వదలి రాను. నన్ను క్షమించండి. మీరిద్దరూ కావాలి నాకు" ఒక్క ఉదుటున తండ్రి దగ్గరకొచ్చి చుట్టూ చేతులు వేసి బావురుమన్నాడు మానస్.

చలించి పోయాడు విశాల్. అతని కళ్ళు చెమర్చాయి. మానస్‌ని హత్తుకుంటూ... "ఒకే మానస్! నీ ఇష్టం. నా హృదయం చాలా తేలికయింది. సంతోషంగా ఉంది. నువ్వు, నీ ఆదర్శం, అవగాహన, దృఢ సంకల్పం, దృక్పథం... నాకర్థమయ్యాయి. ఎంతో గర్వంగా ఉంది. త్వరలో ఇండియా వచ్చేస్తాము. ప్రామిస్!" అన్నాడు విశాల్.

అవాక్కయి చూస్తూ ఉండిపోయింది అమల.
సంతోషంగా కళ్ళు తుడుచుకుంది కమల. ■




# అస్తమించిన 'రాత్రి సూర్యుడు'



**జ**నవరి 30న తను ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టాడు : 'మరణానికి ముందే బతకాలి, అప్పుడే మరణించినా బతుకుతాడు' అని. ఇప్పుడా పోస్ట్ గుర్తొచ్చి కెరె జగదీశ్ గురించి తలుచుకునేలా.. మళ్ళీ మళ్ళీ కన్నీళ్ళలో ముంచేలా చేస్తోంది. అతడు అక్షరమై పుట్టినవాడు. కవితా వాక్యమై అనతికాలంలోనే అందరూ తనను చూసేలా చేసినోడు. ఆర్ద్రత, అభినివేశం, అభివ్యక్తి, అనిర్వచనీయ భావుకత కలిగిన కవిత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచినవాడు. 2011 కంటే ముందు వివిధ పత్రికల్లో విస్తృతంగా కవిత్వం రాసినా ఆ ఏడాది **సముద్రమంత గాయంతో** సాహిత్యలోకానికి పరిచయమైన కవి కెరె. నాటి నుంచి పదకొండేళ్ళ సాహిత్య ప్రయాణంలో నాలుగు కవిత్వ సంపుటులను తెలుగు సాహిత్య లోకానికి అందించాడు. అలవోకగా కవిత రాసి పడేసి ఏదో ఓ పత్రికకు ఈమెయిల్‌లో, పోస్టో చేసేసి తాపీగా ప్రచురణ కోసం ఎదురు చూసే రకం కాదు జగదీష్. ఒక కవిత రాయాలంటే రోజులు, నెలలు.. వస్తువు కోసం కాళ్ళరిగేలా తిరిగి తిరిగి పరిశీలించి, పరిశోధించి అక్షరీకరించే మొండోడు. సముద్రమంత గాయం వచ్చినేడాది నుంచే నాకు పరిచయం జగదీశ్. ఇద్దరి మధ్య పాతికేళ్ల వయసు తేడా ఉన్నా ఆప్యాయంగా అల్లుకుపోయిన ఆత్మీయ సోదరుడు.

అనేక పత్రికల్లో ఆయన కవిత్వం చదివి గొప్ప భావుకతతో ఉందని అనుకోవడం.. అతని మాతృభాష తెలుగు కాదు కన్నడ అని తెలిసి ఒకింత ఆశ్చర్యానికి లోనవ్వడం ఒక అనుభూతి. బీకాం గ్రాడ్యుయేషన్, హిందీ పండితుడిగా శిక్షణ పూర్తి.. ఇలా భిన్నమైన విద్యాభ్యాస నేపథ్యం కలిగిన కవి మిత్రుడతడు. తను రాసిన ప్రతి కావ్యం వైవిధ్యమైనదే!

**సరికొత్త అధ్యాయం రాత్రి సూర్యుడు, ఎల్లక్క**

అంధుల జీవితాలను అవిష్కరించిన జగదీష్ దీర్ఘకవిత 'రాత్రి సూర్యుడు' తెలుగు సాహిత్య చరిత్రలో సంచలనమైంది. 2012లో వచ్చిన ఈ కవిత్వానికి ఆవంత్స సోమసుందర్, అద్దేపల్లి రామ్మోహన్ రావు, కె.శివారెడ్డి ముందుమాటలు రాశారు. ఆ కావ్యంలో కవితాక్షరాలు అంధుల జీవన చిత్రాలను చిత్రించి మానవీయ ముఖచిత్రాలై ఆవిష్కరింపబడతాయి.

**మాతృగర్భంలో/ అణువులో అణువుగా/ రూపాంతరం చెంది/ తొమ్మిది నెలల ప్రస్థానంలో/ జిగురులో కన్ను చుట్టి/ సర్వేంద్రియాలను సంతరించుకుని/ పంచభూతాల సాక్షిగా/ పేగుబంధాన్ని పెనవేసుకుని/ ఉమ్మనీటిలో జారిన దేహం/ కెవ్వుమని అరచినా/ ఆవరించిన కారుమబ్బుల్లో/ కళ్ళకు/ ముళ్ళతీగ చుట్టుకుంది. ..** ఇలా సాధారణ పదాలతో అసాధారణ కవిత్వ వాక్యాలను హృద్యంగా నిర్మించుకుంటూ వెళ్ళడం కవిత్వ శిల్పం తెలిసినవారికే సాధ్యం. తల్లి స్పర్శే ఈలోక సౌందర్యమై.. తల్లి పలుకులే వెలుగురేఖలై మనోనేత్రంతో చూసే అంధ శైశవ జీవితాన్ని పై కవితలో కెరె ఆర్ద్రంగా వివరించాడు. ఇది తనను సాహిత్యలోకంలో సగర్వంగా నిలబెట్టిన దీర్ఘకావ్యం. అంధులపై తెలుగులో వెలువడిన మొదటి దీర్ఘ కవిత్వం కూడా ఇదే.. ఈ కావ్యం వివిధ భాషల్లోకి అనువాదమైంది.

**ఒక రెక్కల పక్షి/ మస్తిష్కంలో తిరుగుతూనే ఉంటుంది. రొదచేస్తూ/ రాలుతున్న ఆకును ముక్కుతో పట్టుకుంటుంది/ చీకటి ముఖమ్మీద/ ఒక ఆత్మీయత రాలుతుంది/ ఆ చేతిని, చేతిలోకి తీసుకుని/ రోడ్డు దాటిస్తుంది/ రహదారులు చీలిపోతాయి/ కృతజ్ఞతాభావాలతో/ నవ్వులు పరిమళిస్తాయి/ తిరిగి ఒంటరి ప్రయాణంలో/ ఘనీభవించిన కన్నీటి స్వరూపమే ఆ దేహం/ ద్రవీభవించిన వేదాన శకలమే ఆ అశ్రుధార..** అంధులపై ఇలాంటి కన్నీటి వాక్యాలెలా రాయగలవని అడిగినపుడు నాకు తను చెప్పిన జవాబు : "నేను వాళ్ళపై

రాశాననుకున్నావా? కాదు.. నేను అంధుడైతే ఎలా ఉంటుందో రోజులు నెలలు వాళ్ళ జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేసి రాశా" అన్నాడు.

కెరె 2017లో 'రాతినిశ్శబ్దం' కవిత్వం తెచ్చాడు. చదివి అభిప్రాయం చెప్పమన్నాడు. నెల గడువు కావాలన్నాను. అక్షరమక్షరం జీర్ణమైతే తప్ప నేను అభిప్రాయం చెప్పలేనన్నాను. అట్లే కానీలేప్పా అన్నాడు. రెండున్నర నెలల తర్వాత ... సమాజం గుండెలపై చెరగని ముద్ర వేస్తుందన్నాను. సాహిత్య ప్రస్థానం పత్రికకు సమీక్ష రాస్తానన్నాను. 'రాచపాళెం గారు రాసేశారు.. అది మీ పత్రికలో వస్తుంది.. మరో పత్రికకు రాయమ'న్నారు.. సరే అన్నాను.

**"నా కవిత దు:ఖిస్తుంది/ కన్నీటితో తడిపిన అక్షరాల్ని రాల్చుతూ/ మదిలో దిక్కుతోచని భావాలు/ ముక్కలవుతూ/ వర్షించే మబ్బుల్లా/ కదులుతున్నాయి/ ఎవరో నెట్టినట్టు/ ఆ మబ్బులు ముందుకు సాగుతున్నాయి/ చిగురాకుల్లాంటి భావాల దేహాలు/ ఛిద్రమవుతూ దు:ఖిస్తాయి/ కన్నీటి బట్టుగా .. ఒక్కొక్కటే ధారగా.."** ఇలా కవిత్వపు లోతుల్లోకి వెళ్ళి హృదయాంతరాళంలో నిశ్శబ్దంగా ప్రవహించాడు జగదీశ్. రెండేళ్ళ క్రితం నాగప్ప గారి సుందర్రాజ్ రాసిన దళిత కవిత్వం, కథలు పంపమన్నాడు. పంపితే నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద కథ బాగుంది.. అది నా రాబోయే రచనకు ఉపయోగ పడ్తుందన్నాడు.

రాయలసీమలోని తుంగభద్రా తీరంలోని పశ్చిమ ప్రాంతం కన్నడ – తెలుగు భాషల సంగమం. నేటి ఆధునిక యుగంలోనూ అక్కడక్కడ ఇంకా బసివినులు ఉన్నారు. సాహిత్యలోకంలో దేవదాసిలపై రాసినప్పటికీ దీర్ఘకావ్యంగా రాలేదు. ఆ నీచ సంస్కృతిని 'ఎల్లక్క' పేరుతో దీర్ఘకావ్యంగా రాశాడు జగదీష్. ఈ కావ్యం గతేడాది డిసెంబర్లో తెచ్చాడు. చదివి చెప్పమన్నాడు. ప్రతిసారి చెప్పినట్టే నెలరోజులన్నాను. 'సరే తమ్ముడూ నీవైతేనే అక్షరమక్షరాన్ని యమ్మారైలా స్కానింగు చేస్తావ'న్నాడు. ఇప్పుడామాట గుర్తొచ్చి దు:ఖం ముంచుకొస్తోంది. మార్చి మొదటివారంలో ఫోన్ చేశాడు. దాదాపు గంట సేపు ఎల్లక్క కావ్యం గురించి మాట్లాడుకున్నాం. చాలా తృప్తిగా ఉందన్నాడు. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. త్వరగా ఆవిష్కరణ సభ చేయాలన్నాడు. ఎల్లక్కను చదివాక నిన్ను గాఢంగా హత్తుకుని అభినందించాలని ఉందన్నా.. అన్నాను. నా జీవితం ధన్యమైందన్నాడు. తను ఎల్లక్కను ఎలా పరిచయం చేశాడంటే .. **"విశ్వవేదికపై/ సృష్టి చరాచర రూపం/ బొమ్మల సమాహార స్వరూపం/ పుట్టుకతో మొదలైన జీవన ప్రస్థానం నుండి/**




**మహాప్రస్థానం దాకా/ అనుభూతుల చదరంగం.. అది / కాలం ఆడుతున్న నాటకంలో/ ఒక వేదన నుండి శక నిర్వేదంలోకి ప్రవేశించడం/ ఒక చేతన నుండి మరో చేతనంలో విశ్రమించడం/ విశ్వమర్మంలో మాయాజాలమే.."**

1955 జనవరి 7న అనంతపురం జిల్లా రాయదుర్గంలో శరణప్ప, శారదమ్మ దంపతులకు జన్మించిన కెరె జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించాడు. డా.దీర్ఘాసి విజయభాస్కర్, డా.శాంతినారాయణల ప్రోత్సాహంతో కవిత్వంపై ఆసక్తి పెంచుకుని సాహితీ క్షేత్రంలో అనేక పురస్కారాలు పొందాడు. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం పొందాడు. 2010 నుంచి హృద్రోగంతో బాధపడేవాడు. అదే ఆయన్ని కవిత్వ లోకానికి సముద్రమంత గాయం చేసి తీసుకుపోయింది. రాతి నిశ్శబ్దంగా ఎల్లక్క సాక్షిగా ఆ రాత్రి సూర్యుడు మార్చి 22న అస్తమించాడు.

**- కెంగార మోహన్**

**94933 75447**

## సమీక్ష




# మట్టి మాటలే కవిత్వమై ...

- డాక్టర్ బిరుసు సురేష్ బాబు
75694 80800

**క**దిలించేలా కవిత్వం రాయడమంటే అంత సులభమైన విషయమేమీ కాదు. అలా రాయడం తెలిసిన వ్యక్తి కవిత్వంతో ఆడుకోగలడు, పాడుకోగలడు, తన గుండెకు తాకిన ప్రతి వేదనను కవిత్వ జల్లుగా వర్షించగలడు. పీడిత వర్గాల వెనుక నిలబడి పోరాటం చేయగలడు. ఆ కోవకు చెందిన కవే పల్లిపట్టు నాగరాజు.

సామాజిక అంశాలను కవితా వస్తువులుగా చేసుకొని, పదునైన భాషను, అభివ్యక్తిని కవిత్వంలో ఒంపుకొని బలమైన కవిత్వాన్ని రాస్తున్న యువకవిగా పల్లిపట్టును చెప్పవచ్చు. పుట్టింది చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం వెంకటాపురం గ్రామం. పేదరికం, ఆకలి, వేదన, అవమానాలు, పీడన, దోపిడీ ఇలా అడ్డుగా వచ్చిన ప్రతి దాన్ని కవితానిచ్చెనగా మలచుకొని తనకంటూ ఒక ఐడెంటిటీని సంపాదించుకున్నాడు.

ఈ ప్రపంచీకరణ కాలంలో, ఈ టెక్నాలజీ యుగంలో ఒక కొత్త కవి నుంచి ఇంత గొప్ప కొలమానాలతో కవిత్వం వస్తుందని బహుశా చాలామంది ఊహించకపోయి ఉండవచ్చు. వర్తమాన పల్లె జీవితాన్ని, యాసను 'యాలై పూడ్సింది' అనేతన మొదటి కవితా సంపుటిలో సజీవంగా నింపే ప్రయత్నం చేశాడు కవి.

52 కవితలతో తెలుగు సాహితీ వినీలాకాశంలోకి ప్రవేశించిన 'యాలైపూడ్సింది' కవితా సంపుటిలో వస్తు వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. కవి గుండెను కదిలించిన ప్రతి విషయమూ కవితగా రూపుదిద్దుకుంది. వస్తు వైవిధ్యంతో పాటు శిల్ప చాతుర్యం, పాఠకున్ని కట్టిపడేసే అభివ్యక్తీకరణ, శిల్పం ఇందులోని ప్రతి కవితలో మనకు కనిపిస్తుంది. గ్రామీణ దళిత కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగి వచ్చిన కవి కావడం వల్ల సహజంగానే తాను పల్లె నుంచి విశ్వవిద్యాలయం దాకా కులం కోరల్లో చిక్కుకున్న సమాజాన్ని సునిశితమైన దృష్టితో చూడగలిగాడు. తన సొంత అనుభవాలే కవిత్వ రచనకు కావలసినంత ముడిసరుకులుగా మారాయి.

"నేను పలానా" అనే కవితను గమనించినట్లయితే

**"నేను నంజరే తింటానో**
**గెంజినీళ్లే తాగతానో**
**నా కూటికుండ కాడా నోటికవణం కాడ**
**ఎవడి కులుకుతనమో ఏందయ్యా**
**నన్ను వారగట్టినోళ్లెవరూ**
**మా వాకిట్లోకి రావద్దు మాకొట్టంలోకి దూరొద్దూ**
**మా గొడ్లపెంటతోసే పొరక్కట్టకి అంటురోగం అంటుకుంటాదేమో.."**

కులవ్యవస్థ పునాదిగా కలిగిన భారతదేశంలో వేలయేండ్లగా అస్పృశ్యతను అనుభవిస్తున్న దళితుల ఆక్రోశాన్ని కవి ఈ కవిత ద్వారా వెల్లగక్కుతాడు. తన సంస్కృతిని, ఆత్మగౌరవాన్ని శాసిస్తున్న శక్తులపై తిరుగుబాటుకు పూనుకుంటాడు.

ఒక్క దళిత జీవితాన్నే కాకుండా ఈ సమాజంలో వెనక్కు నెట్టబడి సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కబడ్డ వర్గాల పక్షాన కూడా కవి గళమెత్తాడు.

**"ఎన్నెన్ని ముఖాలను**
**ఎంత అందంగా పొగడ్రా పూసి**
**పెళ్ళి కొడుకుల్ని చేస్తూ ప్రతిపూటా**
**రెట్ట నొప్పులతో మూలుగుతున్నామో"** అంటూ 'మంగలి న్యాయం' కవితలో మంగలి వృత్తి సామాజిక వర్గాల శ్రమను, వారి బాధలను కవి తన సొంతం చేసుకొని గుండెలకు హత్తుకోగలిగాడు. ఇదే కవితలో–

**"పనిని కులంజేసి**
**కులాన్ని కట్టడీ కలుగుల్లో పాముని జేసినా**
**జుట్టు ముళ్లన్నింటినీ కత్తిరించి**
**మా కత్తెరకు ఏ కుళ్లిన కట్టుబాట్లు అడ్డుగావని**
**ప్రతి కూడలిలో అంగళ్లు తెరిచినాం"**

వృత్తులను కులాలుగా మార్చి ఆ వృత్తులలో హెచ్చుతగ్గులు నిర్ణయించిన వైనాన్ని ప్రశ్నించాడు. అయితే ఆ వృత్తినే ప్రాణంగా నమ్మి బతుకుతున్న మంగలి వారు కుల కట్టుబాట్ల కంచెలు దాటి ఒక సమైక్యతా భావంతో ముందుకు కదులుతున్నట్లుగా ఈ కవితలో చెప్పాడు.

'పండగ్గెద్దె' కవితలో పేదల ఆర్థిక దుస్థితిని చెబుతూ ... **"వచ్చే పోయే పండగదినాల అలికిడి వింటేనే**
**పెద్దోళ్లు మొద్దుబారిపోతుంటారు**
**పిలకాయల ముదిగారం తీర్చలేక**
**అప్పులమడుగులో కూరుకుపోతూ**
**సద్దో గిద్దో తాగి పొద్దెల్లదోస్తున్న**
**కడగొట్టుతనాల అయ్యలమ్మలు అవిసిపోతారు"** అంటూ నిబద్ధత కలిగిన కవిగా కదిలిపోతాడు. కడుపు నిండిన కవిత్వం పండగలంటే పిండివంటల గురించి, కొత్త బట్టల గురించి మాట్లాడుతుంది. ఈ కవిది మాత్రం కడుపు ఎండిన వారిని గురించి పరామర్శించే కవిత్వం. పండుగ వచ్చిందంటే అందరికీ ఆనందం, సంతోషం. కానీ పండగంటేనే భయపడిపోయే పేదలు ఇక్కడ కవికి కనిపించారు. ఆ పండుగ కోసం పిల్లల బట్టల కోసం, తిండికోసం అప్పుల పాలవుతున్న అట్టడుగు వర్గాల అమ్మానాన్నలు కవికి కవితా వస్తువులయ్యారు. ఊరు నిద్రలేవకముందే వీధులన్నీ ఊడ్చి శుభ్రం చేసే శ్రమజీవుల గురించి 'సపాయమ్మలు' కవితలో

**"దినమంతా చీపురుకట్టలై కదిలే**
**ఆ చేతులకు ఎన్ని సలాములూ చేయాలి?**
**ఎండంతా నెత్తిమీద కొంగై తిరిగే వాళ్లకు**
**చెత్తబుట్టలు మోసే ఆ వీపులకు చేతులెత్తి**
**ఎన్ని దండాలు పెట్టాలి?"** అని మననం చేసుకుంటాడు. మన చుట్టూ ఉన్న చెత్తను, మురికిని శుభ్రం చేసే సపాయి కార్మికులను కొందరు హీనంగా చూస్తుంటారు. వారి పట్ల దురుసుగా మాట్లాడుతూ చులకన భావం కలిగి ఉంటారు. అయితే మనం చేసిన మురికినంతా వారి చేతులతో ఎత్తి శుద్ధి చేస్తున్న సపాయమ్మల శ్రమను కవి తన కవిత్వంలో భాగం చేసుకున్నాడు. వారి వెలకట్టలేని శ్రమకు సలాం చేస్తున్నాడు, చేతులెత్తి దండం పెడుతున్నాడు.

సామాజిక కవిగా మాత్రమే కాకుండా రాయలసీమ అస్తిత్వ కవిగానూ గొంతువిప్పుతూ 'కరువు ఋతువు' కవితలో ఇలా అంటాడు : **"చుక్క రాలని ఈ మట్టిలో**
**దుక్కమే నవ్వుతుంటది**
**దుక్కమే ఏడుస్తుంటది**
**దుక్కమే ఎక్కిరిస్తుంటది**
**ఎక్కడైనా ఋతువులు మారుతుంటాయి**
**ఇక్కడ కాలం పొడవూతా ఒకటే రుతువు**
**కరువు కొడవళ్లతో నమ్మకపు గొంతులు కోస్తూ.."**

రాయలసీమ రైతులు వాన కోసం ఎదురు చూస్తూ చూస్తూ అది రాకపోగా నిత్యం కరువు కోరల్లో చిక్కుకపోవడాన్ని కవి ఈ కవితలో ప్రతిబింబిస్తాడు. చినుకు కోసం ఎదురుచూసే రైతన్నకు చివరకు దుఃఖమే మిగులుతుంది. ఆరు ఋతువులకు బదులుగా ఒకే ఋతువు రాయలసీమలో నిరంతరం తాండవిస్తూ ఉంటుందని, అదే కరువు ఋతువు అని ఈ ప్రాంత దీనస్థితిని పాఠకుల కళ్లముందుంచుతాడు.

వర్తమాన భారతంలో గోవు పేరిట జరుగుతున్న అరాచకాలను 'చర్చ' కవితలో నిగ్గదీసి ఇలా అడుగుతాడు.

**"వధను గురించి మాట్లాడే ముందు**
**వ్యధను గురించి మాట్లాడాలి**
**వధవంకన మృగాలు చేస్తున్న వేలవేల వధల గురించి**
**మైకులు విడవకుండా మాట్లాడాలి**
**జంతువును గురించి మాట్లాడేముందు**
**మనిషి గురించి మాట్లాడాలి"**

దేశంలో జరుగుతున్న వర్తమాన వాస్తవిక పరిస్థితులను కవి ఈ కవితలో చర్చకు పెట్టాడు. పశువును పవిత్రంగా చూస్తూ, మనిషిని అస్పృశ్య జంతువుగా చేసి దూరంగా నెట్టేస్తున్న రాజ్యం పోకడలను ఎత్తిచూపాడు. పశువుకిచ్చినంత ప్రాధాన్యత మనిషికి ఇవ్వకపోవడం గురించి ప్రస్తావించాడు.

అందుకే వధను గురించి మాట్లాడేముందు ఊరికి దూరంగా వెలివేయబడ్డ మనిషిపడే వ్యధను గురించి మాట్లాడాలంటాడు. జంతువును గురించి మాట్లాడేముందు మనిషి గురించి మాట్లాడాలంటూ మానవత్వపు పరిమళాన్ని ఆకాంక్షిస్తాడు. అంతేకాదు..

**"యవుడు కూడు వోడు తింటావుంటే...**
**కూటికుండ కాదా/ కూరసట్టి కాదా...**
**కారుకూతలేంది..ఈ కత్తి గాట్లేందీ..**
**కాలమిట్టా కడతేరిపోవాల్సిందేనా..!?"** అంటూ 'యాలైపూడ్సింది' కవితలో కుల మత రాజకీయ ముసుగులో దళితుల, ముస్లింలపై జరుగుతున్న మానసిక, సాంస్కృతిక దాడిని ఖండిస్తాడు.

**"వారగా బోండప్పా/ యాలై పూడ్సింది...**
**వాకిలి చిమ్మాలా.../ కల్లాపు జల్లాలా..."** అంటూ మకిలిని మనసులో దాచుకున్న ఈ కులవ్యవస్థను, కులహంకార తత్త్వాన్ని కడిగిపారేసేందుకు సమయం ఆసన్నమైందన్న ఒక హెచ్చరిక ఈ కవిత ద్వారా సమాజానికి ఇస్తాడు.

ఇలాంటి గుండెను తట్టిలేపే కవితలు ఈ కవితా సంపుటిలో పుష్కలంగా ఉన్నాయి. కవిలోని నిజాయితీ, నిష్కల్మషత్వం ప్రతి కవితలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కవి బాల్య స్మృతులు, రైతుల వెతలు, ఎన్నికల్లో రాజకీయ దోపిడీలు, ప్రపంచీకరణలో మనిషి నలిగిపోతున్న దృశ్యాలు ... ఇలా కవి తనకు తారసపడ్డ ప్రతి విషయాన్ని కవితగా మలచగలిగాడు. 'యాలైపూడ్సింది' కవితా సంపుటిలో వర్ణనలు, భావచిత్రాల విషయంలో ప్రత్యేకత కనిపిస్తుంది. వాటిని అసహజంగానూ, అతికించినట్లూ కాకుండా మాట్లాడుతున్న విషయం తాలూకు వాస్తవ జీవితం నుండే, తాను బతుకుతున్న వీధి భాషనుండే వాటిని వినియోగించాడు. ఈ కవితా సంపుటిలో అడుగడుగునా మట్టి పరిమళాలతో పూసిన చిక్కటి కవిత్వం కనిపిస్తుంది.

ముందుమాటలో ప్రముఖ కవి కె.శివరెడ్డి గారు అన్నట్టు కొత్తతరం కవుల్లో బలమైన కవిత్వం రాస్తున్న వారిలో పల్లిపట్టు నాగరాజు ముందువరుసలో ఉంటాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంత యాసను, నుడికారాన్ని విరివిగా సీమ భాషను కవిత్వంలోకి వొంపుతున్న ఈ కవి అభినందనీయుడు. రాయలసీమ ప్రాంతం నుంచి ముఖ్యంగా దళిత నేపథ్యం నుంచి ఒక మంచి కవి తెలుగు సాహిత్యానికి దొరకడం నిజంగా మంచి పరిణామం. ■



## ఆమనీ.. ఆలకించు!

**రె**క్కాడితే గాని డొక్కాడని బతుకుల్ని గూడా
మొక్కల పచ్చదనం మురిపించాలి
పగలు పనికి రాత్రి నిద్రకి తాకట్టు పెట్టిన
తీరిక లేని శ్రమ తపో జీవనుల్లో గూడా
ఆనందాలూరించాలి సిరిమల్లెల గుబాళింపులు
జీవన పోరాటంలో నవజీవాలు కుంగిన
కృషి దీక్షా రుషుల చెవులకు కూడా
సంతోష మంత్రాలు కావాలి చిలకల పలుకులు
చాలీచాలని ఆగచాట్ల జీవ యాత్రికుల
హృదయాలను కూడా కదిలించాలి
పొదల సోయగాలు

చాకిరి తప్ప శ్రమకు ఫలితం లేని
అడుగు బడుగు మడుగుల్లో కూడా
మకరందం చిలికించాలి మధుమాసం
ఎవరికీ కాక ఏ దిక్కూలేక
కష్టాల్లో కరిగి కన్నీరింకిన
బండబారిన ఎడారి గుండెల్లో కూడా
హాయిని నింపాలి కోయిల గీతం!

**- చిరమన వెంకట రమణయ్య**
**94413 80336**



# సాహిత్యం ప్రజలపరంగా రావాలి

## కేంద్రసాహిత్య పురస్కార విజేత నిఖిలేశ్వర్

సంభాషణ: కె ఆనందాచారి
99487 87660

**ఆరు పదుల సాహిత్య చరిత్రతో, పరిణామాలతో మూడు తరాల సాహితీకారులతో సంబంధముండి ఎనభై ఏండ్లు దాటినా సాహితీ క్షేత్రంలో తన ప్రయాణాన్ని చైతన్యయుతంగా కొనసాగిస్తున్న ప్రసిద్ధ కవి రచయిత నిఖిలేశ్వర్. సాహిత్యం లోనూ, దృక్పథంలోనూ నిబద్ధ జీవితానికి ప్రతీక ఆయన. ధిక్కార కవిగా, దిగంబర కవిగా, కథా రచయితగా, విమర్శకుడిగా ప్రసిద్ధి చెందిన నిఖిలేశ్వర్‌కు ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా... గతంలో ప్రస్థానంలో ప్రచురించిన ఈ ముఖాముఖిని పునర్ముద్రిస్తున్నాం. ఆయనతో సాగిన సంభాషణ ఇదీ ...**

**మీ బాల్యం కుటుంబం నేపథ్యం ...**

గతంలో నల్లగొండ జిల్లా ఇపుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని వీరెల్లి గ్రామంలో 1938లో జన్మించాను. కుంభం నర్సయ్య, సురవరం నర్సమ్మ తల్లిదండ్రులు. మాది రైతు కుటుంబం. నాన్న ఇల్లరికం వచ్చాడు. కుటుంబంలో ఒక్కరూ అక్షరాస్యులు లేరు. నాకు ఏడాది వయసున్నప్పుడే నాన్న చనిపోయారు. తర్వాత అమ్మ తన తమ్ముడు సురవరం నరసింహారెడ్డి వద్ద కొంతకాలం వ్యవసాయం చేసింది. అనంతరం నన్ను చంకన వేసుకొని హైదరాబాద్ వచ్చింది. ఇండ్లలో పనులు చేసేది. చివరికి వివిఎస్‌టి (చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ) శ్రామికు రాలిగా పనిచేస్తూ నన్ను చదివించింది.

నేను హైదరాబాద్ సికింద్రాబాద్ వీధి బళ్లలో అక్షరాలు దిద్దు కున్నాను. జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉండగా అప్పుడే ప్రారంభించిన ఉచిత హిందీ తరగతులకు వెళ్లి హిందీ నేర్చుకున్నాను. శారద భూషణ్‌లలో ఉత్తీర్ణత సాధించాను. అప్పటినుంచే హిందీ సాహిత్యం పరిచయమైంది. 1960లో హైదరాబాద్ సాయం కళాశాల (నిజాం కాలేజీ ఆవరణ) పీయూసీ, బిఏ, బిఎడ్ చేశాను. 1964-65లో ఉస్మానియాలో సైకాలజీ కోర్సు పూర్తి చేశాను. ఎంఏ మొదటి సంవత్సరం పూర్తి చేసి పరీక్షలు రాయలేదు.

**సాహిత్యం పట్ల ఆసక్తి ఎలా కలిగింది?**

హెచ్ఎస్‌సిలో లెక్కల పరీక్ష తప్పి రెండేళ్లు కొంత అరాచకంగా తిరిగి.. తర్వాత ముషీరాబాద్‌లోని అభ్యుదయ యువక సంఘం స్థాపించి, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాను. ఆ సందర్భంగా ఎంతో నేర్చుకున్నాను. గతంలో చదివిన హిందీ సాహిత్యం భగవద్గీత పఠనం, ఆర్య సమాజ్ ప్రభావంతో వేదాల పరిచయం నా ఆసక్తిని పెంచాయి. కాలేజీలో చేరినప్పుడు ఆంగ్లంపై మక్కువ పెరిగింది. బిఏలో ఇంగ్లీష్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్ చేశాను. ఆ కాలేజీలోనే సహ విద్యార్థి ఎన్ హెచ్ కేశవరావు (నగ్నముని), మాకు జూనియర్ ఏవి రాఘవాచార్యులు (జ్వాలాముఖి), మాకు సీనియర్ సుబ్రహ్మణ్యం (దిగంబర కవుల సంచాలకుడు) సహచరులు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సాహిత్యాల పట్ల ఆసక్తి పెరగటానికి ముషీరాబాద్‌లోని గౌరీశంకర్ గ్రంథాలయం, కళాశాలలో అధ్యయనం ఉపయోగపడ్డాయి. అమ్మకు ఏకైక సంతానంగా ఎంతో స్వేచ్ఛగా పెరిగాను. నిత్యం

అధ్యయనం చేశాను. చలం, శ్రీశ్రీ, శరత్‌ను చదువుతున్న కాలంలోనే హిందీలో ప్రేమ్‌చంద్ 'నిర్మల' నవల; రామ్ నరేష్ త్రిపాఠి 'పథిక్' ఖండకావ్యం, రష్యన్ సాహిత్యం, సోమర్‌సెట్ మామ్ నవలలు, ఇలియట్ కవిత్వం మరోవైపు సాహిత్య అధ్యయనానికి ఊపునిచ్చాయి.

**మీ అచ్చయిన తొలి రచన?**

చిన్న చిన్న కథలు 'బాల' లాంటి పత్రికల్లో వచ్చాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ నాడు 'గోలకొండ' పత్రిక ప్రచురించిన సంచికలో తొలి రచన 'టెలివిజన్ ఎలా పనిచేస్తుంది' కె.యాదవరెడ్డి పేరుతో అచ్చయింది. అప్పుడు నేను తొమ్మిదో తరగతిలో ఉన్నాను. ఆ తర్వాత కళాశాల వార్షిక సంచికల్లో వచ్చాయి.

**మీ కథల గురించి ...**

గత నలభై ఏళ్లలో నలభై కథలు రాసి ఉంటాను. వాటిలో 22 కథలు 'నిఖిలేశ్వర్ కథలు' పేరిట సంపుటిగా వచ్చాయి. ఇతర భాషల నుంచి అనువదించిన కథలు ఇరవై దాకా ఉన్నాయి. కథా వారధి పేర ఎమెస్కో ప్రచురించింది. కమలనాథ్, రాజేంద్ర యాదవ్‌ల హిందీ నవలలూ అనువదించాను. తొలిదశలో కథలు, నవలలు రాయాలనే కోరిక ఉండేది. కానీ ఉద్యమపరంగా కవితా రచన జీవితంలో భాగమైంది. కథల ఇతివృత్తాలన్నీ విప్లవ పోరాటాలు, మన విద్యా వ్యవస్థ, స్త్రీ పురుష సంబంధాలు, మధ్య తరగతి సమస్యలు, యుద్ధం, మతం, భూమి తదితర సమస్యలకు సంబంధించినవి.

**దిగంబర కవిత్వం వైపుకు ఎలా వెళ్లారు?**

1965 దిగంబర కవుల మొదటి సంపుటి వెలువడక ముందు మేం ఆరుగురం మా సొంత పేర్లతో రచనలు చేశాం. ఆ నాటికి నా రచన ఏది గ్రంథ రూపం దాల్చలేదు. కేశవరావు, కమ్మిశెట్టి కవిత్వం సంపుటిగా వచ్చాయి. అప్పటికే నేను 'కోపోద్రిక్త యువతరం' శీర్షికన కవితలు, రాజకీయ వ్యాసాలు 'గోలకొండ పత్రిక'లో రాసాను. బ్రిటన్‌లో ఆనాటికి వచ్చిన 'యాంగ్రీ యంగ్ మాన్ సాహిత్యంలో జాన్ అస్బార్న్ నాటకం లుక్ బ్యాక్ ఇన్ యాంగర్' నన్ను ప్రేరేపించింది. ఆరోజుల్లో నా కవిత 'కోపంతో వెనక్కి చూడు', తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు 'రాత్రి' కవితా సంకలనం ఒక మలుపు. వేం ఆరుగురి ఆగ్రహం, సామాజిక తిరుగుబాటుతత్వం, సాహిత్య రాజకీయపరంగా ఒక 'బ్రేక్‌త్రో'తో ఏర్పడినవే దిగంబర కవుల మూడు సంపుటాలు. దీనిపై ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలూ వచ్చాయి.

**దిగంబర కవుల భాషపై వచ్చిన విమర్శకు ఏమంటారు?**

ఒక ధర్మాగ్రహంలో పెల్లుబికిన భాష అది. అయితే కొన్ని కవితల్లో అశ్లీల పదజాలం కొంత మితిమీరినప్పటికీ అవి ఆనాటి యువ ఆగ్రహం, ఆక్రోశం.

**అభ్యుదయ సాహిత్యోద్యమం మీపై చూపిన ప్రభావం ...**

చారిత్రకంగా అభ్యుదయ సాహిత్యం మౌలికంగానే తన పాత్రను నిర్వహించింది. తొలిదశలో నాపై గురజాడ, శ్రీశ్రీ, సోమసుందర్ తదితరుల ప్రభావం ఉంది. 1965 నాటికి అభ్యుదయ సాహిత్యంలో స్తబ్ధత ఏర్పడింది. అందుకే దిగంబర కవులు, విప్లవ సాహిత్యం అవసరమైంది.

**విరసంతో విభేదానికి కారణాలు ...**

విరసానికి సంస్థాపక సభ్యునిగా, కార్యదర్శిగా పనిచేశాను. సాహిత్య సాంస్కృతిక రంగంలో విప్లవ స్ఫూర్తితో పని చేయాల్సిన సంస్థ 1975 నాటికి విప్లవ గ్రూపుల పంథాల వివాదాల్లో చిక్కుకుంది. ముఖ్యంగా చారుమజుందార్ అరాచక అతివాద పంథాను ప్రచారం చేసిన రచయితల ప్రాబల్యం పెరిగింది. అందువల్ల నేను ఇతర మిత్రులతో పాటు 1975 అనంతరం మహాసభలో బాహాటంగా వ్యతిరేకించి రాజీనామా చేశాను. ఆ తర్వాత నేనూ, జ్వాలాముఖి జనసాహితి సంస్థాపక సభ్యులం. 'ప్రజాసాహితి' పత్రికకు రెండేండ్లు సంపాదకునిగా ఉన్నాను. అక్కడ కూడా ముఠా రాజకీయాలు, వ్యక్తిగత ప్రాబల్యాలు అనుభవంలోకి రావడంతో తప్పుకున్నాను.

**ఇప్పుడు మన సమాజంలో విప్లవానికి ఏది సరైన మార్గం అనుకుంటున్నారు?**

ప్రస్తుత భారతదేశంలో దళారీ పెట్టుబడిదారీ ధనస్వామ్యం చేతిలో ప్రజాస్వామ్యమున్నది. అర్ధ భూస్వామ్య లక్షణాలతో పాటు మతపరమైన దురహంకార పాలన కొనసాగుతున్నది. సమాజంలో అనేక సాంకేతిక మార్పులు వచ్చాయి. గతంలో వచ్చిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటాలు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. అనేక మార్పులచ్చినా నేడు సాయుధ పోరాటం ప్రాసంగితకతను కోల్పోయింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజా విప్లవం కోసం కొత్త ప్రజా పోరాట రూపాలను అనుసరించాలి. వ్యూహాన్ని మార్చుకోవాలి. ఆత్మశోధన చేసుకోవాలి.

**అస్తిత్వ ఉద్యమాల గురించి ...**

వామపక్ష ఉద్యమాలు విస్మరించడం వల్ల దేశంలో దళిత, స్త్రీవాద, బహుజనవాద అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయనే విమర్శ

ఉంది. అందులో కొంత నిజం వున్నా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చరిత్రనూ, విప్లవ గ్రూపుల చరిత్రనూ పరిశీలించినా ఆ విమర్శ పాక్షికమైనదని అర్థమవుతుంది. ఆయా అస్తిత్వ ఉద్యమాల సమస్యలన్నీ వామపక్ష ఉద్యమాల్లో అంతర్లీనంగా వుండి, దేశంలోని ఫ్యూడల్ శక్తులను ప్రతిఘటించే శక్తిని అందించాయనే యథార్థాన్ని విస్మరించలేము. అయితే మారిన పరిస్థితుల్లో బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలతో స్ఫూర్తితో ఉద్యమిస్తున్న దళిత, బహుజనులంతా ఏ నాటికైనా వామపక్ష వర్గ పోరాటాలతో మమేకం కాక తప్పదు.

**అస్తిత్వ ఉద్యమాల ప్రభావం ఎలా ఉంది?**

మన దేశంలో కుల వ్యవస్థ ఇప్పటికీ పటిష్టంగానే ఉంది. దళితులు, స్త్రీలు, మైనారిటీలు అనేక అణచివేతలకు గురవుతున్నారు. వీటిని ప్రశ్నించి ధిక్కరిస్తున్న అస్తిత్వ ఉద్యమాలకు కొన్ని పరిమితులు ఉన్నాయి. దళిత ఉద్యమాలన్నీ చివరకు రిజర్వేషన్లు, రాజ్యాధికారంలో భాగస్వామ్యంతో సంతృప్తి పడుతున్నాయి. ఆత్మగౌరవం ఎజెండాలో ఉన్నా మౌలికంగా దేశంలో రావల్సిన కుల రహిత సమాజం పట్ల స్పష్టత లేదు. భూస్వామ్య పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అణచివేతల ధ్యాసే లేదు. వర్గపోరాటమనే మౌలిక పంథాను పక్కనబెట్టి కేవలం కులపోరాటాలే దిక్కు అని భావిస్తున్నారు. దళిత రాజకీయ నాయకులు సంజీవయ్య, జగజ్జీవన్‌రాం, మాయావతి మొదలైన వాళ్ళు అధికారంలోకి వచ్చినా కూడా దళితులకు జరిగిన సామాజిక న్యాయమెంత? ఇక స్త్రీలు వ్యక్తిగత స్వేచ్ఛ లైంగికతనే ముఖ్యమని పురుషాధిక్యతను ధిక్కరించే వరకే పరిమితమయ్యారు. మైనారిటీలు తమలోని మతాధిపత్యాన్ని ధిక్కరించలేక పోతున్నారు. అందువల్ల విస్తృతమైన ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించి శ్రామిక పీడిత వర్గాలను విభజించాయనేది వాస్తవం.

**మీరు రాసిన సాహిత్య విమర్శ, రాజకీయ పరిణామాలపై రచనలు ...**

కవిత్వంతో పాటు సాహిత్య విమర్శ కూడా రాశాను. మారుతున్న విలువలు – సాహిత్యం, కవిత్వ శోధన, మూడు సంపుటాలు వచ్చాయి. రాజకీయ పరిణామాలపై 'ఎవరిదీ ప్రజాస్వామ్యం – ఏ విలువలకీ ప్రస్థానం' శీర్షికన సంపుటి వచ్చింది.

**ఒక దృక్పథంతో కాక వ్యక్తుల కేంద్రంగా ఏర్పడుతున్న సాహితీ బఅందాల గురించి ఏమంటారు?**

వ్యక్తుల కేంద్రంగా సాహితీ ముఠాలు తటస్థ పడుతూనే ఉన్నాయి. వ్యక్తివాదులైన కవులకు రచయితలకు షార్ట్‌కట్ ఖ్యాతి కావాలి. పురస్కారాలు, సన్మానాలు ఇవే వారి గమ్యం. సామాజిక, రాజకీయ నిబద్ధతను తిరస్కరించి శుద్ధ కళాత్మకవాదం పేరిట పలాయన వాదాన్ని ఆశ్రయిస్తారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ వ్యక్తి అస్తిత్వ ధోరణి ఆధునికానంతర వాదంగా దూసుకొచ్చి.. తర్వాత తోక ముడిచింది.

**మతతత్వం, సంస్కృతి ఏకీకరణ పెరుగుతున్న సందర్భంలో సాహిత్య కారుల కర్తవ్యం?**

భారతీయ ఏకాత్మకత అనే పేరుతో సంకుచితతత్వం విస్తరిస్తున్న మాట నిజం. కులతత్వంతో పాటు, పాలకుల్లో ఫాసిస్టు లక్షణాలు విజృంభిస్తున్నాయి. జాతీయ సంస్కృతి హిందూత్వంలోనే ఉందని ఆర్ఎస్ఎస్ చెబుతూ సెక్యులర్ ప్రజాతంత్రవాదులపై, మైనారిటీలపై దాడులు చేస్తున్నది. ఈ మత దురహంకార దాడిని ఎదుర్కోవడానికి సాహితీవేత్తలు, రచయితలు, మేధావులు ఐక్య సంఘటనగా ఉద్యమించాలి.

**నేటి సాహిత్యంపై కవులకు మీరిచ్చే సందేశం ...**

సమకాలీన యువకులు కొందరు చక్కని చిక్కని కవిత్వం రాస్తున్నారు. కానీ అత్యధికులు ఇన్‌స్టాంట్ కాఫీలా ఏవో కొన్ని కవితల వంటివి రాసి ముద్రించి భుజాలు చరుచుకుంటున్నారు. నిరంతర అధ్యయనాలతో పాటు కవిత్వ తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు భజనలు చేస్తున్న రచయితలు, కవుల సంఖ్య పెరిగిపోయింది. అభివ్యక్తి స్వేచ్ఛను అణగదొక్కుతున్న కాలమిది. ఈ సమయంలో నిజాయితీగా ప్రజల పరంగా నిర్భయంగా రచనలు చేయాలి.

**ప్రస్తుత మీ సాహిత్య సృజన...**

ప్రస్తుతం నేను జీవితానుభవాలను, జ్ఞాపకాలను 'నిఖిలలోకం' పేరిట స్వీయ చరిత్రను రాస్తున్నాను. నా యాభై సంవత్సరాల కవిత్వం 'నిఖిలేశ్వర కవిత్వం'గా వచ్చింది. 'అగ్ని శ్వాస' ఆంగ్ల కవితా సంపుటి 'లైఫ్ ది ఎడ్జ్ ఆఫ్ నైఫ్' వచ్చాయి. నా హిందీ కవితల సంపుటి 'ఇతిహాస్ కే మోడ్ పర్' వచ్చాయి.

---

**■ కేంద్ర సాహిత్య అకాడెమీ 2020 సంవత్సరానికి గానూ మార్చి 13న పురస్కారాలను ప్రకటించింది. తెలుగులో ప్రముఖ కవి నిఖిలేశ్వర్‌కు అగ్నిశ్వాస కవితా సంపుటికి ఈ అవార్డు లభించింది. ఎండ్లూరి మానసకు (మిళింద కథలు) యువ సాహిత్య పురస్కారం, కన్నెగంటి అనసూయకు (స్నేహితులు – కథలు) బాల సాహిత్య పురస్కారం లభించాయి.**

కవిత

# నాగలి నెత్తిన ...

- కంచరాన భుజంగరావు
94415 89602



హరిత ఛత్రానికి ఆవల
ఆకలి తీరపు సంకేతాలు!
కనగలవా నీవు?
భుక్తాయాసంలో ఉన్నావు
నీ కంటికి ఆనదులే!!

ఎంగిలి కంచం అడుగున
ఆకలి పేగుల ఆక్రోశాలు!
వినగలవా నీవు?
స్వేదరాగాల్ని పెడచెవిన పెట్టావు
నీ చెవులకు చెరవులే!!

రహదారుల నడిమధ్యన
జెండాలై మొలిచిన తలపాగాలు
మనసున్న చూపులకు
చూపున్న కన్నులకు
దీక్షలో కూర్చున్న ఉషాకిరణాల్లా కనిపిస్తాయి!
చలువ కళ్లద్దాలు దాటి
సారించలేని నీ కబోది దృష్టికి
చీకటి సరస్సులో మెరుపు వెలుగు కూడా
నిశి నుసిలానే తోస్తుంది!!

నాగలి నెత్తిన
దు:ఖ సముద్రం కెరలి
తీరం దాటే ఉరవడి
ఒకటో నెంబరు రెండో నెంబరు దాటి
మూడో నెంబరు ప్రమాద హెచ్చరికై
దేశం గుండెల మీద
దిగులు కుంపటిలో ఆహుతవుతోంది!
చేవ చూపి చైతన్యం పొందుతావో
చచ్చుబడి చలి కాచుకుంటావో!?

బొడ్డీ చెక్కల పిడికెడు గింజలు
తెర్లిన గుండెలతో
బిగిసిన పిడికిళ్లై
ఉత్తర మాన్యంలో కొత్త
పొద్దుని చిగురిస్తున్నాయి..
నీ బతుకు మడికి తడి పెట్టుకో!

మట్టి బెడ్డల్ని
చలి కౌగిలించుకోలేదని
మన్ను ముద్దల్ని
వాటర్ క్యానన్ల వర్షం వణికించలేదని
సహనం చొక్కా
తొడుక్కున్న వాళ్లకు
ఉగ్రవాద ముద్రలు అంటుకోవని
నిరూపించిన సందర్భమిది..
ఒక్క అడుగు ముందుకు కదుపు!

ఈ వ్యవసాయ దేశానికి
కొత్త సాగుచట్టాల రూపంలో
పొంచివున్న ముప్పు తుప్పుల్ని దున్ని
వరిపీక పొలికేక
గోధుమకంకి గర్జన
సరికొత్తగా సాలు పోస్తున్నాయని
ఎరుకపడిన సంక్షోభమిది..
కనీస మద్దతు ధరకు
చట్టబద్ధత కల్పించేవరకు
దుక్కినాగలి చిక్కు తొలగే వరకు
గట్టున నిలబడకు చేలో కలబడు!

పాషాణ పీఠాల శిలాజాలను
మేకులు మొలిచిన కారుదారులను
ఆకుపచ్చ సూర్యుడు
ట్రాక్టర్ పలుగులతో తవ్వి
కొత్త తొవ్వ చూపిస్తాడని
దేశం ఎదురుతెన్నులు చూస్తున్న
నిరీక్షణ కాలమిది..
పంటమడికి తన గుండెను
దడికట్టిన కాపు గుండెలు చీల్చే
అడవి పందులు చేలో పడకుండా
చైతన్యపు చేయూతనిచ్చి
ముసిరిన డబ్బు మబ్బుల్ని అదిలించు
రైతు సైన్యానికి మద్దతు ప్రకటించు
శ్రమ సౌభాగ్యానికి
మత్తడి మళ్ళించు!!

## పుస్తక పరిచయం






# అంతరాలపై సంధించిన అక్షరాస్త్రం

- గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

**రెం**డు ఒకట్ల రెండు అని మనం ఎక్కాల పుస్తకంలో చదివాం. రెండు ఒకట్లు పదకొండు అని సమాంతర ఒకట్లను జీవితానికి అన్వయించి, అవి అచ్చమైన ప్రేమకు చిహ్నంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు సుభాషిణి తోట. ఆమె తన తాజా కవితా సంపుటి 'రెండు ఒకట్ల పదకొండు'ను ఇటీవల వెలువరించారు.

ప్రేమలో అతనూ ఆమె సమంగా, సంఘీభావంగా సాగాలి. అధిపత్యం పొడచూపితే అంతా అతలాకుతలం అవుతుంది. బంధం మానవీయంగా కాక అమానుషంగా మారుతుంది. ఇలాంటి అసమానతా అంశాలపై కవయిత్రి ఆవేదనా, ఆగ్రహం చాలా కవితల్లో ప్రతిఫలించాయి. తడి ఆరని కన్నీటిని, బాహువుల్లో కరిగిపోయే సున్నితత్వాన్ని, ఆమె ఆమెగా మసలుకుందామన్నా మసిలే పురుషాధిక్యతపై విమర్శనీ ఈ కవితల్లో పదునుగా పలికించారు.

'ఇంకా నీళ్లెక్కడుంటాయ్ రా!' కవితలో పాడుబడ్డ బావిలో పాతివేయబడ్డ చిన్నారుల ఆక్రందనలు వినిపించారు. 'బావులు తవ్వితే అరణ్య రోదనలు/ పాచినీటి కులవివక్ష ఆత్మహత్యల అసలు రంగు'ను బయట పెట్టారు. బావులు తవ్వితే నీళ్ళు రాకపోగా చిన్నారులను చిదిమి పాతే నెలవులుగా మారాయనే ఆవేశం కవిత నిండా పోగు చేశారు. 'నాదొక విన్నపం' కవితలో 'క్షణ క్షణం నన్ను నువ్వు రాతిని చేసి రాగాలను సమకూరుస్తుంటావు చూడు/ కచ్చితంగా అప్పుడే నాలోని అస్తిత్వం నిన్ను తరిమేందుకు కొన్ని శబ్దాలను విడుస్తుంది' అంటూ స్త్రీ వాద కవిత్వ పదునుని చూపించారు. 'నా ప్రేమకి స్వస్తి చెప్పలేను/ అలా అని నిన్ను కోల్పోను' అనే సందిగ్ధావస్థలో మనసున గాయానికి లేపనాన్ని పూసే ప్రయత్నం చేశారు. సింధూరం కవితలో 'నిలుచున్న చోటే కూలిపోయే దేహం నాది/ కాలిపోయే వరకు దేహానికి కూలీ ఇచ్చేది మాత్రం అతని స్పర్శే' అంటూ ఆధిపత్య ధోరణిలో సతమతమవుతున్న స్త్రీ పక్షాన అక్షరాలను ఎక్కుపెట్టారు.


'ఆమెలందరూ' కవితలో 'నాగరికత నేర్వకముందే సమానతల్ని తెగనరికి అస్తిత్వాన్ని బొమ్మగా మలిచారంతే' అంటూ ఆక్రోశం వెళ్ళగక్కారు. 'కోరికల చిట్టా' కవితలో 'నేనొక కథ చెప్పాలి/ నీకు అన్నాడతను, బండరాయిని జోకొడుతూ/ రోజూ చెప్పేది కాకుండా కొత్తగా చెప్పవా అందామె. 'లోని మర్మం లోతు అంచనా వేయగల్గితే లింగ వివక్షకి చరమ గీతం పాడినట్లే. 'ఉనికే ఊపిరి చేస్తూ' కవితలో 'ఆమె అందంగా నవ్వాలంటే/ అవతలి మనిషి మీద నమ్మకం కూడా వుండాలి' అని ప్రేమకి పునాది నమ్మకమనే భావన పలికించారు. 'మాటల యుద్ధాలని/ నా ఉనికికి ఊపిరి అందగానే ముగిస్తానని' ఆమె ఉనికి కోసం పడే తాపత్రయాన్ని తేటతెల్లం చేశారు.

'ఎర్ర కాలువ' కవితలో 'నల్లరక్తం ఎరుపు విరిగి సన్నని తీగరాగం అందుకుంటుంది/ అదే విప్లవ గీతం/ వంటిల్లే కాదురా... ఏ గదిలోనైనా ప్రవేశం నా ఎర్ర కాలువ పారుతున్న దేహంగం తోనే/నని నిర్ద్వంద్వంగా చెప్పిన తీరు వంటింట్లోకి రానీయని మనువాదంపై ఎగసిన నిరసన

జెండా అని చెప్పటంలో అతి శయోక్తి లేదు. ఎర్ర కాలువ పారనిదే మనువు లేడు.. వాడి అజెండా లేదనే సత్యాన్ని గ్రహింపజేయ అక్షరాలను సంధించిన తీరు ప్రశంసనీయం. 'నగ్నంగా చూడాలని వుందా' కవితలో ఓటి తొడలతో మట్టి ఎడారి నాట్యమాడుతున్నా/ నువ్వు హారతి పట్టిన దాన్ని/ నీరెండి ఎడారిని/ మద్దూరోడి గోదారినని మద్దూరిని యాది చేసుకుంటూ ఆమెను ఆమెగా బతకనీయని సమాజంపై ఎక్కు పెట్టిన విల్లు ఈ కవిత.

'విప్లవ కారుడా' కవితలో 'కొన్ని స్పందనల్ని అక్కడెందుకో పూడ్చి పెడుతున్నారు/ కాస్త విప్లవాన్ని నా చేతిలో రాశిగా పోయవూ' అనే విజ్ఞాపనలో చేతనమయ్యే పిడికిళ్లు కనిపిస్తున్నాయి. నేటి ఫాసిజం పోకడలపై ఎగుస్తున్న జ్వాలలకి ఉత్ప్రేరకంగా సాగిన శైలి ఆమెది. 'వాడిపై బలమైన అస్త్రం ప్రయోగించాలి/ నాకు కొన్ని మగ పదాలు కావాలి' అని ఆవేదన ప్రకటించారు. ఆమె కథలో 'దోసిలి పట్టిన వాన చినుకుని చెరువు తన బాహువుల్లో పొదిలినట్లు అతని కౌగిల్లో కరుగుతూ బావుందా కథ అందామె'. కరిగిపోయే భావనలు జ్ఞాపకాల్లో ప్రోది చేసుకునే క్షణాలను అందంగా ఒడిసి పట్టుకున్న కవితా ఝరి కనిపిస్తుంది. 'నిజం చెప్పొద్దూ' కవితలో 'కొన్ని సంకెళ్ళను తెంపుకుని స్వేచ్ఛా విహారినైతేనేమి ఆ ఆడపక్షికి లేని అంతరాలు నాకెందుకని', 'కొన్ని కంచెలను తెంపేసి క్షేత్రాన్నైతేనేం' అని సమాజ గోడలను బద్దలు కొట్టే ఆలోచనకి రూపుదిద్దారు. తెంచుకోవాలన్న సంఘర్షణలో ఎంచుకున్న పంథాతో సూటిగా, స్పష్టంగా అనాదిగా ఉన్న ఆమె ఛట్రాన్ని చేధించ ప్రయత్నించారు. 'మేం విగ్రహాలను ఆరాధిస్తాం/ ఆదరణకి నోచుకోని ఎన్నో బతుకుల్ని విస్మరిస్తాం' అని నేటి వాస్తవ పరిస్థితిని కళ్ళ ముందుంచారు. ఈ పుస్తకం రెండో పేజీలో నిచ్చెనలు ఎందుకు వేసారో కానీ నిచ్చెన మెట్ల వ్యవస్థ మీద ఝుళిపించిన కవితలకు సందర్భోచితంగా కనిపించింది. అతను ఆమె రెండు నిచ్చెనలపై సమాంతరంగా ఎదగాలనే ఆదర్శం ఫలించాలని ఆశిద్దాం. ప్రతులకు : సుభాషిణి తోట, 15-13-309, బ్యాంక్ కాలనీ, ఎస్‌బిఐ దగ్గర, ఖమ్మం-507002.

■



## కవిత్వమంటే...

కవిత్వమంటే రెండు ప్రాసలు
మూడు వాక్యాలు కాదు!

కవిత్వమంటే - పొక్కిలి వోయి
ఎక్కిఎక్కి ఎక్కీలు పట్టేలా
గోడెల్లవోసిన ఇంటి దుఃఖాన్ని ఎరుక జేయాలి..

కవిత్వమంటే రెండు ప్రాసలు
మూడు వాక్యాలు కాదు!

బతుకు పోరులో చితికి
మెతుకుకై  తండ్లాడే బతుకు చిత్రాన్ని
మదిలో మెదిలించేది కవిత్వం...
మట్టివాసన మలీజ ముద్దల రుచి
సద్దసంకటి , సంత బజార్ సంగతులు
యాదిజేస్తే కోవడమే కవిత్వం..

కవిత్వమంటే రెండు ప్రాసలు
మూడు వాక్యాలు కాదు!!

అజ్ఞానాంధకారాన్ని తుదముట్టించే
వెలుగు కిరణాలు కవితాక్షరాలు
మంచాన వడి మూలిగె ముసలి అవ్వని
బాల్యంలోకి దీసుకెల్లే
సాహిత్య నావ కవిత్వమంటే...!


కవిత్వమంటే రగిలే రగల్ జెండా...
కవివంటే ఎన్నుకోబడని ఓ ప్రజాప్రతినిధే ...
కవిత్వం అంటే ప్రశ్నించే అస్త్రమే......

**- ఉప్పరి తిరుమలేష్**

**96189 61384**

# కవితలు

## ఎవడైతేమాకేం?



సిత్రాలు సూడరో శివుడో శివుడా
నువ్వు చిందేసి గర్జించు
ఓ కార్మికుడా
ఉద్యమాల త్యాగఫలం
మన విశాఖ ఉక్కు
ఇప్పుడెవడో దోచుకుంటే
మనకేమిటి దిక్కు?
ఉక్కు సంకల్పం ఊసులు
ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి
ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు
బడాబాబుల చేతలతో
ఉసూరుమని రోదిస్తోంది
ఎందరో  వీరుల త్యాగాలతో సాధించిన
నెత్తుటి ఫలమీ  కొలిమి బంగారం
అన్నీ లాక్కుంటూ దోచుకుంటూ పోతుంటే
పోనీలే అని ఊరుకుంటే మా హక్కు ఉక్కుని
లాక్కోవాలన్న నీచ ఆలోచన చేసిన
కుట్రదారులకు చ్చితంగా బుద్ధి చెబుతాం..
గ్రాంట్లు లేవని గనులు ఇవ్వమని
సిగ్గులేని  సిత్రాలు చేస్తూ వుంటే
ఇంకా చోద్యం చూస్తూ కూచుంటామా?

అమ్మే హక్కు ఎవడికి? కొనే హక్కు ఎవడికి?
కష్టమైన నష్టమైన మేమే చూసుకుంటాము
అడుగుపెట్టినది ఎవడైతే మాకేం
కణకణమండే అగ్నికణాల సాక్షిగా
సలసల మండే  గుండెల తోడుగా
ఐక్యతా నినాదంతో ఢిల్లీలో గల్లీల్లో
తిప్పి తిప్పి కొట్టి తరుముతాం
జీవితాలను కార్పొరేటు పరం చేయొద్దు
రాజీమార్గాలు అసలే మాకొద్దు
మా హక్కు మాకే వుంచండి
మా బాగు ఏదో మేమే చూసుకుంటాం!

**- సిహెచ్.వెంకట లక్ష్మి** ■

## సజీవ స్పర్శ..!

**- డాక్టర్ పెరుగు రామకృష్ణ**
**98492 30443**

ఉదయపు కోడి కూత కవిత
కారడవి చిమ్మ చీకట్లలో
కళ్ళు చించుకున్నా ఏమీ కనిపించని రాత్రిళ్ళలో
తళుక్కున మెరిసే మిణుగురు కవిత..

బహుశా హృదయానికి తెలుసేమో
తనదాకా రక్తాన్ని మోసుకువచ్చి
చెడు రక్తాన్ని శుద్ధీకరణకు దారిచూపే
ప్రవాహవేగం కవిత అని..

మీరెవరైనా సముద్రకెరటాల ఉత్సాహ ఘోషలో
ఉద్యమ కవిత్వాన్ని విన్నారా..?
పిడికిళ్ళు బిగుసుకుంటున్నప్పుడో
కళ్ళు కన్నీరు కారుస్తున్నప్పుడో
వైకుంఠ రథం అనాధశవాన్ని మోసుకెళ్తున్నప్పుడో
సైనిక కవాతులో లయబద్ధంగా అడుగులు
పడుతున్నప్పుడో
నవరసాలొలికే కవిత్వం గమనించారా..?

కవిత్యమంటే పదాల ఛట్రంలో బిగిసిన
అక్షర కూర్పు కాదు
కవిత్వమంటే ప్రవహిస్తున్న నదినుంచి విడివడి
పచ్చని పంట పొలాల్లో పారుతున్న ప్రాణధార
చూరునుంచి నిశ్శబ్దంగా జారుతున్న చిట్టి చినుకు..

రాతి నేలల్ని రైతులు దున్నేచోట
శిలలను పగలేసి శ్రామికులు రస్తాలు పరచేచోట
చెమట తడితో విన్పించే మంత్రగానం కవిత
కవిత చప్పట్లు మోత కాదు
కవిత పుస్తకాల దొంతర కాదు
కవిత శాలువల సన్మానం కాదు
కవిత గాయపడ్డ నిశ్శబ్ద హృదయానికి సజీవస్పర్శ..! ■

## కవితలు

## గాయాల తీరం..!

- మామిడిశెట్టి శ్రీనివాసరావు
95733 47744



ఆటవిక జీవనాన్ని అధిగమించి
ఆధునికత వైపు అడుగులు వేసాక
రాజ్యాంగ రాజకీయ రంగులద్దుకుని
సమాజ వనాల్లో సమానత్వపు పూలు పూస్తాయని
ఆశల ఆకాశాన దిగులు మబ్బుల్లాంటి కొన్ని బతుకులు
చితికి చితిని చేరే వరకు ఎదురు చూపులు
ఇసుక మేటల్ని నెమరు వేస్తూనే ఉన్నాయి!

తరాల అంతరాల కుతంత్రాల్ని అంతం చేసి
ధన, ప్రాంత, కుల మతాలకతీతంగా
సమాజాలు సామాజిక న్యాయాలయాలుగా
రూపాంతరం చెందాల్సిన ఒక పరిణామ క్రమం
పురిట్లోనే బిడ్డను చంపేసిన ప్రజాస్వామ్య అక్రమం!

మేడిపండు చట్టాలు పెద్దల చుట్టాలు
పేతల పాలిట మాత్రం మరణ శాసనాలు
న్యాయదేవత త్రాసులో తాలుగింజలా తేలిన
సామాన్యుడు
వర్తమాన వస్త్రాన్ని భవిష్యత్ భరోసాగా మలుచుకోలేక
సంఘర్షణల సమాధుల కింద సమరం చేస్తూనే ఉన్నాడు
నిత్యం గాయాల తీరమై అలరారుతూనే ఉన్నాడు
కాలం చెట్టు మీద గండు కోయిలలాగ
కలల గానం చేస్తూనే ఉన్నాడు!

ఇప్పుడు.....
నిజాన్ని నిప్పులా రగిలించే ఒక ధైర్యం కావాలి
మేకల కోసం మాటేసిన తోడేళ్ళను వేటాడే తెగువ కావాలి
తన క్షీరధారల్ని బిడ్డలందరికీ సమానంగా పంచే
తల్లితనం నిండిన న్యాయదేవతకి పట్టం కట్టాలి!! ■

---

## కోకిల

సాంధ్యశ్రీ
81068 97404



స్వరాన్ని
పల్లకీ ఎక్కించి
రెక్కలతో పరిమళాన్ని వీస్తూ
తోట పువ్వుల్ని తెగమోస్తుంది కోకిల

ఆమ్ర కిసలయాలనే
అగ్ని జ్వాలల్ని మేసి
అంతరగాంధారాన్ని పాటగా
గొంతు నార వేస్తుంది- కోకిల

నాలుగు దిక్కుల రంగుల్ని
కలబోసుకొని
ఐదవ సంగతిగా
ఆత్మని అచ్చుపోస్తుంది కోకిల

పరవశపు ప్రణాదాన్ని పట్టుకొని
పరిసరాల్ని
పాటలో ముంచెత్తుతుంది కోకిల
కనిపించకుండానే కాలాన్ని
ప్రకటించే పంచాంగ రుషి
పూలమబ్బు జాడకు
గొంతుపురి విప్పే సంచార వృషి
కోకిల....! ■



# మహోద్యమం

- మండ ప్రభాకరరావు
94412 79123

విరామమెరగని ఉద్యమ స్ఫూర్తికి
అద్దం పట్టే అన్నదాతల పోరాటం ఇది!
తమ సేద్యం కార్పొరేట్ భోజ్యం కారాదని
నినదిస్తున్న చారిత్రాత్మక ఘట్టమిది!
తమ పంటలకు గిట్టుబాటు ధర
చట్టబద్ధం చేయండంటూ
నల్ల చట్టాల రద్దు కోరుతూ
నెలల తరబడి సాగిస్తున్న సమరమిది!
రోడ్డున మేకులు, అడ్డుగోడల అవరోధాలు
ఆటంకాలూ ఇంటర్నెట్టూ, కరెంటు కట్లూ
తమనేవీ అడ్డగించలేవని
ప్రపంచానికే చాటి చెప్పిన
శాంతియుత సంగ్రామమిది!

రైతుకు తోడుగ కార్మికులుండగ
సకల సంపదల సృష్టికర్తలూ తోడై నిలవగ
ఢిల్లీ సరిహద్దులలో నడిరోడ్లపై
ఆవాసాలతో కొత్త గ్రామాలే వెలయగ
కులములు, మతములు పక్కనపెట్టి
ఒకే గొంతుకై గర్జిస్తున్న ఐక్యతిది!

బోడీ మీడియా గారడీ గోలలు
అసత్య ప్రచారాలెన్ని చేసినా
ఆందోళన జీవులని పాలకపెద్దలు
అన్నదాతలను అపహాస్యం చేసినా
ఆ మాటలనేవీ లెక్క చేయక
సడలని విశ్వాసం, దృఢ సంకల్పంతో
సాగిస్తున్న మహా సమరమిది.

వివిధ ప్రాంతాల రైతాంగంలో ఐక్యత నింపే
మహా పంచాయత్‌లు
రాష్ట్ర రాజకీయాల్లో రైతు అజెండా ముందుకు తెస్తూ
మహా ప్రభంజనంగా సాగుతున్న
కొనసాగుతున్న మహోద్యమమిది
జయ జయ జయహో రైతన్నా
నీవే నీవే గెలవాలన్నా !
దేశానికిదే మహా మలుపు కావాలన్నా!



# విస్తరిస్తున్న రైతు ఉద్యమం

- కార్తికేయ

**జ**నవరి 26 తర్వాత 'ఇక రైతు ఉద్యమం పని అయిపోయి నట్టే' నని మోడీ భక్తులు ప్రచారం చేసుకున్నారు. కాని మరో సారి వారి ప్రచారం వొట్టి బూటకమని తేలిపోయింది. బిజెపి ప్రభుత్వం, దాని భజనబృందం ఆశించినట్టు రైతు ఉద్యమం బలహీనపడలేదు సరికదా మరింత బలంగా, మరింత లోతుగా, మరింత దేశవ్యాప్త విస్తృతితో ముందుకు సాగుతోంది. మార్చి 6వ తేదీన 100వ రోజుకు చేరిన ఉద్యమం ఢిల్లీ సరిహద్దుల్లో సింఘూ, టిక్రీ, ఘాజీపూర్, షాజహాన్‌పూర్, పాల్వాల్ ప్రాంతాల వద్ద భారీగా తరలివచ్చిన రైతులతో శాంతియుతంగా ధర్నాలు నిర్వహించి విజయం సాధించేవరకూ విశ్రమించేది లేదంటూ విస్పష్టంగా తన దృఢ దీక్షను మరోమారు ప్రకటించింది. ఉద్యమానికి నాలుగు నెలలు పూర్తవుతున్న సందర్భంగా మార్చి 26న చేపట్టిన దేశవ్యాప్త బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు అన్ని వైపుల నుంచి మద్దతు లభించింది.

ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగించాలంటే దేశంలోని మారుమూల గ్రామాలకు విస్తరించాలని ఉద్యమ నేతలు భావించారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ సమ్మేళనాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి, కర్ణాటక నుంచి రైతు యాత్రలు సాగుతున్నాయి. తాజాగా గుజరాత్‌లోనూ ఈ సమ్మేళనాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి రైతు ఉద్యమ వేదికలు ఏర్పడ్డాయి. రాష్ట్రవ్యాప్త ప్రచారానికి పూనుకున్నాయి. తమిళ నాడు, కేరళ ఎన్నికలలో రైతు ఉద్యమం ఒక ప్రధాన ప్రచారాంశం అయింది.

### బలపడుతున్న కార్మిక – కర్షక ఐక్యత

ఒకవైపు పోరాటంలో నిమగ్నమై ఉన్న రైతు ఉద్యమకారులు దేశంలో జరుగుతున్న కార్మికుల, ఉద్యోగుల పోరాటాలకు తాము కూడా తోడు నిలవాలని భావించారు. మార్చి 15న ప్రైవేటీకరణ వ్యతిరేక దినాన్ని పాటించాలన్న కేంద్ర కార్మిక సంఘాల పిలుపుకు రైతు ఉద్యమం మద్దతు ప్రకటించింది. ఆ రోజున దేశ వ్యాప్తంగా రైతాంగం, కార్మికులు ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణకు, వ్యవసాయం కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పెట్రో ధరల పెరుగుదలను కూడా వారు నిరసించారు. మార్చి 15, 16 తేదీల్లో జరిగిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు, 17న జరిగిన సాధారణ బీమా ఉద్యోగుల సమ్మెకు, 18న జరిగిన జీవిత బీమా ఉద్యోగుల సమ్మెకు రైతు ఉద్యమం సంఘీభావం తెలిపింది. ఉమ్మడిగా రాబోయే కాలంలోనూ ఉద్యమాలు చేపట్టాలన్న నిర్ణయానికి కార్మిక, కర్షక ఉద్యమ నేతలు వచ్చారు.

### ధర్మ యుద్ధం – ప్రజలందరి పోరాటం

ఇప్పుడు రైతులు పోరాడుతున్నది కేవలం ఆ నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం మాత్రమే కాదు. వాళ్ళు దేశంలో విపరీతంగా పెరిగిపోయిన సంపద అసమానతల మీద పోరాడు తున్నారు. రాజకీయాలలో ప్రజల మధ్య చీలికలు తెచ్చే శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. రైతాంగ ఆత్మహత్యల మీద, ఆదాయాల్లో ఉన్న అసమానతల మీద, కార్పొరేట్ల గుత్తాధిపత్యం మీద... వాళ్ళిప్పుడు పోరాడుతున్నారు. వ్యవసాయంలో స్త్రీలు పోషించే పాత్రకు తగిన గుర్తింపు కోసం పోరాడుతున్నారు. సమాజంలోని అన్ని తరగతుల ప్రజల సమస్యలపై వారు పోరాడుతున్నారు. ఇదొక ధర్మయుద్ధం అని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ప్రకటించారు.

### ... ఇప్పుడవి మహా పంచాయితీలు

కులాలవారీగా ప్రజలలో వేలాది సంవత్సరాలుగా ఉన్న చీలికలను ముందుకు తెచ్చి రైతు ఉద్యమాన్ని చీలికలు, పేలికలు చేయాలని బిజెపి పన్నిన కుట్రలను రైతులు గ్రహించారు. ఒక చోట అది కేవలం 'జాట్'ల ఉద్యమంగా ఉందని, ఇంకొక చోట 'షెకావత్'ల ఉద్యమమే తప్ప ఇంకెవరూ లేరని, మరో చోట ఇది కేవలం 'మీనా'ల ఉద్యమమేనని – ఇలా బిజెపి నాయకులు తప్పుడు ప్రచారం చేశారు. మొదట్లో ఖాప్ పంచాయితీల ద్వారా రైతులను కదిలించే ప్రయత్నాలు జరిగాయి. కాని కేవలం ఒక కులానికి చెందిన వారిని మాత్రమే కదిలించడంతో విజయం రాదని, అన్ని కులాల వారిని కలిపే సమీకరణలు అవసరమని రైతు నేతలు గుర్తించారు. అందుకే ఇప్పుడు ప్రతీ చోటా మహా పంచాయితీలు నిర్వహిస్తున్నారు. వాటిలో అన్ని కులాలవారినీ కదిలించి ఐక్యపరుస్తున్నారు. హిందూ– ముస్లిం– క్రైస్తవ– సిఖ్ ఐక్యతను ప్రబోధిస్తున్నారు. దళితులను సాదరంగా స్వాగతిస్తున్నారు. అన్ని తరగతుల శ్రామిక ప్రజలనూ సమీకరించే 'కిసాన్–మజ్దూర్ ఏక్తా జిందాబాద్' నినాదం ఇప్పుడు ఉద్యమ నినాదంగా మారింది.

'మోడీ ప్రభుత్వం పెట్టిన బారికేడ్లను తొలగించి ఢిల్లీ నిరసనలను కొనసాగిస్తున్నాం, నీటి ఫిరంగులను, బాష్ప వాయు గోళాలను తిప్పికొట్టాం. అలాగే ఇప్పుడు మన మధ్య ఐక్యతకు అడ్డుగోడల్లా ఉన్న కుల, మత విభేదాలనూ తొలగిద్దాం.' అని కిసాన్ నేతలు పిలుపిచ్చారు. 'దళితుల ఇళ్ళల్లో ఛోటూరామ్ ఫోటోలు పెట్టండి. అగ్రవర్ణాల వారి ఇళ్ళల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోలు పెట్టండి.' అని నేతలు విజ్ఞప్తి చేశారు. హిందువులకు, ముస్లింలకు మధ్య మత విభేదాల చిచ్చు రగిల్చి గత రెండు తడవల ఎన్నికలలో లబ్ధి పొందిన బిజెపి నేతలకు ఇప్పుడు వారివారి నియోజక వర్గాలలోనే బహిష్కరణలు, నిరసనలు ఎదురవుతున్నాయి. ముజఫర్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్రంలో మంత్రి పదవి కూడా చేపట్టిన సంజీవ్ బాల్యన్ తన నియోజకవర్గ రైతులను 'చైతన్యవంతుల్ని' చేద్దామని వెళ్ళి వారి నిరసన వేడికి తట్టుకోలేక వెనుదిరగవలసి వచ్చింది. అక్కడ గతంలో పరస్పరం వైరంతో వ్యవహరించిన హిందువులు, ముస్లింలు ఇప్పుడు ఐక్యమై మంత్రిని వెళ్ళగొట్టారు. తన కుల, మత విద్వేష రాజకీయాలతో రైతు ఉద్యమంలో చీలికలు సృష్టించాలని బిజెపి చేసిన, చేస్తున్న కుట్రలను సమైక్య రైతు ఉద్యమం విజయవంతంగా తిప్పికొడుతోంది.

### వెల్లివిరుస్తున్న సౌహార్ద్రత

తన పొలంలో వేసిన చెరుకు పంట కోతకు రావడంతో.... పోరాట కేంద్రం నుండి వెనక్కి వెళ్ళి కోతలు పూర్తి చేసుకుని తిరిగి వచ్చాడు రాజన్ జావలా అనే రైతు. అతను ఆ చెరుకునంతా పోరాట కేంద్రానికి తీసుకువచ్చి అక్కడ ఉన్నవారందరికీ చెరుకురసం సరఫరా చేస్తున్నాడు. ఆ విధంగా చేస్తున్నవారింకా చాలామంది ఉన్నారని అతడు తెలిపాడు. ఇంటింటికీ తిరిగి పాలు సేకరించి పోరాట కేంద్రాలకు తెచ్చి అక్కడ ఉద్యమకారులకు టీ కాచి ఇస్తున్న వారు కూడా చాలామంది ఉన్నారు. ఇక గ్రామాల్లో ఉండిపోయినవారు ఉద్యమ కేంద్రాల వద్ద ఉన్నవారి పొలాల్లో కోతలకు, నాట్లకు సహకరిస్తున్నారు. రాజస్థాన్– హర్యానా సరిహద్దులో భరత్‌పూర్ వద్ద మహా పంచాయితీ జరపడానికి 25,000 మంది పట్టే స్థలం అవసరమైంది. ఏపుగా ఎదిగిన గోధుమ పంట ఉన్నా, ఆ పొలాలను సభ కోసం చదును చేసి స్వచ్ఛందంగా ఇవ్వడానికి రైతులు ముందుకొచ్చారు. 'వ్యవసాయ పనులూ ఆగవు, ఉద్యమమూ ఆగదు' అంటున్నారు రైతులు.

### నిర్బంధాలకు భయపడేది లేదు

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు రైతు ఉద్యమకారులపై కేసులు పెడుతున్నాయి. ఇప్పటికి 100 మందికి పైగా జైళ్ళలో ఉన్నారు. రైతు నాయకుల పైనే 35 కేసులు ఇప్పటి వరకూ

బనాయించారు. శాంతియుతంగా ఆందోళన సాగితే అందుకెటువంటి అభ్యంతరమూ ఉండబోదని సుప్రీం కోర్టు మొదట్లోనే స్పష్టం చేసింది. కాని రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా నిర్బంధానికి పూనుకుంటున్నాయి. అయితే 'ఈ నిర్బంధాలు మా ఉద్యమాన్ని ఎంతమాత్రమూ నిరోధించలేవు' అని రైతు ఉద్యమకారులు ప్రకటిస్తున్నారు.

### బాసటగా ప్రత్యామ్నాయ మీడియా

ప్రింట్ మీడియాతో సహా ప్రధాన స్రవంతి మీడియా రైతు ఉద్యమ వార్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు. ప్రభుత్వ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. అయితే, ఒక కొత్త తరం యువ జర్నలిస్టులు ముందుకొచ్చారు. నిరసన వార్తలను, నాయకుల ప్రసంగాలను, ఇంటర్వ్యూలను చిన్న చిన్న వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఇంటర్నెట్‌లో వాటికి విశేష ప్రాచుర్యం లభిస్తోంది. వాటిని చూసేవారు, లైక్ చేసేవారు లక్షల్లో ఉన్నారు. ఆన్‌లైన్ న్యూస్ మీడియా కూడా రైతు ఉద్యమాన్ని బాగా ప్రచారం చేస్తోంది. నేడు భారతదేశ రైతాంగ ఉద్యమం అంతర్జాతీయంగా ప్రచారం పొందింది. బ్రిటన్ లో లక్ష మంది పౌరులు పాల్గొన్న సంతకాల ఉద్యమం కలిగించిన ఒత్తిడితో బ్రిటన్ పార్లమెంటు ఒకరోజు భారత దేశంలో జరుగుతున్న రైతు ఉద్యమం మీద చర్చించింది. చర్చలో పాల్గన్న ఎంపీలందరూ మోడీ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. అమెరికా, కెనడా, ఫ్రాన్స్ తదితర దేశాలలో మన రైతు ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది.

### 'నా ఆఖరి కోర్కెను తీర్చండి'

48 ఏళ్ళ రాజ్‌బీర్‌సింగ్ హర్యానా లోని హిస్సార్ కు చెందిన రైతు. తన రెండెకరాల పొలంలో వరి, గోధుమ పండిస్తాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వంద రోజులైనా మోడీ ప్రభుత్వం రైతుల డిమాండ్లను అంగీకరించకపోవడంతో నిరాశ చెంది ఆ రోజునే ఉరి వేసుకుని చనిపోయాడు. తన సూసైడ్ నోట్‌లో 'చనిపోతున్న నా ఆఖరి కోర్కెను నెరవేర్చండి. ఆ మూడు వ్యవసాయ చట్టాలనూ రద్దు చేయండి' అని రాశాడు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఎనిమిదో రైతు రాజ్‌బీర్. ఇప్పటివరకూ ఈ ఉద్యమంలో 280 మంది రైతులు అమరులయ్యారు.

### దేశం కోసం పోరాడాను.. ఇదా నాకిచ్చే బహుమానం?

82 ఏళ్ళ గురుముఖ్‌సింగ్ పంజాబ్ లోని ఫతేపూర్‌సాహిబ్ గ్రామానికి చెందిన రైతు. 22 సంవత్సరాలు ఆర్మీలో ఉన్నాడు. 1962 ఇండో-చైనా యుద్ధంలో, 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో, 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో పాల్గన్నాడు. 1984లో పదవీ విరమణ చేసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. మొన్న జనవరి 26న ఢిల్లీ వద్ద జరిగిన అల్లర్లతో ఎటువంటి సంబంధమూ లేకపోయినా (నిజానికి ఆ అల్లర్లు కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగం) గురుముఖ్‌సింగ్‌ను నిర్బంధించి 16 రోజులు జైలులో ఉంచారు. ప్రస్తుతం బెయిల్ మీద విడుదల అయ్యాడు. కాని ఆ తప్పుడు కేసు ఇంకా ఉంది. 'నేను దేశం కోసం మూడు యుద్ధాల్లో పోరాడాను. నాకు ఆర్మీలో ఎంతో గౌరవం ఇచ్చారు. నాకు 10 పతకాలు వచ్చాయి. కాని ఇప్పుడు మోడీ ప్రభుత్వం నన్ను ఉగ్రవాదినంటోంది. నా జీవితపు చివరి రోజుల్లో ఇదేనా నాకు దక్కింది? ఈ అవమానాన్ని నేనెలా భరించగలను?" అని గురుముఖ్ వాపోతున్నాడు. అతడి ప్రశ్నకు మోడీ-షా ల వద్ద సమాధానం ఉందా?

### ఎన్నికలలో ఓడించాలని పిలుపు

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఆ రాష్ట్రాలలో పర్యటిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల పర్యటన పూర్తయింది. ఆ రాష్ట్రాలలో బిజెపిని ఓడించి బుద్ధి చెప్పాలని రైతులకు, ప్రజలకు ఉద్బోధిస్తున్నారు.

### షాకిచ్చిన సత్యపాల్ మాలిక్

మేఘాలయ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ రైతు ఉద్యమానికి తన మద్దతు బహిరం గంగా ప్రకటించాడు. 'రైతులు వొట్టి చేతులతో ఢిల్లీ నుండి వెనక్కి పోకూడదు. వారిపై ఎటువంటి బలప్రయోగమూ కూడదని నేను ప్రధానికి, హోం మంత్రికి చెప్పాను. రైతులను కెలకవద్దు. వాళ్ళు వెనక్కి తగ్గరు. ఒకవేళ తగ్గవలసివస్తే ఆ అవమానాన్ని 300 ఏళ్ళదాకా మరిచిపోరు' అన్నాడు మాలిక్. మరో జాతీయోద్యమమే సాగుతోందా అన్న రీతిలో నడుస్తున్న రైతు ఉద్యమానికి బాసటగా నిలుద్దాం.

**(ప్రజాశక్తి నుంచి)** ■



# అతడికిప్పుడేం కావాలి?

- పాయల మురళీకృష్ణ
94410 26977

అతడికిప్పుడేం కావాలి
వాళ్ళు గెలిచారన్న కబురు వినాలి
అప్పటికి గాని అతడి ఊపిరి దూదిపింజై పైకి లేవదు

అతడున్న ముంజూరు
కాలానికి లంగని స్వరపేటికలా వుంది
అతడి వర్తమానం
మేకులు దించిన దారిలాంటి శయనంపై
లెక్కచేయని పయనంలా వుంది
చుట్టూ ఇనుప కంచెల్లాంటి గోడల్ని ఛేదించే చూపులు
మంచం కింద ఉమ్ముతొట్టి కక్కుతున్న
నెత్తుటిలో నిక్కబొడుస్తున్న ధిక్కారాన్ని సంధిస్తున్నాయి

అతడికిప్పుడేం కావాలి?
వాళ్లు గెలిచారన్న కబురు వినాలి!

కాడి పట్టిన నుంచి
మంచం పట్టిన వరకు నాగేటి చాలై నడచినవాడు
ఏడాదేడాది మానేద్దామనుకుంటూనే
మట్టి సింహాసనం పరిత్యజించనివాడు
రాజ్యం ముందు రైతు బతుకులాంటి
ఖాళీ గిన్నె గదిలో మిగిలాడు
గది విముక్తిని వేడుకుంటూ ప్రతి రోజూ
కొన్ని లేత మునివేళ్లు కిటికీకవతలవైపు
పువ్వుల్ని పేర్చి వెళ్ళిపోతున్నాయి

అతడికిప్పుడేం కావాలి?
వాళ్లు గెలిచారన్న కబురు వినాలి!

మూతపడని నయనంలో
రహదారి దిగ్బంధం ప్రతిబింబిస్తోంది
కదిలించలేని పాదాల మీద
లక్షలాది నడకలు ప్రతిఫలిస్తున్నాయి
ఎత్తలేని చేతులు
ఎగసే విజయకేతనాలను కలగంటున్నాయి
ఆ గొంతు
మూగగా నినదించే సంద్రమై ఉప్పొంగుతోంది
వెళ్లిపోవాల్సిన వాడే ఆగిపోయాడు..

ఈ దేశం ముందు
నాగలే విజయానికి సంకేతమై నిలిచిందని
ఆ హృదయానికి చేరేంతవరకూ
కొమ్మకు అతి కష్టం మీద అంటి పెట్టుకుని ఉన్న
పండుటాకు సంతృప్తిగా రాలిపడదు!

■




# 70 ఏళ్లక్రితమే ప్రగతిబాటన సాగిన రథచక్రాలు

- చెరుకూరి సత్యనారాయణ

**తె**లుగులో ప్రగతిశీల నవలా రచయితలు నలుగుర్ని లెక్కించాల్సివస్తే చిటికెన వేలిపై చటుక్కున ఎక్కి కూర్చొనే రచయిత మహీధర రామమోహనరావు గారు. చదివింది వీధిబడిలోనే అయినా 13వ ఏటనే రచనా వ్యాసాంగం ప్రారంభించాడు. అనువాదాలు, కథలు, నాటికలు రాసినా 40వ దశకం వరకూ నవలల జోలికి వెళ్లలేదు. 'రథచక్రాలు'తో ప్రారంభించి 'ఓనమాలు', 'ఈ దారి ఎక్కడికి?', 'కొల్లాయి గట్టితేనేమి?' 'మృత్యువు నీడల్లో' మొదలైన 15 నవలలు రాసి తెలుగులో అగ్రశ్రేణి నవలా రచయితగా వాసికెక్కారు.

రచయితగా, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా కన్నా ఒక ప్రచురణకర్తగా మహీధర గారి కృషి అద్వితీయం, అనన్య సామాన్యం. తన సోదరులు జగన్‌మోహన్, కృష్ణమోహన్‌లతో కలిసి తమ గ్రామమైన ముంగండలో విశ్వసాహిత్యమాల పేరుతో ఒక ప్రచురణ సంస్థని స్థాపించారు. పైసా చేతిలో లేకుండానే ఈ సాహసానికి పూనుకొని కొన్ని చలం పుస్తకాలు, అనువాదాలు మొదట ప్రచురించారు. పారితోషికం ఇచ్చే స్థోమత లేక కాపీరైటు చట్టం కింద జైలుశిక్షకు సిద్ధపడ్డారు. వీరితో పాటు సనాతన బ్రాహ్మణ కుటుంబాల్లో పుట్టిన వీరి భార్యలు, పెద తల్లి పుస్తకాలు కుట్టి అతికించి బైండ్ చేసేవాళ్లు. పంచుకోవటానికి ఆస్తులు లేకపోయినా రామమోహన్, కృష్ణమోహన్ గార్లు ఒకరు రాజమండ్రి నుంచి బరంపురం దాకా; మరొకరు దక్షిణాన తడ వరకు ఆంధ్రదేశాన్ని పంచుకొని సైకిళ్లపై పుస్తకాలు పెట్టుకుని గ్రామ గ్రామాన తిరిగి వాటిని అమ్మేవాళ్లు. ఈ రకంగా కమ్యూనిస్టు సాహిత్యాన్ని తెలుగు నేల నాలుగు వైపులా వెదజల్లారు.

తొలి నవలా 'రథచక్రాలు'తోనే రాజకీయ నవలలు ఎలా రాయాలో చూపించి తదనంతరం కాలంలో రాజకీయ నవలలు రాసిన అనేక మంది రచయితలకు, రచయిత్రులకు గైడ్‌గా నిలిచాడు మహీధర. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం నేపథ్యంలో 'ఓనమాలు' (1956), 'మృత్యువు నీడలో' (1957) నవలలు రాశారు. అలా తొమ్మిది పదుల వయసు దాటిందాకా రాస్తూనే ఉన్నాడు. రథ చక్రాలు, కొల్లాయి గట్టితేనేవి? ఈ దారి ఎక్కడికి? నవలలో గోదావరి జిల్లాల నేపథ్యం వున్నా ఆనాటి కాలంలో 1947కి ముందు తర్వాత ఆంధ్ర ప్రాంతం లోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సామాజిక, రాజకీయ పరిస్థితుల్ని; స్వాతంత్ర్యానికి ముందే కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పదవీ లాలసనే సమర్థవంతంగా చిత్రించారు. మరీ ముఖ్యంగా రథ చక్రాలు నవలలో ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం రాష్ట్రంలోనూ, తెలుగు ప్రాంతంలోనూ ప్రజలపైనా, ప్రజానాయకులపైనా సాగించిన విచ్చలవిడి దౌర్జన్యకాండ నేపథ్యంలో ఆనాటి గ్రామాల్లో కాంగ్రెసు – కమ్యూనిస్టు గ్రూపుల మధ్య ఘర్షణ ఈ కథలో కూడా చూడవచ్చు.


నవల కథా క్రమం పరిశీలిస్తే ... బ్రాహ్మణ అగ్రహారానికి అనుబంధ పల్లె లంక మాలపల్లె. అగ్రహారం కాంగ్రెసు పార్టీ పలుకుబడిలో వుండగా లంక మాలపల్లె కమ్యూనిస్టు పార్టీ ప్రభావంతో ఉంటుంది. అగ్రహారంలో కాంగ్రెసు నాయకుడు విశ్వనాథం కుటిల రాజకీయవేత్త కాగా, కాంగ్రెసు ద్వారానే

ప్రజలకు మేలు జరుగుతుందనుకునే భ్రమలో వున్న మరో నాయకుడు సత్యానందం. పల్లెలో జాన్, మరియమ్మ కమ్యూనిస్టు కార్యకర్తలు కాగా, విశ్వం ఆ ప్రాంతపు కమ్యూనిస్టు నాయకుడు. పైగా జమిందారీ దివాన్ కొడుకు. జమిందార్‌కు మాలపల్లి జనాలకు మధ్య చాలా కాలంగా వున్న తగాదాల కారణంగా లంక మాలపల్లెను తగలబెడతారు. ఆ ఇళ్లను ఆర్పే పని చేయటమే గాక ఆ జనాలకు తన తోటలో పునరావాసం కల్పిస్తాడు సత్యానందం. ఈ క్రమంలోనే కమ్యూనిస్టుల పట్ల తనకున్న దురభిప్రాయాలు మార్చుకుంటాడు. వారి ఆచరణ, సంస్కార వంతమైన వారి ప్రవర్తన అందుకు దోహదపడతాయి. అనంతర కాలంలో దేశంలో పొడచూపిన అతివాద రాజకీయాల గురించి, దాని పెడ ధోరణి గురించి ఆనాడే జాన్ పాత్ర ద్వారా సమాధానాలు చెప్పించాడు రచయిత.

వేర్వేరు సందర్భాల్లో కాంగ్రెసు నాయకుడు విశ్వనాథం అరెస్టు, కమ్యూనిస్టు నాయకుడు విశ్వం అరెస్టుల సందర్భంలో ప్రభుత్వం ప్రవర్తించిన తీరు ప్రభుత్వ వర్గ దృక్పథాన్ని తెలియజేయటంతో పాటు సత్యానందం లాంటి నాయకులను ఆలోచింపజేస్తుంది. 'ప్రపంచాన్నంతా బంధువులుగా భావించే స్వభావం కమ్యూనిస్టులదని' చెప్పిన విశ్వం మాటల్లోని నిజం నవలలో వ్యక్తమవు తోంది. జానకి, భద్ర, మేరి లాంటి స్త్రీ పాత్రల ద్వారా ఆనాటికి ఎవరూ వినివుండని స్త్రీ వాదపు ఆలోచనల్ని, స్త్రీ, పురుష సంబంధాలు వ్యక్తిగతం కాదు సామాజికం అన్న పురోగామి దృక్పథాన్ని వినిపిస్తాడు రచయిత. జానకి లాంటి సాంప్రదాయ ఛత్రం నుంచి వచ్చిన స్త్రీ 'మగవాళ్లు మనల్ని కాపలా కాయాల్సిందే అన్న భయం వున్నంత కాలం మగాళ్లు మనల్ని భయపెడతారు. ఆడది తన్ను తాను కాపాడుకోవటమే దారి. మన ప్రవర్తనలోనే మనకు రక్షణ ఉండేలా చూసుకోవాలి' అని గ్రహించటం దానికి తార్కాణం. కమ్యూనిస్టు కుటుంబాల్లో స్త్రీల పని విధానం కమ్యూనిస్టుల పట్ల గౌరవం కలిగించేలా నవలలో చిత్రించబడింది.

1948లోనే ఈ నవల రాసినా 1956 దాకా ప్రచురించ బడలేదు. చివరికి కాట్రగడ్డ నారాయణ రావు గారి వితరణ కారణంగా బయటకొచ్చిన తరువాత చాలా కాలానికి కావలి సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్ వారు 2016లో ప్రచురించారు. సుప్రసిద్ధ కథా రచయిత సింగమనేని గారి ముందుమాట, అనుబంధంగా ఆకాశవాణి కోసం కేతు విశ్వనాథరెడ్డి రచయితతో చేసిన సుదీర్ఘమైన ఇంటర్వ్యూ కూడా ఈ ప్రచురణలో జోడించారు. ■

## మరో ప్రస్థానం



మనువాదం వేదమై
ఊరవతల దళితవాడలో
దళితుడు పెట్టిన గావుకేక
గుడిలో గంటై మ్రోగుతున్న
మానవత్వం ధ్వజస్తంభమౌతుంది!

చింకి గుడ్డలతో, చింపిరి జుట్టుతో
అర్ధనగ్న శరీరంతో
వయోభారంతో శ్రమిస్తున్నా
ఒరే, కోటిగా, వెంకిగా, సుబ్బిగా బిరుదులు
గుండెకు గాలమై గుచ్చుకుంటున్నా
భరతుడై పాదుకలు పట్టాడే తప్ప
ప్రశ్నకు ప్రశ్నయై నిలబడదు

దేవుడికి కష్టాలు చెప్పుకుందామంటే
ఆచారం గీసిన లక్ష్మణరేఖ
ఆలయానికి దూరం చేస్తే
బతుకు యజ్ఞంలో సమిధౌతాడే తప్ప
యజ్ఞఫలమై సాక్షాత్కరించదు!

దేవుడు రాసిని రాతలను చెరుపుకుందామని
పదును తప్పిన ఆరెను తీసుకొని
బతుకు బండిని నగరానికి తరలిస్తే
నాలుగు రోడ్ల కూడలిలో చినిగిన గొడుగు కింద
దళితునికి అర్ధాకలి ప్రసాదమైతే
మౌనమే దేవునికి నైవేద్యమౌతుంది!

దేవుడు రాసిన రాతలు
నీ చేతులతో తుడిపేసి
భూపాళ రాగాలతో మేల్కొల్పు గీతాలతో
బడిలో, గుడిలో, చర్చిలో గంటై
గణ గణమని మోగుతూ
మానవత్వాన్ని మేల్కొల్పి
సాగించు మరో ప్రస్థానం!

**- షేక్ మహబూబ్ జాన్**
**99599 50191**



# కాకెంగిలి ప్రేమ

- సిరికి స్వామినాయుడు
79897 89893

**వా**డొక  నల్లచామంతి!
నేనొక  తెల్లగులాబి !
అయితేనేం ఇద్దరం మనుషులమే!
ఒక తోటలో.. విరిసిన పూవులమే !
చిరుగాలి ఒడిలో..
ఊసుల ఉయ్యాలలూగిన వాళ్లమే!
ఒకరి భుజాలనొకరు తీగల్లా అల్లుకొని
ఒరే తురే అని పిలుచుకున్న
తేనెపిలుపులు కమ్మదనాలమే!
జంట పక్షులమై ..
అలల కోనేటి ఆకాశాన్ని ఈదిన వాళ్లమే!
ఒకే కాటుబెల్లముక్కని
కాకెంగిలి జేసి పంచుకున్నవాళ్లమే !
దేవరకొండ గుహలో దేవుడి కళ్లగప్పి
ప్రసాదాలు దొంగిలించిన వాళ్లమే !
నిర్మల బాల్యపు నదీ ప్రవాహాలమే !

జీవితం ..
ఇద్దరినీ చెరోపక్క విసిరికొట్టాక
పూరింట పాదున .. వాడు!
మేడింట తావున .. నేను!
అయితేనేమి ఇద్దరం మనుషులమే!
కాలం సరిహద్దు రేఖ మీద పొడిచిన పొద్దులమే!

ఇపుడేమిటి .. కుచేలుడై వాడు
నా ఇంటి మునివాకిటే ఆగిపోయేడు?
బిడియపు కంచెలు దాటి
నెలవంక దూరినట్టు నా నట్టింటికి రాడేమీ?
శీతగాలిలా వచ్చి నన్ను హత్తుకోడేమి?

ఎవరు మమ్మల్ని విడదీసింది?
ఏ సమాజం మమ్మల్ని ఎడబెట్టింది?
ఏ కులం మా మధ్య గీత గీసింది?
ఏ దొంతర మా మధ్య అంతరాల్ని పెంచింది?
ఇద్దరం కేవలం మనుషులమే గదా ..!
మనసులు పెనవేసుకున్న మట్టి రూపాలం గదా ..!

ఓ నా ప్రియనేస్తమా..!
నీవు 'ఏవండీ' అని పిలుస్తున్నపుడల్లా
వేయి కోతలు పడ్డ పక్షినై పోతున్నట్టుందిరా..!
నా మునివాకిటే నీవు ఆగిపోతున్నపుడల్లా
నట్టింట నేనస్పృశ్యుడనై నేల కుంగిపోతున్నట్టుందిరా.. ! ■

## నీ బరువెంతో ...

- సురేంద్ర రొడ్డ
94915 23570

నీ బరువు ఎంతో
అమ్మ గుండెలను అడుగు !
లోకమంటే ఏమిటో
నాన్న భుజాలను అడుగు !
నీ మంచి ఎంతో
మన సమాజాన్ని అడుగు !

నీ చెలిమి ఎంతో
స్నేహితులను అడుగు !
నీ సహనమెంతో
భూమాతను అడుగు !
నీ పోరాటమెంతో
అలుపెరుగని కెరటాలనడుగు !
నీ సత్తా  ఏమిటో
సమస్యలను అడుగు !
నీ బలమేమిటో
బంధువులను అడుగు !

నీ బలహీనతలేమిటో
శత్రువులను అడుగు !
నీవంటూ ఏమిటో
నీ అంతరాత్మను అడుగు !



## రెండు చేతులు .. కోట్లాది జనులు ...

ఆ రెండు చేతుల్ని ప్రశ్నించలేను
అవి ఇనుము లావాని ఉక్కుగా మలిచిన చేతులు.

ఆ వంద గుండెల్ని పరిశోధించలేను
అవి ఫర్నేసుల్ని మండించి
ఇనుమును కరిగించిన గుండెలు
ఆ వేల మెదళ్లను కదిలించలేను
షిఫ్టుల్లో ఫ్యాక్టరీ శ్వాసగా మెదిలిన మెదళ్లు
ఆ వేలాది కార్మికుల్ని పరిశీలించలేను
ఉక్కు కర్మాగారంలో కిరణాలై ఉదయించే కార్మికులు

ఆ పెద్దమనుషులకు ఏం తెలుసని
ప్రజల హక్కుల్ని ముక్కలు చేసి
అమ్మకానికి పెట్టడం తప్పు ..!

అంతర్జాతీయ వేదికలపై చప్పట్ల కోసం
ప్రజాస్వామ్యాన్ని గుంపగుత్తగా
అభివృద్ధి పేరిట
పూడ్చని బోరింగ్ బావుల్లో పసిపాపలా తోసేయటం
తప్పు.
కోట్లాది కంఠాలు పిడికిళ్ళు ఘోషతో ఏక స్వరమై
ప్రచండ ఉద్యమం ఘోషతో పరిణమించిన వేళ
ముప్పై ఆరు  సమాధుల పైన జెండాల రెపరెపలు
ఉరుముల ప్రభంజనం నూతనంగా నిలిచిన వేళ
జన సముద్రం ఉప్పెనలా దూసుకు వస్తూ
సాధించుకున్న కార్మిక స్వర్గం ఉక్కు కర్మాగారం!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

## కవిత

# ప్రేమ సెలయేరు




- పద్మావతి రాంభక్త

99663 07777


ప్రతి దృశ్యాన్నీ
మీ కళ్ళలోంచే చూస్తారెందుకు
చూసే దృష్టిని బట్టి
దృశ్యం రకరకాల దుస్తులు తొడుక్కుంటుంది
పూల లోతుల్లో ఏముంటుంది
పుప్పొడి తప్ప అంటూ నిర్లిప్తంగా
పెదవి విరవకండి
అందులోనూ
ఒక స్వర్గముంటుంది
పరిమళం లేకపోయినా
నింగికి నిచ్చెనుంటుంది
సూర్యాస్తమయం
కుంగుబాటును చూపిస్తుంది
కొందరికది
మరునాటి సూర్యోదయానికి
నాందీవాక్యంగా అగుపిస్తుంది
మినుకుమనే దీపం
తగ్గిపోతున్న వెలుగుసూచన కన్నా
ప్రయాసతో తనను తాను
చివరి క్షణం వరకూ
నిలబట్టుకునే ధైర్యంలా
అనిపించడం లేదూ

మనుషుల ముఖాల పైపైనో
వారి మనసు చిమ్నీలకు అంటుకున్న మసినో చూడకండి
హృదయాల లోతులకు ప్రయాణించండి
ఎన్నో పూలతోటలు సీతాకోకలు
ఆకుపచ్చదనాలు హరివిల్లులు
నదులు సముద్రాలు
సమస్త భూమండలమూ దర్శనమిస్తుంది
చూపులను శుభ్రంగా కడుక్కుని
చేతులు చాచి
ప్రపంచాన్ని ప్రేమగా కౌగిలించుకోండి
ఆనందాల సెలయేరు
మీ పాదాలను తడుపుతుంది
ప్రశాంతతీరం ఆత్మీయంగా ఆహ్వానిస్తుంది! ■

## ఏప్రిల్ 4న విశాఖలో ఉక్కు జన కవనం

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా తెలుగు ప్రజలందరిలో మార్మోగిన నినాదానికి ప్రతిరూపం విశాఖలోని ఉక్కు కర్మాగారం. విశాఖపట్నం అధునాతనంగా విస్తరిల్లటానికి అన్ని విధాలా దోహదపడిన పరిశ్రమ ఇది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దానిని కార్పొరేట్లపరం చేయజూస్తున్న నేపథ్యంలో – రాష్ట్రమంతటా నిరసన వ్యక్తమవుతోంది. కార్మికులు దశలవారీగా పోరాటాలు చేస్తున్నారు. ఈ ఉద్యమానికి సంఘీభావంగా సాహితీ స్రవంతి, ఇతర సాహిత్య కళారంగ సంస్థలు సంయుక్తంగా 4.4.2021 ఆదివారం విశాఖ ఉక్కునగరంలోని సిడబ్ల్యుసి –1లో రోజంతా రాష్ట్రవ్యాప్త కవులు, గాయకులు, సాహిత్యవేత్తలతో ఉక్కు జన కవనం, శ్రీశ్రీ 110వ జయంత్యోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తోంది. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు ఈ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది. ■

## కథ



# ఫ్లాట్ ఫ్రెండ్స్


- కె ఉషారాణి

94928 79210


**రా**జేంద్ర నగర్ ప్లాజా హిల్స్ అపార్ట్మెంట్స్ అంటే విజయవాడలో ఎరగని వారు ఉండరు. చక్కటి గేటెడ్ కమ్యూనిటీ. అక్కడక్కడా పార్కులు, చిన్న సూపర్ బజార్, చిన్న కాఫీ షాపు.. ఆ అపార్ట్మెంట్స్‌లో ఉంటారు నీలాంబరి విఠల్. బజారు నుంచి సామానుతో లిఫ్ట్ ఎక్కిన నీలాంబరి, లిఫ్ట్‌లో అప్పటికే ఉన్న ప్రౌఢ మహిళను చూసి పలకరింపుగా నవ్వింది. చూడడానికి ఆకర్షణీయంగా ఉండడమే కాదు, ఆమె చిరునవ్వులో ఓ చమత్కారంఉంది. ఒక్క క్షణంలోనే పరిచయం చేసుకోవాలనిపించింది.

"నా పేరు నీలాంబరి. మా వారు ఎల్ఐసిలో మేనేజర్. పేరు విఠల్. ఫ్లాట్స్‌లో రెండేళ్ల నుంచి ఉంటున్నాం. ఈ మధ్యనే వచ్చినట్టున్నారుగా మీరు?" అంది నవ్వుతూ.

"అవునండి.. మేం హైదరాబాద్ నుంచి వచ్చాం. నా పేరు మల్లిక. రెండు రోజులై దిగినా ఇల్లు కదలలేని పనితో సతమతమవుతున్నాను. అందుకే పక్కనే ఉన్నా మిమ్మల్ని కూడా పరిచయం చేసుకోలేదు. మా వారు స్టేట్‌బ్యాంకు మేనేజర్. రాజేంద్రనగర్ బ్రాంచి. పేరు రంగారావు. అందుకే ఇక్కడ ఇల్లు తీసుకున్నాం."

లిఫ్ట్ నాలుగో ఫ్లోర్‌లో ఆగింది. ఇద్దరూ దిగారు. "అవసరమైతే ఏ సహాయమైనా అడగండి. బై" అంటూ నీలాంబరి తన ఫ్లాట్‌లోకి వెళ్ళింది.

వచ్చి రెండేళ్లయినా, ఇప్పటివరకూ సరైన మార్కెటింగ్ జోడీ కుదరలేదు నీలాంబరికి. మిత్ర బృందంలో అనేక రకాల హాబీలున్న వారున్నారు గానీ తనలా షాపింగ్‌కి ఎక్కువ సమయం వెచ్చించే వారు లేరు. పదింటికి భర్త, పిల్లలు ఆఫీసుకు, కాలేజీలకు బయల్దేరగానే ... ఇల్లు తాళం పెట్టి హ్యాండ్ బాగ్‌తో తానూ బయలు దేరుతుంది. ఆ రోజు పత్రికలో వచ్చిన ప్రకటనలలో ఎక్కడెక్కడ కొత్త కొత్త డిస్కౌంట్లు ఉన్నాయో, ఎగ్జిబిషన్స్ ఉన్నాయో చూసుకుని వాటిని సందర్శించడం మొదలు పెడుతుంది. సరైన జోడుంటే మార్కెటింగ్ మజాయే వేరుగా. నీలాంబరి 'షాపింగ్' అనగానే విఠల్ ఆఫీస్‌లో పని ఉందని పరుగులు పెడతాడు. ఎప్పుడన్నా షాప్ వరకు వచ్చినా బండి కూడా దిగడు. 'ఇవాళ కాకపోతే రేపన్నా అవసరం పడవచ్చు కదా! కొని పడేస్తే పోలేదా' అనే ఫిలాసఫీ నీలాంబరిది. ఏ వస్తువైనా కొనకుండా ఎలా నడపాలో ఆలోచించే వాడు విఠల్. చవక అనుకున్నవన్నీ కార్డు అనుమతించిన మేరకు కొనడం, మిత్రబృందంతో తాను సేకరించిన సమాచారాన్ని పంచుకోవడం నీలాంబరికి ఇష్టం.

మర్నాడు, బయటకు వెళుతూ, ఓసారి పక్క గుమ్మంలోకి తొంగి చూసింది నీలాంబరి.

"రండి రండి!" ఆహ్వానించింది మల్లిక.

"హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ పెట్టారు. ఈరోజు అన్నింటిపై 50% డిస్కౌంటట. మీరు కూడా వస్తారేమోనని..." అంది నీలాంబరి.

"సరే, ఒక్క నిముషంలో రెడీ అవుతాను. నాకు డోర్ మాట్స్ వగైరా కావాలి." అంటూ మల్లిక ఇల్లు గబగబా సర్దేసి బయల్దేరింది.

ఎగ్జిబిషన్ చాలా బాగుంది. పెద్ద హాలు. చల్లని వాతావరణం. సన్నటి సంగీతం వినిపిస్తోంది. హాలంతా మహిళలతో కిక్కిరిసి ఉంది. ఆఫీసులలో, సభలలో, పుస్తక ప్రదర్శనలలో ఎండాకాలంలో కృష్ణా నదిలా కనిపించీ కనిపించినట్టు ఉండే మహిళలు, ఇక్కడ మాత్రం సముద్రం ఉప్పొంగినంతగా కనిపిస్తున్నారు. కరోనా లాక్డౌన్ ఎత్తేసిన తరువాతి మొదటి ప్రదర్శన ఇదే. అందువల్ల కూడా ఈ రష్ ఉండి ఉండొచ్చు.

ఇది జాతీయ ప్రదర్శన కాబట్టి చేనేత ప్రధానంగా అభివఅద్ధి చెందిన రాష్ట్రాల నుంచి స్టాల్స్ ఎక్కువగా వచ్చాయి. నీలాంబరి, మల్లిక ఓ రౌండ్ వేసి వచ్చారు. ధరలు చాలా ఎక్కువ అనిపించాయి. చీరలంత ఆకర్షణీయంగా ఉన్నా నాలుగు చీరలకే క్రెడిట్ కార్డు లిమిట్ దాటేటట్టుందని అనిపించింది నీలాంబరికి. మల్లికతో ఆ మాటంటే తన స్థాయి ఎక్కడ తగ్గుతుందో అని, "మీరు డోర్ మాట్స్ చూడండి. తరువాత నా చీరల సంగతి చూద్దాం" అంది. ఇన్ని అందమైన చీరలు ఉన్నా అందుబాట్లో లేనందుకు మల్లికకు కూడా చిరాకుగా ఉంది. 'ఈయన ట్రాన్స్ఫర్ల పుణ్యమాని చేస్తున్న ఉద్యోగం వదులుకోవల్సి వచ్చింది. ఎంతసేపూ పిల్లలు, ఇల్లు. గుడుగుడు గుంచం అంటూ ఇంట్లో పనిచేసుకోవడమే. ఏ పని చేయాలన్నా పని ఇచ్చినవాడి అనువైన టైంలో చేయాలి. కానీ షాపింగ్ అలా కాదు. పొద్దున్నుంచి రాత్రిలోపు మనకు అనువైన టైంలో వెళ్లచ్చు, అదీ ఏ రోజయినా. ఇంటికి కావల్సినవన్నీ సమకూర్చవల్సింది మహిళలే! మగమహారాజులు ఏం చేయాలో నిర్ణయిస్తారు. బడ్జెట్ కేటాయిస్తారు. జీతం బత్తెం లేని కష్టం. ఆఖరికి నచ్చిన చీర కూడా కొనుక్కో లేకపోతున్నాను' దీర్ఘంగా నిట్టూర్చింది మల్లిక.

అలా ఎవరికి వారు ఆలోచించుకుంటూ, ఒకరితో ఒకరు మాట్లాడుతున్నట్టు కనిపిస్తూ, కలిసి నడుస్తున్నారు నీలాంబరి, మల్లిక. ఇంతలో పెడన కలంకారీ షాప్ ముందు డోర్మాట్స్ కనిపించాయి. ఆగారు.

"డోర్ మాట్స్ మెత్తగా ఉంటాయమ్మా చూడండి! బాగా మన్నుతాయి. రంగుకు నాది గ్యారంటీ. ఒకటి కొనండి, ఒకటి ఉచితం. ఈ రోజే స్పెషల్ ఆఫర్"

'నీలాంబరీ, నలుపు మీద ఈ ఎర్రని నెమళ్ళు బాగున్నాయి కదా!"

"అవును అన్నిటికన్నా ఇవే బాగున్నాయి. తీసుకోండి"

ఒకటి కొని, మరొకటి ఉచితంగా పొంది బిల్లు కట్టింది మల్లిక.

తరువాత, బెంగాల్ హ్యాండ్ లూమ్స్లోకి వెళ్లారు. మూగి ఉన్న జనం మధ్య నుంచి తొంగి చూశారు. ఆ డోర్మాట్స్ని కూడా రంగవల్లులంత అందంగా తీర్చిదిద్దారు. మల్లిక బెంగాలీల పనితనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

"ఇవి కలకత్తాలో తయారైన జ్యూట్ హ్యాండ్ మేడ్ డోర్ మాట్స్. బెంగాల్ అంతటిలో మాది అతి పెద్ద మిల్. అందుకే చాలా తక్కువ రేటుకు ఇస్తున్నాం." దుకాణదారు వివరిస్తుంటే– వాటి అందానికి ముగ్ధురాలై ఒకటి తీసుకుంది.

తరువాత కాశ్మీరీ స్టాల్లో కళాత్మకంగా తీర్చిదిద్దబడిన డోర్మాట్ డ్రాయింగ్ రూమ్లో బాగుంటుందని తీసుకుంది. యుపి స్టాల్లో తాళ్లతో తయారు చేసిన మాట్స్ వేళ్లాడదీశారు. "కేవలం ఆరు రంగుల కలయికతో తాళ్లు ఎంత అందంగా కలిపారు!" ఇద్దరికీ నచ్చాయి. చవకగా అనిపించాయి. "బాత్ రూంల దగ్గర డోర్ మాట్స్ ఇట్టే పాడై పోతుంటాయి. ఇవి వేసేయవచ్చని" ఓ అర డజను తీసుకుంది. ఒడిశా, రాజస్థాన్ మాట్స్ కూడా చాలా అందంగా ఆకర్షించాయి కానీ, రంగారావు ముఖం గుర్తొచ్చి ఊరుకుంది.

తరువాతి రోజు గ్రోసరీకి వాల్మార్ట్ కార్డు ఉందని కలిసి వెళ్లారు. అదంతా హెూల్ సేల్. అయిదు కిలోల బ్యాగులు. పది కిలోల బ్యాగులు. బ్యాగులకు కూడా ధర కట్టాలి. సరే వచ్చాము కదా! వచ్చేనెలకైనా కావలసినవే కదా అని మూడు నెలల సరుకులు కొనింది. జీడిపప్పు కిలో బ్యాగ్ ఉంది. నూనె అయిదు లీటర్లు. ఇలా కొన్నవి వేసుకుంటే ఇద్దరూ రెండు ఆటోల్లో ఇల్లు చేరారు. ఇంటికి వచ్చేసరికి నీరసం ముంచుకొచ్చింది.

నాలుగు రోజుల్లో పండగ బట్టలకు సౌత్ ఇండియా హ్యాపీ మాల్లో 60% డిస్కౌంట్. మాల్ నిండా గుట్టలు గుట్టల బట్టలు. తూకం వేస్తున్న సేల్స్మాన్లు. జనం గుంపులు గుంపులుగా తూకం వేసేవాళ్ళ మీదకు ఎగబాకుతున్నారు. మాల్ ఏసీ అయినా చెమటలు కారిపోతున్నాయి. నీలాంబరి

సహాయంతో చీరలు ఎంపిక చేసుకుంది మల్లిక. కాళ్ళు లాగడం మొదలైంది. కష్టపడి షాప్ గుమ్మం దాటి ఆటో ఎక్కి ఊపిరి పీల్చుకున్నారు. ఇంటికొచ్చి ఫ్రిజ్‌లో నీళ్లు తాగితే గాని మనిషి కాలేదు మల్లిక.

ఓ రోజు ఇంద్రానగర్‌లో కొత్త బెడ్‌షీట్స్ నార్త్ ఇండియా వారి చేనేతలు... డైనింగ్ టేబుల్ మీద ఉన్న పాంఫ్లెట్ వైపు ఓరగా చూశాడు రంగారావు. ఇదివరకు మల్లికకు ఇంత ఆసక్తికరంగా షాపింగ్ చేయడం అలవాటు లేదు. నీలాంబరితో కబుర్లు,కలిసి తిరగడం, షాపింగ్ ... ఒక గుడుగుడు గుంచం బతుకు నుంచి తప్పించుకోడానికి అలవాటయింది.

ఓ రోజు రంగారావు అడిగాడు.

"మల్లీ, ఏమిటీ మధ్య తెగ షాపింగ్ చేస్తున్నావు? క్రెడిట్ కార్డు బిల్ చూస్తున్నావా?"

ఆ ప్రశ్నకి మల్లికి కోపం ముంచుకొచ్చింది.

"నేనేం నగలు కొనుక్కోడం లేదు లెండి. ఇంటికి కావలిసినవేగా కొంటున్నది. ఈ మాత్రం ఇల్లు డీసెంట్‌గా ఉండొద్దు?!" నిష్ఠూరంగా అంది. "మీ పిసినారితనం గాని, విఠల్ గారిని చూడండి. నీలాంబరిని ఎంత చక్కగా సపోర్ట్ చేస్తారో" అంది. రంగారావు మారు మాట్లాడలేదు.

రెండు నెలలు గడిచాయి. క్రెడిట్ కార్డు బిల్ జోరు తగ్గింది. హమ్మయ్య అనుకుంటూ, రాత్రి పడుకోబోయే ముందు, "మల్లీ, ఈ మధ్య ఎవరూ డిస్కౌంట్లు ఆఫర్ చేయడం లేదా ఏం?" అన్నాడు రంగారావు నవ్వుతూ.

"కరోనా కాలంలో మంగని మాన్పించినందుకు నీలాంబరికి నలభై వేలు మిగిలాయట. మొన్న నమిత జ్యూయలర్స్ వాళు ఓ కరపత్రం ఇచ్చారు. అందులో, నలభై వేలు డిపాజిట్ చేసి ఆరునెలల్లో మరో నలభై వేలు కడితే ఏడాది తరువాత తరుగూ, తయారీ ఖర్చులు లేకుండా లక్ష రుపాయల నెక్లెస్ ఇస్తారట. అందుకే మంగని మాన్పించేసింది నీలాంబరి. నేను కూడా సేవింగ్ మొదలు పెడదామని, షాపింగ్ తగ్గించడం మాత్రమే కాదు, మంగ పని కూడా నేనే చేసుకోవాలను కుంటున్నాను." అంది మల్లిక.

"మరీ అంత పొదుపు చేయాలా? ఒక్కర్తివి అన్ని పనులూ చేసుకోవడం కష్టం కదూ! మంగ సహాయం తీసుకో. నేను నీకు సహాయపడాలనుకున్నా కుదరకపోవచ్చు." ముందు జాగ్రత్త పడ్డాడు రంగారావు. పని మనిషిని మాన్పించవద్దన్నందుకు మురిసిపోయింది మల్లిక.

♦ ♦ ♦

మర్నాడు లంచ్ అవర్లో ఎల్ఐసి ఆఫీసులో విఠల్‌ని కలిసాడు రంగారావు.

"థ్యాంక్స్ బ్రదర్! మన ప్లాన్ వర్కౌట్ అయినట్టుంది" అన్నాడు నవ్వుతూ.

"యా బ్రో! నువ్విచ్చిన కరపత్రం మ్యాజిక్ చేసిందనుకో.

నీకు చాలా థ్యాంక్స్! నీ ప్లాన్ వలనే నేను కూడా బయట పడ్డాను." అన్నాడు విఠల్.

"అసలింతకీ నమిత జ్యూయలర్స్ ఇటువంటి పాంఫ్లెట్ ఇవ్వలేదన్న విషయం నీలాంబరికి తన సర్వేలో ఎప్పుడైనా బయట పడొచ్చు. అంతవరకు మనం సేఫ్. అప్పుడేం చేయాలో ఆలోచిద్దాం. లేకపోతే క్రెడిట్ కార్డు బిల్ పే చేసి చేసి మనం కూడా డెబిట్‌లో పడేవాళ్ళం."

"నిజాలు దాచే ఈ డిస్కౌంట్లు పాపం గఅహిణులను వలవేసి లాగేస్తాయి. మనం నిజాలు చెప్పి ఒప్పించలేము. అసలే మార్కెట్ మాయాజాలం దానికి తోడుగా ఈ కార్డులు సఅష్టించే కల్లోలాలొకటి. ఇంతింతై పెరుగుతూ పోతాయి. ఎక్కడ తేలతామో మనకే తెలియదు. మార్కెట్ తళుకు బెళుకుల ఆకర్షణల్లో ఆలోచనలకన్నా ఎమోషన్స్ ఎక్కువ ప్లే చేస్తాయి కదా! వాళ్లు ఎక్కువగా గాలం వేసేది మహిళలకే. ఆడవాళ్లు పనిచేయాలనుకుంటే వసతులు లేవు. షాపింగ్‌కి మాత్రం అన్ని వసతులూ ఉంటాయి. పిల్లలను ఎంగేజ్ చేయడానికి సదుపాయాలుంటాయి. ఆఫీసులలో మాత్రం అలాంటివి కనిపించవు. మహిళల మీద పని ఒత్తిడి రోజు రోజుకి పెరుగుతూ ఉంటుంది. మార్కెట్లు మాత్రం సేదదీర్చేటట్టు కనిపిస్తాయి. ఈ వ్యవస్థ మహిళలను సమాజం పనిలో భాగస్వాములు చేయడం కన్నా ... వినియోగదారులుగా, కొనుగోలుదారుగా ఉంచటానికే ఎక్కువ తాపత్రయపడతాయి. పాపం... ఎంతసేపని, ఎన్ని రోజులని లాక్డౌన్‌లో ఉంటారు. మనకి ఆరునెలలే కష్టం అనిపించింది. వాళ్ళకి ఎప్పుడూ లాక్ డౌనే కదా! ... ఎనీవే , హావె గుడ్ డే! బై!" అన్నాడు రంగారావు.

■

# కవితలు



## గాలిని శాసించలేవు

**- షేక్ అహమద్ బాష**

**గా**లిని శాసించలేవు, నీ పిడికిలిలో బిగించలేవు,
గాలిని జైలు గోడల మధ్య బంధించలేవు
ఒకవేళ నీ ఊపిరిని బిగబెట్టి బంధించాలని ప్రయత్నిస్తే
ఆ గాలే నిన్ను శాసించి నిన్ను విగతజీవుడిని చేసేయవచ్చు.

నీ వనంలో అనేక రంగులమయమైన పూలనన్నింటినీ
ఒకే రంగు పుష్పాలుగా మార్చే ప్రయత్నం చేయకు
నీకు తెలియదా, ఒక్కో రంగులోనే ఎన్నెన్ని ఛాయలుంటాయో

ఎన్ని రంగుల గులాబీలు
ఎన్నిరంగుల మందారాలు
ఎన్నెన్ని సువాసనలు
నీ ప్రయత్నం వనాన్ని మసిచేసి మాడ్చేయవచ్చు

ఉవ్వెత్తున ఎగిరే సముద్రపు తరంగాలను
శాసించే ప్రయత్నం చేయకు
తరంగాలను ఆపేందుకు నువ్వు
ఎన్ని అడ్డంకులు సృష్టించినా
నీ కపట, అమానుషత్వ మంత్రదండంతో నువ్వు,
నీ సహచరులు అడ్డుగా నిలిచినా
ఆ సముద్రం సృష్టించే సునామీలో
మీరు, మీ శాసనాలు కొట్టుకునిపోయి
మీ చిరునామా గల్లంతు కావొచ్చు!

## సౌరభాల సాయంత్రం ...

**వి**సిరిన పెంకును చూసి
నీళ్లు కప్పగంతులు వేస్తుంటే
పక్కనే వున్న పచ్చగడ్డి పక్కుమంది!
టపటపమని పడుతున్న
కానుగ పూలతో
చప్పుడు చేయొద్దు అంటోంది
విరబూసిన వేపపూత
మబ్బు పట్టిన మనసును కూడా
మరులు గొలిపే గుండు మల్లె
గుండెలున్నంతగా విచ్చుకుంది
ఈ సౌరభాల సాయంత్రం
పోగేసుకున్న అనుభూతుల సాక్షిగా
పరిమళించింది!

**- కళ్యాణదుర్గం స్వర్ణలత**
**98486 26114**



## కవితా దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం

ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 21వ తేదీ సాయంత్రం సాహితీ స్రవంతి, కాకినాడ శాఖ, పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా కవిసమ్మేళనం నిర్వహించాయి. సభకు అధ్యక్షులుగా ప్రముఖ కవి, తెలుగు శాఖాధిపతి సుంకర గోపాలయ్య, ముఖ్య అతిథులుగా హిందీ శాఖాధిపతి హరిరామ్ ప్రసాద్, సాహితీవేత్త గనారా, ఆత్మీయ అతిథిగా సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి హాజరయ్యారు. ముందుగా ఇటీవల మృతి చెందిన ప్రముఖ పద్యకవి మద్దా సత్యనారాయణకు నివాళులు అర్పించారు. అనంతరం గోపాలయ్య మాట్లాడుతూ "కవిత్వం యొక్క ఆవశ్యకతను గుర్తించి 1999లో యునెస్కో ప్రతి సంవత్సరం మార్చి 21వ తేదీని అంతర్జాతీయ కవితా దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించిందని చెప్పారు. చైతన్యవంతమైన ప్రగతిశీల కవిత్వం ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసి సామాజిక మార్పుకి దోహదపడుతుందని ప్రముఖ కవి గనారా అన్నారు. మార్ని జానకిరామ చౌదరి "సమాజంలో జరుగుతున్న అనేక పరిణామాలకు నిజాయితీగా స్పందించి సంఘటనాత్మక కవిత్వాన్ని అందించాల్సిన బాధ్యత కవులపై ఉందని అన్నారు.

అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవులు గౌరినాయుడు, దుర్గాప్రసాద్, ఇబ్రహీం, తంత్రవహి శ్రీరామ్, డా.శిరీష, పద్మావతి, ఇందిర, అద్దేపల్లి జ్యోతి, మేడిశెట్టి శ్రీరాములు, ఉండవిల్లి, విష్ణు, వెంకట్, ప్రభు తదితరులతో పాటు కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ కవితల్ని వినిపించారు. వీటిలో ఎంపికచేసిన ఉత్తమ కవితలకు నిర్వాహకులు బహుమతులు అందజేసారు.

## కదిరి సంస్కృతికిపై వ్యాస రచన



**అ**నంతపురం జిల్లా కదిరి అభివృద్ధి వేదిక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల 'కదిరి సంస్కృతి సంప్రదాయాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించింది. ఈ పోటీలో సుధీర్ నాయక్, రవితేజ నాయక్, దేవకీ భాయ్ వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. బహుమతి ప్రదాన సభకు ఆంగ్ల ఉపన్యాసకులు మోహన్ బాబు అధ్యక్షత వహించారు. తెలుగు ఉపన్యాసకులు చౌడం ఆదినారాయణ మాట్లాడుతూ, కదిరి సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు చాలా చక్కగా వివరించారని అన్నారు. కదిరిలో మత సామరస్యం, కదిరి మల్లెలు, కదిరి పున్నమి పండుగ, రథోత్సవం సందర్భంలో మరువం ఉపయోగించడం, గిరిజనుల ఆటపాటలు, పల్లెల్లో జరిగే పీర్ల పండుగలో అన్ని కులాలు, మతాల వారు పాల్గొనడం... గురించి విద్యార్థులు తమ అవగాహన మేరకు రాశారని వివరించారు. కదిరి అభివృద్ధి వేదిక కన్వీనర్, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి మాట్లాడుతూ, ఏ సంస్కృతి కాదొక స్థిర బిందువు అది నదీజలాల అంతఃసింధువు' అని తిలక్ అన్నారని, సంస్కృతి సంప్రదాయాలు కాలానుగుణంగా మారుతూ ఉంటాయని అన్నారు. ముఖ్య అతిథి, కళాశాల ప్రిన్సిపాల్ స్మిత మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెవి రమణ, శ్రీదేవి, ఆదినారాయణ, శ్రీనివాసులు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

■ **ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు–2020కు పల్లిపట్టు నాగరాజు కవిత్వం 'యాలై పూడ్సింది' ఎంపికైంది. న్యాయనిర్ణేతలుగా గంటేడ గౌరునాయుడు, డా.కోయి కోటేశ్వరరావు, డా.మాదాసు వినోదిని వ్యవహరించారు. ఈ అవార్డు ప్రదానం ఏప్రిల్ 25న అనంతపురంలో జరుగుతుందని డా.ఉమ్మడిశెట్టి రాధేయ తెలిపారు.**

## మనం గర్వించదగ్గ పరిశోధకుడు



నివాళ్లు అర్పిస్తున్న సురవరం సుధాకరరెడ్డి తదితరులు

ఆంధ్రుల సాంఘిక చరిత్రను లిఖించి తెలుగు సాహిత్య చరిత్రను వేలుపట్టి నడిపిన ధీరోదాత్తుడు సురవరం ప్రతాపరెడ్డి అని సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి అన్నారు. కర్నూలులో మార్చి 21న తెలుగు జాతి వైతాళికుడు సరవరం ప్రతాపరెడ్డి 125వ జయంతి ఉత్సవాలు లలిత కళాసమితిలో ఘనంగా జరిగాయి. సాహిత్య, సాంస్కృతిక సంఘాల అధ్యక్షులు గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి సభాధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు ప్రతాపరెడ్డి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక తరం ప్రతాపరెడ్డి రచనలపై పరిశోధనలు చేయాల్సిన అవసరముందన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ సాహిత్యరంగంలో సురవరం రచనలు అనేక మార్పులు తీసుకొచ్చాయన్నారు. ఇంకా నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, డా.రామచంద్రనాయుడు, ఆచార్య దండెబోయిన పార్వతి మాట్లాడారు. ఉత్సవాల కమిటీ కన్వీనర్ కెంగార మోహన్ మాట్లాడుతూ తెలుగు భాషలో దాదాపు 600 పదాలను పరిశోధించి సేకరించి నిఘంటువుకందించారన్నారు. ఆయన రాసిన పాఠాలు నేర్చుకుని ఇంతటి వారమయ్యామని ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ అన్నారు. జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ ఆయన సాహిత్యం తెలుగులో అనూహ్య మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా, పిఎన్ఎం నాయకులు ఎంపి బసవరాజు, సాహితీ స్రవంతి నగర కార్యదర్శి పెరికల రంగస్వామి అభ్యుదయ గీతాలు ఆలాపించారు.

## ముంజులూరి కృష్ణకుమారికి మంచిపల్లి పురస్కారం



ప్రముఖ బాలసాహితీ వేత్త ముంజులూరి కృష్ణ కుమారికి మంచి పల్లి సత్యవతి స్మారక ఉగాది పురస్కారం లభించింది. పార్వతీ పురంలోని సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థ సంయుక్తంగా ప్రతి ఏటా ఇచ్చే మంచిపల్లి సత్యవతి స్మారక ఉగాది బాల సాహిత్య పురస్కారం 2021 సంవత్సరంగాను కృష్ణకుమారికి ప్రకటించారు. ఈ పురస్కారం కింద రూ.6000 నగదుతో పాటు బాల సాహితీ భూషణ్ బిరుదు ప్రదానం చేస్తారు. 1956లో జన్మించిన కృష్ణకుమారి ఎయు నుంచి అర్థశాస్త్రంలో పీజీ పట్టా పొందారు. బాలల కోసం పది నవలలు రాశారు. ఆకాశవాణి విశాఖపట్నంలో చిలక పలుకులు కార్యక్రమం రూపొందించారు. ఆంధ్రప్రభలో చిన్నారి శీర్షిక ఆరేళ్ల పాటు నిర్వహించారు. అనేక అనువాద రచనలు చేశారు. గతంలో నన్నపనేని మంగాదేవి బాల సాహిత్యపురస్కారం, తానా బహుమతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురస్కారం అందుకున్నారు. వీరు ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్‌గా 2016లో ఉద్యోగ విరమణ చేశారు.

## డా. పుట్ల హేమలత స్మారక పురస్కారం

రచయిత్రి డా. పుట్ల హేమలత పేరు మీద ఆమె కుటుంబం 2020 నుంచి మార్చి 26న ఆమె జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న స్త్రీలకు స్మారక పురస్కారాలు అందచేస్తోంది. గత సంవత్సరం ప్రముఖ సామాజిక వేత్త హేతువాద లక్ష్మి, తొలి గిరిజన కోయ రచయిత్రి పద్దమ్ అనసూయ, యువ రచయిత్రులు నస్రీన్ ఖాన్, కొమ్ము రజితలకు ఈ పురస్కారం ఇవ్వడం జరిగింది. 2021 సంవత్సరానికి రచయిత్రి, అధ్యాపకురాలు డా.తాళ్ళపల్లి యాకమ్మ, సీనియర్ పాత్రికేయురాలు, కాలమిస్ట్ నేలపూడి సమీరలకు డా. పుట్ల హేమలత స్మారక పురస్కారం అందించారు.



డాక్టర్ పుట్ల హేమలత స్మారక పురస్కారం పొందిన డా.తాళ్ళపల్లి యాకమ్మ, జర్నలిస్టు నేలపూడి సమీర

# సాహితీ సమాచారం

## సింగమనేని స్మారక కథల పోటీ

ప్రసిద్ధ కథకులుగా, విమర్శకులుగా, ఉపన్యాసకులుగా, సంపాదకులుగా సింగమనేని నారాయణ నమ్మిన ఆశయాల కోసం జీవితాంతం నిబద్ధతగా నిలబడ్డారు. రాయలసీమ ప్రాంత సామాజిక, సాహిత్య వికాసానికి కఋషి చేశారు. సీమ ప్రాంతీయ నిర్దిష్ట జీవితాన్ని, భాషను తన కథల్లో చిత్రీకరించారు. ఆయన్ని ఇటీవల కోల్పోవడం సీమ సాహిత్యానికి తీరనిలోటు. ఈ నేపథ్యంలో రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం పక్షాన రాయలసీమ కథల పోటీలను నిర్వహించి, వారి స్ఫూర్తిని కొనసాగించాలని భావిస్తున్నాం. రాయలసీమ నిర్దిష్ట జీవనగతులు ఇతివృత్తంగా కొత్తగా రాసిన కథలను మే 31, 2021లోగా దిగువ చిరునామాకు పంపాలి. ఎంపికైన మొత్తం పదివేల రూపాయల బహుమతులను అందచేస్తాము. రచనలు చేరాల్సిన చిరునామా : వై.శైలజ, 13-2-7, ఆంధ్ర ప్రగతి బ్యాంక్ పక్క వీధి, రామచంద్రనగర్, అనంతపురం, పిన్ : 515001. seemakathalu@gmail.com

**- డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సమన్వయకర్త, 99639 17187**

## పురిమళ్ల ఫౌండేషన్ రచనల పోటీ

**2021**వ సంవత్సరానికి గాను 'పురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ' సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహించనున్నారు. 'పురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి 3000, ద్వితీయ బహుమతి 2000, తృతీయ బహుమతి 1000లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 500 చొప్పన అందిస్తారు. 'పురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలో ప్రథమ బహుమతి 2000, ద్వితీయ బహుమతి 1500, తృతీయ బహుమతి 1000 లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 500 చొప్పన ఉంటాయి. వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నవారిలో ఒకరికి 'భోగోజు పురుషోత్తం - సముద్రమ్మ' గార్ల సాహితీ పురస్కారం అందజేయబడుతుంది. కథలు, కవితలు పంపటానికి చివరి తేది : 30 ఏప్రిల్ 2021. పంపాల్సిన చిరునామా : భోగోజు ఉపేందర్‌రావు, ఇ.నెం. 11-10-694/5, బురహాన్‌పురం, ఖమ్మం - 507001. సెల్ : 94947 73969

### ఏప్రిల్ 18న 'సింగమనేని' సాహితీ సదస్సు

**ప్రముఖ సాహితీవేత్త సింగమనేని నారాయణ సంస్మరణ సదస్సును ఏప్రిల్ 18వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్నారు. సాహితీ స్రవంతి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సింగమనేని సంస్మరణ సభలో ఈ మేరకు నిర్ణయించారు.**

## సోమనాథ కళాపీఠం పురస్కారాలకు ప్రతిపాదనల ఆహ్వానం

**మ**హాకవి పాలకురికి సోమనాథుని జన్మస్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని 'సోమనాథ కళా పీఠం' 2021 సంవత్సరానికి గాను ద్వైవార్షిక పురస్కారాలకు దేశ వ్యాప్తంగా సాహితీవేత్తల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నాం. పాలకురికి సోమనాథుని జీవిత సాహిత్యాలపై గణనీయమైన పరిశోధన చేసిన వారు, ఆయన ఆలోచనా ధారను ప్రచారం చేసిన వారు 'సోమనాథ సాహిత్య పురస్కారం', సోమనాథుని భావజాలాన్ని ప్రధానంగా తీసుకొని కఋషి చేసిన వారు 'సోమనాథ సామాజిక శోధన పురస్కారం', నాటక రంగంలో సాధన చేసిన వారు 'సోమనాథ రంగస్థల పురస్కారం', తెలుగు భాషా సాహిత్యాలకు సేవ చేసిన వారు 'పందిళ్ల శేఖర్ బాబు రాజయ్య శాస్త్రి స్మారక స్వచ్ఛంద భాషా సేవ పురస్కారం', సాహిత్య రసాస్వాదనకు కృషి చేస్తున్న కోవిదులు 'విచలపతిరావు స్మారక సాహిత్య పురస్కారం', సాహిత్య కళా రంగంలో ప్రతిభామూర్తులు 'దేవగిరి రాజయ్య స్మారక బిరుదు' కొరకు పూర్తి సమాచారంతో 'డాక్టర్ రాపోలు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు, సోమనాథ కళాపీఠం, పాలకుర్తి - 506146, జనగామ జిల్లా, తెలంగాణ, ఫోన్: 9440163211' చిరునామాకు 30 ఏప్రిల్ 2021 నాటికి చేరునట్లు తమ ప్రతిపాదనలను పంపాల్సిందిగా కోరుతున్నాం.

**- రాపోలు శోభరాణి,**
**అధ్యక్షురాలు**


# స్వీకారం



## నోముల సాహిత్య ముచ్చట్లు

**సంపాదకుడు : పెన్నా శివ రామకృష్ణ**
**వెల : రూ.100 పేజీలు : 140**
**ప్రతులకు : 85230 56256**

**బ**హు భాషావేత్త, చింతనాశీలి, మా గురువర్యులు డాక్టర్ నోముల సత్యనారాయణ.. అనేక కారణాల వల్ల ఎక్కువ రచనలు చేయలేదు. 'నోముల సార్ అన్‌టోల్డ్ లెసన్స్' పుస్తకం చదివాక నోముల వారి ముచ్చట్లను రికార్డు చేసి, అచ్చు వేయాలనిపించింది. వారిని ఒప్పించి, ఈ ముచ్చట్లను 2015లో రికార్డు చేశాను. ప్రతి సిట్టింగులోనూ ఏకాంశానికి పరిమితమై నేనడిగిన కొన్ని ప్రశ్నలకు వారిచ్చిన సమాధానాలు ఇవి. **- రచయిత**



## ఒక గురువు గారు - నలుగురు శిష్యులు

**సంకలనం : చీకోలు సుందరయ్య**
**వెల : 268 పేజీలు: 160**
**ప్రతులకు : 90300 00696**

**ఇ**ది ఒక రకంగా .. ఒక గురువు తన శిష్యుల్లోని నలుగురితో తన అనుబంధాన్ని చెప్పడంగా, ఆ నలుగురి సాహిత్య నేపథ్యాన్ని, క్రమవికాసాన్ని అంచనా వేయడంగా, ఆ నలుగురూ గురువుతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకోవడంగా ఈ పుస్తకం కనిపిస్తుంది. ఏ భాషలోనూ ఇలాంటి ప్రయత్నం జరిగి ఉండకపోవొచ్చు. ఏ విధంగా చూసినా ఇది అపూర్వ ప్రయోగమే!

**- పెన్నా శివరామకృష్ణ**



**ఆధునిక భారత తొలి ముస్లిం**

## ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్

**రచన : సయ్యద్ నశీర్ అహమ్మద్**
**వెల : 50 పేజీలు: 72**
**ప్రతులకు : 94402 41727**

**భా**రత తొలి ఆధునిక ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో పొందుపర్చారు. ఆమె వ్యక్తిగత జీవితంతో పాటు ఆమె చేసిన సామాజిక సేవను, ఆ సేవ వెనకున్న ధైర్యాన్ని, ఔదార్యాన్ని మనమీ పుస్తకంలో చూడొచ్చు. ఫాతిమా షేక్, సావిత్రీబాయితో కలిసి చదువుకోవడం, ఉపాధ్యాయ శిక్షణ పొందడం వారి పట్టుదలకు, సేవా నిబద్ధతకు నిదర్శనం.


**- డాక్టర్ వినోదిని మాదాసు**



## అన్నదాతా .. రైతన్నా! (పాటలు)

**సంకలనం**
**వెల : అమూల్యం పేజీలు: 226**
**ప్రతులకు : 96769 57000**

**ఇ**ది ఒక రైతు పాటల సంకలనం. రైతు ప్రాధాన్యాన్ని, వ్యవసాయపు ఆటుపోట్లను వివరిస్తూ వివిధ రచయితల చేత రాయించి ఈ సంకలనం తెచ్చారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివెల్యూషన్ సంస్థ దీనిని ప్రచురించింది. ఇందులో దాదాపు 200 మంది రాసిన 200 పాటలు ఉన్నాయి. యువతీ యువకుల్లో ప్రేరణ కలిగించటం కోసం ఈ పాటల పోటీని నిర్వహించి, ఈ సంకలనాన్ని వెలువరించినట్టు సిజిఆర్ పేర్కొంది.



## బహుశా ...

కవిత్వం

**రచన : వేణుగోపాల్**
**వెల : 120 పేజీలు : 118**
**ప్రతులకు : 99123 95420**

**ఈ** సంపుటికి కవి బహుశా అని పేరు పెట్టుకున్నాడు. బహుశా జీవితం తనకిట్లా అర్థమైందని చెప్పటానికి ఈ శబ్దాన్ని ఎంచుకొని ఉంటాడు. అయితే, ఈ సంపుటిలోని చాలా కవితలు నిశ్చయార్థకాలు. వాటిలో కొన్ని తీర్చిదిద్దబడ్డ తీర్మానాల్లా ఉంటాయి. తన భావనల ద్వారా, శైలీ విన్యాసాల ద్వారా పాఠకుడిలో కొత్త ఊహల్నీ, చింతననూ రేకెత్తించేలా వేణుగోపాల్ కవితల్ని సృజించాడు. కవిత్వం పట్ల ఆయనకున్న గాఢానురక్తిని ఈ 'బహుశా' స్ఫుటంగా వ్యక్తపరుస్తున్నది.

**- దర్భశయనం శ్రీనివాసాచార్య**



## తెమ్మెర కవిత్వం


**రచన : సుధామ**
**వెల : 70 పేజీలు: 98**
**ప్రతులకు : 98482 76929**

**ఈ** కవి అర్ధ శతాబ్దానికి పైగా సాహితీ క్షేత్రాన్ని వివిధ ప్రక్రియల ద్వారా సుసంపన్నం చేస్తున్న కృషీవలుడు. స్నేహశీలి, సౌజన్యమూర్తి. సహోద్యోగులుగా మేము ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కలిసి పనిచేశాం. 'తెమ్మెర' అంటే నిఘంటువు గాలి అని అర్థం చెబుతుంది. ఈ తెమ్మెర తాను మసలిన తావులన్నింటి సౌరభాలను అలదుకొని మనలను స్పృశించి ఆత్మీయంగా పలకరించి అంతర్నేత్రాన్ని తెరచి ఆత్మోన్ముఖులను కమ్ముంటోంది.

**- ప్రసన్న**

# స్వీకారం

## కాలం వెంట కలం




**రచన : సుధామ**

**వెల : 300 పేజీలు : 440**

**ప్రతులకు : 98482 76929**

**ఈ** పుస్తకం వర్తమాన సాహిత్య చరిత్రకు ఒక విలువైన చేర్పు. ఒక ప్రతిభామూర్తి పంచుతున్న ఆలోచనామృతధార. ఇది కచ్చితంగా తెలుగు సాహిత్య దీప్తికి ఒక ఆకర గ్రంథం. అనేకమంది మహనీయుల గురించి, వారి విజయ సాధన గురించి, సాహితీ లోకాన వారు ప్రసరించిన వెలుగుల గురించి ఈ వ్యాసాల్లో వివరించారు. సుధామ వ్యాసరచనా శిల్పం ఒక విలక్షణతో కూడి ఉంది.

**- విహారి**

## పద్యాల రావిచెట్టు బంగారమే!



**రచన : డా. రామమడుగు వేంకటేశ్వర శర్మ**

**వెల : 50 పేజీలు : 60**

**ప్రతులకు : 92475 81825**

**ప్ర**ముఖ కవి, రచయిత రావి రంగారావు మినీ కవిత్వాన్ని విస్తృతంగా వెలువరించటమే కాదు; పద్య ప్రక్రియలోనూ కృషి చేశారు. ఆ పద్యాల్లోని చెట్ల సంబంధ ప్రస్తావనను వివరించిన చిన్ని పుస్తకం ఇది. రావి వారికీ, చెట్టుకూ ఉన్న అవినాభావ బంధాన్ని వివరించే పని ఈ పుస్తకంలో రచయిత చేశారు. 1979లో ముద్రించిన రంగారావు గారి పద్యసంపుటి 'అమృతవృక్షము.' దానినే 41 శీర్షికలతో 2005లో 'అమృతం చెట్టు' పేరిట విస్తరించి, పునర్ముద్రించారు.

## నేను ముంబైకర్ ని



**రచన : సంగెవేని రవీంద్ర**

**వెల : 100 పేజీలు: 56**

**ప్రతులకు : 099871 45310**

**ఈ** కవి బాల్యంలోనే ముంబైకి వలస వెళ్లిన తెలంగాణా బిడ్డ. జీవన సంవేదనతో కూడిన కవిత్వాన్ని ఇప్పటికే ఎంతో పండించాడు. 16 పుస్తకాలు రచించాడు. 'నేను ముంబైకర్‌ని' దీర్ఘ కవిత. దీనిలో వలస కార్మికుల వేదనతో పాటు వారు ముంబై నిర్మాణంలో అందించిన యోగదానం కూడా ఉంది. కష్టాలూ కడగండ్లే కాదు; చేతికందిన పూల చెండ్లు కూడా ఉన్నాయి. ఈ కావ్యంలో రెండు తరాల అనుభవాల స్పందనలు తెలుస్తాయి.

**- డా. ఎన్ గోపి**

## కర్రోడు త్రిశూలం పట్టిన కథ



**రచన : డా. కుం.వీరభద్రప్ప**

**వెల : 120 పేజీలు : 184**

**ప్రతులకు : 040 27678430**

**ఈ** రచయిత సహజంగానే మార్క్సిస్టు రచయితగా రూపొందారు. దేశంలోని ఎమర్జన్సీని ఎలుగెత్తి వ్యతిరేకించాడాయన. కుం.వి పుట్టిన బళ్లారి కర్నాటకలో చేరినప్పటికీ అక్కడ ఇప్పటికీ తెలుగు భాష గుబాళిస్తూనే ఉంది. ఆయన తెలుగు కన్నడ ప్రాంతాల ప్రజాజీవితాన్ని తన మాతృభాష కన్నడలో సాహిత్యీకరించారు. ఆయన రాసిన కథల్లోంచి రంగనాథ రామచంద్రరావు తెలుగులోకి అనువదించిన 12 కథలతో ఈ సంపుటి వెలువడింది.

**- మధురాంతకం నరేంద్ర**

## కరోనా లాక్‌డౌన్.360



**రచన : కోడం పవన్ కుమార్**

**వెల : 150 పేజీలు : 294**

**ప్రతులకు : 98489 92825**

**లాక్‌డౌన్**, లాక్‌డౌన్ సడలింపు కాలంలో అప్పటి పరిస్థితులు, జరిగిన పరిణామాలు, అనుభవాలు దృష్టిలో పెట్టుకొని రాసిన అనుభవాలివి. కోవిడ్ 19 బతుకుల్ని అతలాకుతలం చేసింది. దాని ప్రభావం మన మీద పలు విధాల పడింది. ఈ పుస్తకంలోని వ్యాసాల సమాహారంలో ఆ ప్రభావపు ఛాయలు, వైవిధ్యం ఉన్నాయి. అన్ని రంగాలపై, సమస్త జీవన పార్శ్వాలపై కోవిడ్ ప్రభవాన్ని లోచూపుతో, సామాజిక అధ్యయనకారుడికి ఉండే సమగ్ర దృష్టితో విశ్లేషించారు పవన్ కుమార్.

**- ఆడెపు లక్ష్మీపతి**

## కాటమరాజు కథలు



**రచన : ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు**

**వెల : 400 పేజీలు : 340**

**ప్రతులకు : 99454 22742**

**తెలుగు** వీరగాధా సంపదలో పల్నాటి వీరగాధల తరువాత పేర్కొనదగినవి కాటమరాజు కథలు. ఇవి చారిత్రక వీరగాథలు. ఇవి 12 –13 శతాబ్దాల్లో జరిగిన సంఘటనలు. ఇవి 32 కథలని తెలుస్తోంది. నేను సేకరించిన 19 ప్రధాన కథలను, 6 అనుబంధ కథలను కలిపి అప్పటి ఆంధ్రప్రదేశ్ అకాడెమీ రెండు సంపుటాలుగా ప్రచురించింది. తాజా సంపుటిలోని వీరగాథలు 1966లోనే సేకరించాను.

**- ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు**

# వ్లాదిమీర్ మయకోవస్కీ

(19-07-1893 - 14-04-1930)



ప్రసిద్ధ రష్యన్‌కవి. మొదట్లో ఫ్యూచరిస్ట్ కవితలు రాశాడు. తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి విప్లవ కవితలు రాశాడు. ఆయన లెనిన్ మీద రాసిన పెద్ద కావ్యాన్ని (1924) శ్రీశ్రీ అనువదించాడు. "కమ్యూనిజం వినా నాకు హృదయం లేదన్నాడు" మయకోవస్కీ


SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 2 ▪ SANCHIKA - 7 ▪ KRISHNA ▪ April 2021
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.3.2021


# సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురణలు


రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా వ్యవసాయ రంగంలో, ఆర్థిక, సామాజిక రంగాలలో మార్పులు గురించి నిపుణులతో సర్వే చేయించి ప్రచురించిన గ్రంథాలు.


పేజీలు : 272 వెల : 150/-



పేజీలు : 384 వెల : 250/-



పేజీలు : 304 వెల : 150/-



పేజీలు : 248 వెల : 100/-


పేజీలు : 80 వెల : 40/-



పేజీలు : 134 వెల : 40/-


పేజీలు : 84 వెల : 30/-



పేజీలు : 200 వెల : 150/-



పేజీలు : 240 వెల : 100/-



పేజీలు : 64 వెల : 30/-


పేజీలు : 32 వెల : 15/-


పేజీలు : 36 వెల : 15/-


పేజీలు : 32 వెల : 15/-


పేజీలు : 40 వెల : 20/-


పేజీలు : 272 వెల : 100/-

**ఎంపిక చేసిన 15 పుస్తకాలు. అన్ని పుస్తకాల విలువ రూ. 1205/-.**

**ఇప్పుడు 600/- చెల్లిస్తే రిజిస్టర్ పోస్టులో పంపుతాం.**

ప్రజాశక్తి బుక్‌హౌస్, గూగుల్ పే, ఫోన్‌పే నెం : **9291603475**

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 94900 99057**